RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక


Website: prajabalam.in




05 జనవరి 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:185

## ఏపీ లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణపై పడే ప్రభావంపై అధ్యయనం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, జనవరి 4 ఆంధ్రప్రదేశ్?లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణపై పడే ప్రభావంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో నివేదిక తయారు చేయించాలని ఆదేశించారు. నెల రోజుల్లో సమగ్ర నివేదిక తయారు చేయాలని స్పష్టం చేశారు. ఇవాళ ఇరిగేషన్ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ఐఐటీ హైదరాబాద్ టీంతో సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

2022లో 27 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినప్పుడు భద్రాచలం ముంపునకు గురైనట్లు సీఎంకు నీటిపారుదలశాఖ అధికారులు వివరించారు. ఈ మేరకు పోలవరం నిర్మాణంతో భద్రాచలం దేవాలయానికి ఏర్పడే ముప్పుపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన గోదావరి బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని కూడా అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రాజెక్టుపై ఇటీవల ఏపీ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని తెలిపారు. వరద జలాల ఆధారంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని సీఎంకు రేవంత్?రెడ్డికి అధికారులు చెప్పారు.

బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరాలను తెలపాలి : బనకచర్లపై ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలంగాణ అభ్యంతరాలను తెలపాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుతో పాటు కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని ఆదేశించారు. సమావేశంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్?కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ పాల్గొన్నారు.

ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు పోలవరం, అమరావతి నిర్మాణ పనులపై దృష్టి పెట్టారు. ఈ మేరకు ఆగస్టు 2024లో పోలవరం, అమరావతి నిర్మాణ పనులు వేగంగా సాగేందుకు సహకారం అందించాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరారు. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణపై పడే ప్రభావంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు.

## 3 కోట్ల 54 లక్షల వివిధ పనులకు శంకుస్థాపనలు చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , ఎమ్మెల్యే దానం నాగేందర్



**జీహెచ్ఎంసీ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, జనవరి 04: నగర ప్రజలకు అన్ని సౌకర్యాలతో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి పనులు చేపట్టబడుతున్నామని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.

శనివారం నాడు 3 కోట్ల 54 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ పనులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ తో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడంలో నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగా వివిధ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు మేయర్ తెలియజేశారు. అందులో భాగంగా తాజ్ కృష్ణ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు రూ. 11.5 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను, జివికె మాల్ ఎదురుగా రూ. 12.75 లక్షల తో పూర్తి చేసిన జంక్షన్ అభివృద్ధి పనులను మేయర్ ప్రారంభించారు. రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టిన జవహర్ నగర్ పార్క్‌లో ఓపెన్ ఎయిర్ మినీ థియేటర్ ను ప్రారంభోత్సవం చేశారు. కె బి ఆర్ పార్క్ దగ్గర జంక్షన్ అభివృద్ధిలో భాగంగా రూ.1.96 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన సుందరీకరణ పనులను ప్రారంభించారు.



నంది నగర్ రోడ్ నెం. 14 లో మల్టిపుల్ ప్రాంతాలను కలుపుతూ (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి నంది నగర్ వరకు) రూ. 145.80 లక్షల వ్యయంతో చేపడుతున్నసీసీ రోడ్డు నిర్మాణ పనులకు,బంజారాహిల్స్ రోడ్ నెం.14లో రూ.148 లక్షల వ్యయంతో మసీదు నుంచి బ్రహ్మకుమారీస్ వరకు వివిధ ప్రాంతాలను కలుపుతూ నిర్మిస్తున్న సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనులతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని మేయర్ పేర్కొన్నారు.

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన రవాణా అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత నివ్వడం జరిగిందని హెచ్ సిటి ద్వారా నగరంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అండర్ పాస్ లు ఫ్లై ఓవర్ లు నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంలో నియోజక అభివృద్ధి నిధుల క్రింద 60 కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఇట్టి నిధులతో ప్రజలకు మౌళిక వసతులు సి సి రోడ్లు, పైపు నీటి సరఫరా పనులు ఇతరత్రా అవసరమైన పనులను చేపట్టేందుకు ప్రణాళిక ను సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఎస్.ఇ రత్నాకర్, కార్పొరేటర్ మన్నె కవిత, ఈఈ లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణపై పటిష్టమైన చర్యలు

### రాష్ట్ర రవాణా,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 04 :** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఈ నేపథ్యంలో రహదారి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా,వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం హైదరాబాద్ నుండి రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు,రవాణా, విద్యా శాఖల అధికారులు, ఆర్.టి.సి.అధికారులతో రహదారి భద్రత మాసోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ఈ నెల 31వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రహదారులపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్) లను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లాలో రోడ్డు భద్రత అవగాహన కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాలు జరిగిన వెంటనే గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని, అంబులెన్స్,ఆసుపత్రులు, రహదారులకు లింకేజ్ చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తెలుసుకొని ఉండాలని, మండల, జిల్లా కేంద్రాలలో విద్యార్థులతో ర్యాలీ,రంగోలి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను విద్యార్థులకు పాఠ్యాంశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకుంటామని, రోడ్డు భద్రతా నియమాలను ఒకసారి కంటే ఎక్కువగా ఉల్లంఘించిన వారి లైసెన్స్ రద్దు చేసి భవిష్యత్తులో తిరిగి లైసెన్స్ జారీకి వీలు లేకుండా సాఫ్ట్వేర్ రూపొందిస్తున్నామని తెలిపారు.రోడ్డు భద్రత నిబంధనలపై సామాజిక మాధ్యమాల వేదికగా విస్తృత ప్రచారం కల్పించాలని, ఎంపిక చేయబడిన పాఠశాలల్లో ట్రాఫిక్ పార్క్ ఏర్పాటు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులను భాగస్వామ్యం చేస్తూ అవగాహన శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. రోడ్డు భద్రతా నియమ, నిబంధనల పుస్తకాలను స్థానిక భాషలోకి అనువదించి జిల్లా అధికారిక వెబ్సైట్లలో నమోదు చేయాలని, మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో చురుగ్గా పని చేసిన వారిని గుర్తించి జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా జ్ఞాపికలు అందించి ప్రోత్సహించాలని, విద్యార్థులకు చిన్నతనం నుంచి ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...రహదారి భద్రత మాసోత్సవాలను జిల్లాలో విజయవంతం చేసే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని, మూలమలుపులు, వేగనిరోధకాలు, వేగ పరిమితి, యు టర్న్, ఇతర సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రహదారుల మరమ్మత్తులు జరిగే ప్రాంతాలలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రమాదాల నియంత్రణలో భాగంగా విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, విద్యార్థులతో ర్యాలీలు,పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు ప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు, ఇతర వాహనచోదకులు సీట్బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్కుమార్, రోడ్లు-భవనాల శాఖ అధికారి రాము,జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి,జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్, ఎక్సైజ్ సి.ఐ.,మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాహ్ చాయ్ : పొంగులేటి

### ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ స్టాల్ ను ప్రారంభించిన మంత్రి



**పాలేరు నియోజకవర్గం ప్రతినిధి జనవరి 4 (ప్రజాబలం)** పాలేరు నియోజకవర్గం ఏరా చెల్లమ్మ నీదేనా రా షాప్ ఏం రెడీ చేసావ్ టీ చేశావా ఇవ్వు వాహ్ భలే ఉంది రా చాయ్ అంటూ ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో టీ స్టాల్ ఏర్పాటు చేసిన మహిళను తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్ లో ఏర్పాటు చేసిన ఆ టీ స్టాల్ ను శనివారం మంత్రి పొంగులేటి, ఎంపీ రామసహాయం రఘు రాం రెడ్డి తో కలిసి ప్రారంభించారు. మహిళలు స్వశక్తి తో ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పేరుతో రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తుందని తెలిపారు

ప్రజాబలం

05 జనవరి 2025 ఆదివారం

# మిట్ట కందల గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టండి.

## ఎమ్మార్పీఎస్ స్వాములు మాదిగ డిమాండ్

శ్రీశైలం నంద్యాల జిల్లా పాములపాడు మండలం మిట్ట కందల గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ లింగాల స్వాములు మాదిగ ప్రభుత్వ అధికారుల డిమాండ్ చేశారు సందర్భంగా స్వాములు మురికి వాడలను చూపిస్తూ ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా పాములపాడు మండలం మిట్ట కందల గ్రామంలో దాదాపుగా కొన్ని సంవత్సరాల నుండి ఎంపీపీ స్కూల్ ఎస్సీ కాలనీలలోనీ ప్రధాన కూడలిల లో రోడ్లపై నిరంతరం మురికి నీరు ప్రవహించి ఆ నీటి ద్వారా దోమలు వ్యాపించి డెంగ్యూ మలేరియా విష జ్వరాలతో బాధపడుతున్నటువంటి సంఘటనలు గ్రామంలో ఉన్నాయని ఆయన అన్నారు. ఈ విషయాలపై పంచాయతీ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించిన ఫలితం శూన్యమని ఆయన అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామపంచాయతీలను పటిష్టం చేయాలని ప్రభుత్వం తలంచి లక్షల్లో గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తే ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన అన్నారు.వెంటనే గ్రామంలో పారిశుద్ధ్య పనులు మొదలుపెట్టి చెత్త కుప్పలు మురికి నీరు లేకుండా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిమెంట్ రోడ్లకు ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మించాలని ఆయన అన్నారు.గ్రామంలోని ప్రజలు మురికి నీరులోనే నడసాల్సిన పరిస్థితి వస్తుందని వెంటనే మండల అధికారులు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని లేదంటే ఈ విషయాలపై జిల్లా కలెక్టర్కు పంచాయతీ అధికారులపై ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బతుకులయ్య పోలీస్ వెంకటయ్య సుదర్శనం అబ్రహం ఆగస్టు తదితరులు పాల్గొన్నారు

# కలకలం రేపుతున్న హెచ్ఎంపివి వైరస్

గత ఐదేళ్లుగా కరోనా మహమ్మారి మిగిల్చిన గాయాలను ప్రపంచ మానవాళి మరువక ముందే చైనాలో మరో వైరస్ విస్తరిస్తూ అంటువ్యాధిగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, బలహీన రోగనిరోధకశక్తిగల వర్గాలపై తన ప్రభావాన్ని చూపుతూ మరో ప్రజారోగ్య విపత్తుగా మారవచ్చని వార్తలు గుప్పుమంటున్న వేళ ఆ వైరస్ ప్రభావాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుసుకోవడం మనకు తప్పనిసరి అవుతున్నది. వైరస్‌ల పుట్టిల్లుగా మారిన చైనాలో కరోనా బయటపడి ప్రపంచ మానవాళిని కుదిపేస్తూ, లక్షల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటూ, కోట్ల మందిని ఆసుపత్రుల పాలు చేసింది. అదే తరహాలో నేడు మరో వైరస్ "హ్యూమన్ మెటా న్యూమో వైరస్, హెచ్ఎంపివి"ను చైనా ప్రపంచానికి బహుమతిగా ఇవ్వనుందన్న వార్తలు ప్రపంచ మానవాళిని భయం పెడుతున్నాయి. భారత కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వర్గాలు హెచ్ఎంపివి వైరస్ వ్యాప్తి, ప్రభావాలను నిశితంగా పరిశీలిస్తూ దేశ ప్రజల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నాలు చేస్తున్నది.హెచ్ఎంపివి అంటువ్యాధి ప్రభావంతో 14 ఏండ్ల లోపు, ముఖ్యంగా 5 ఏండ్ల లోపు పిల్లల్లో తీవ్రమైన శ్వాస సంబంధ సమస్యలు ఉత్పన్నం అవుతున్నట్లు గమనించారు. ఈ వైరస్ సోకిన వ్యక్తుల్లో దగ్గు, జ్వరం, నాసల్ కంజెషన్(ముక్కు దిబ్బడా), శ్వాస తేలికగా ఆడకపోవడం, గొంతు నొప్పి, ఇతర శ్వాస ఇబ్బందులు, బ్రాంకైటిస్, న్యుమోనియా లాంటి అనారోగ్య లక్షణాలు బయట పడుతున్నట్లు గమనించారు. తొలి సారి రెండు దశాబ్దాల క్రితం 2001లో నెథర్‌ల్యాండ్స్‌లో కనుగొన్న ఈ వైరస్ కేసులు 2011-12లో అమెరికా, కెనడా, యూరోప్ దేశాల్లో కూడా నమోదు అయినట్లు తెలుస్తున్నది. "న్యూమోవిరిడే" కుటుంబానికి చెందిన "సింగిల్-స్ట్రాండెడ్ (ఏక చిక్కుకుపోయిన) ఆర్ఎన్ఏ (రైబో న్యూక్లిక్ ఆసిడ్)" శ్వాస సంబంధ వైరస్ ఒక ఏడాది లోపు వయస్సు కలిగిన చిన్నారుల్లో కూడా గమనించడం జరిగింది. ఈ వైరస్ వ్యాప్తి గురించి వెంటనే భయపడవలసిన అవసరం లేదని వైద్య వర్గాలు భరోసా ఇస్తున్నప్పటికీ కరోనా మహమ్మారి చేదు అనుభవం మానవాళిని భయకంపితులను చేస్తున్నది. హెచ్ఎంపివి వైరస్ చికిత్సకు ప్రత్యేకమైన "ఆంటీ-వైరల్ డ్రగ్స్ లేదా టీకా మందు" నేడు అందుబాటులో లేవని, అన్ని వయస్సుల వారికి ఈ వైరస్ సోకే అవకాశం ఉందని తెలుపుతున్నారు. ఫ్లూ-లాంటి అనారోగ్య సమస్యలు బయట పడుతున్న ఈ వేళల్లో ఈ వైరస్ సోకిన 3 నుంచి 6 రోజుల్లో తన ప్రభావాన్ని చూపవచ్చని వివరిస్తున్నారు.హెచ్ఎంపివి వైరస్ ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాప్తి చెందుతున్నట్లు గమనించారు. హెచ్ఎంపివి సోకిన వ్యక్తులు దగ్గడం, తుమ్మడం ద్వారా తుంపర్ల రూపంలో మరొకరికి సోకుతుంది. వైరస్ సోకిన వ్యక్తి నుంచి బయట పడే ద్రవాలను లేదా వ్యక్తులను ఇతరులు తాకడం. పీల్చడం, కరచాలనం చేయడం, ఆ ద్రవాలు పడిన ప్రదేశాలను ఇతరులు తాకడం, వారి ముక్కు/నోరు/నేత్రాలను తాకడం మొదలైన కారణాలతో హెచ్ఎంపివి ఇతరులకు సోకుతుంది. ఈ విషయాలను గమనిస్తూ కరోనా కాలంలో పాటించిన నియమనిబంధనలను (భౌతిక దూరాలు పాటించడం, క్వారంటైన్, మాస్కులు, సానిటైజర్లు) కూడా ఇప్పుడు పాటించవలసి వస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. శీతల వాతావరణంలో సులభంగా వ్యాప్తి చెందగల హెచ్ఎంపివి వైరస్ వ్యాప్తి భారత్ లాంటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే దేశాల్లో కొంత నెమ్మదిగా విస్తరించవచ్చని అంటున్న విషయాలు మనకు కొంత ఊరటను కలిగిస్తున్నాయి. ఇప్పటికీ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎలాంటి హెచ్చరికలు చేయలేదని, అంత భయపడవలసిన ప్రమాదం ఏదీ లేదని వైద్య ఆరోగ్య వర్గాలు ధైర్యాన్ని అందిస్తున్నారు. అయినప్పటికీ "వ్యాధి చికిత్స కన్న వ్యాధి నివారణ మిన్న" అనే నినాదాన్ని గుర్తుంచుకొని మన జాగ్రత్తల్లో మనం ఉందాం, మన ఇంట్లోని పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల విషయంలో జాగ్రత్తగా ఉందాం. చేతులు కాలక ముందే ఆకులు సిద్ధం చేసుకుందాం, ప్రమాదం విరుచుకుపడక ముందే జాగ్రత్తలు తీసుకుందాం.

# విద్యతోనే ఉజ్వల భవిత

**ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యారంగంలో విశేష సంస్కరణలు.**

**అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు బంగారు భవిష్యత్తు పొందాలి.**

**-మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు**

**స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం.**

మైలవరం,"విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుంది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యారంగంలో విశేష సంస్కరణలు అమలు చేస్తున్నాం.అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు బంగారు భవిష్యత్తు పొందాలి." అని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.

మైలవరంలోని వీ.వీ.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని గౌరవ మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. మెనూలో చేర్చిన ఆహార పదార్థాలు పరిశీలించారు. రుచితో పాటు శుచిగా భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా ప్రార్ధనా గీతాన్ని ఆలపించారు

ఈ సందర్భంగా శాసనసభ్యులు కృష్ణప్రసాదు గారు మాట్లాడుతూనేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు.ఇంటర్మీడియట్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ నిర్మాణాత్మక చర్యలకు శ్రీకారం చుట్టారు.రాష్ట్రవ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,48,419 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు.

గత ప్రభుత్వ విధానాలతో నిర్వీర్యమైన ఇంటర్ విద్యను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల హాజరుశాతం, పోషకాహారం పంపిణీ, అత్యుత్తమ ఫలితాల సాధనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకే భోజన మెనూలో కూడా మార్పులు చేసింది.జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సంకల్ప్ పేరిట వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. దీనికోసం సాయంత్రం అదనంగా గంట సమయం కళాశాలలో స్టడీ అవర్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణతో విద్యార్థులు స్టడీ అవర్స్ ను సైతం చక్కగా సద్వినియోగం చేసుకోవాలి.అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వారిని నిరంతరం పర్యవేక్షించాలి. ముఖ్యంగా దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకతను పెంచుకోవడానికి వినియోగించాలి.స్మార్ట్ ఫోన్లను, కంప్యూటర్లను, వాటిలో ఉండే సమాచారాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వాటివల్ల మంచి ఎంత ఉంటుందో...చెడు కూడా అంతే ఉంటుంది. మంచిని గ్రహించి, చెడుకు దూరంగా ఉండాలి.విద్యార్థులు సానుకూల దృక్పథం, క్రమశిక్షణ, పట్టుదల, సమయస్ఫూర్తి, కార్యదీక్ష, అంకితభావం, తెలివితేటలు, చురుకుదనం కలిగిఉండాలి.ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలనే తపన కలిగిఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులు వారిపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలి. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారు చెప్పిన విధంగా కలలు కని, వాటిని సాకారం చేసుకోవాలి.నేడు గొప్పవాళ్లుగా ఎదిగిన ఎందరో మహానుభావులందరూ ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.విద్యార్థులకు ప్రేరణ కలిగించే గొప్పవాళ్ళ విజయాలను వివరించారు. అనంతరం పి.ఆర్.టి.యు క్యాలెండర్లు, సేన దినపత్రిక క్యాలెండర్లను శాసనసభ్యులు కృష్ణప్రసాదు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం అందించేందుకు మధ్యాహ్నం భోజనం.. ఎమ్మెల్యే గిత్త

## పోషకాహారంతో పేద విద్యార్థులకు మేలు

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే



నందికొట్కూర్ : రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. శనివారం మండల కేంద్రమైన మిడుతూరు లోని స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు అన్నపూర్ణ గావించిన తల్లి డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించడం పేద విద్యార్థులకు ఒక వరం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో1,48,419 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ పథకం అమలు కానుందని475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో398 కళాశాలలకు సమీపంలోని పాఠశాలలకు అనుసంధానమై ఉండడంతో పాఠశాలల్లోనే భోజనం తయారు తయారుచేయునట్లు తెలిపారు. ఈ పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం 432 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం1422 కోట్లు రాష్ట్ర విద్యార్థులకు ఖర్చు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరాలంటే దాదాపు రెండు లక్షల ఖర్చు అవుతుందని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థులకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బ్యాగ్ ,నోట్ బుక్స్ తో 16 వేల రూపాయల విలువ చేసే స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు తెలిపారు.

గత టిడిపి ప్రభుత్వంలో ఉన్న ఈ పథకాన్ని వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసి నీరుగార్చిందని ఆయన ఆరోపించారు. విద్యార్థిని ,విద్యార్థులను ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సంపాదించి గ్రామానికి మరియు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇది మంచి ప్రభుత్వం పేరుతో కార్యక్రమం నిర్వహించిందన్నారు.

రుచికరమైన భోజనం అందించడంతోపాటు కళాశాలలో హాజరు శాతం పెరిగి ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. అనంతరం మిడుతూరు జూనియర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ బి.శంకర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కళాశాలలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. పదివేలు పెట్టి గ్లాసు,ప్లేట్ ఇవ్వడం జరిగింది అన్నారు. కళాశాలకు దివంగత కేడీసీసీ చైర్మన్ కాతా అంకిరెడ్డి సహాయ సహకారాలు మరువలేనివి అన్నారు. కళాశాల ప్రారంభించి 24 ఏళ్లు పూర్తవుతుందని కళాశాలకు నాలుగు బిల్డింగులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సిల్వర్ జూబ్లీ జరిపే లోపు నాలుగు బిల్డింగులు శాంక్షన్ చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నందికొట్కూరు నియోజవర్గానికి పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా ఆయన స్పందించారని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకానికి ఆదర్శ మహిళ అయిన డొక్కా సీతమ్మ పేరు పెట్టడం శుభసూచికమని కూటమి ప్రభుత్వ నిర్ణయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు .కళాశాల ప్రిన్సిపల్ తో పాటు వారి సిబ్బంది ఎమ్మెల్యేకు మరియు రాజకీయ నాయకులకు పూలమాలవేసి దుశ్యాలువతో సన్మానించారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించడంతోపాటు విద్యార్థిని ,విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జయలక్ష్మమ్మ ,ఎంపీడీవో దశరథ రామయ్య, ఎంఈఓ ఫైజున్నిసా బేగం, మిడుతూర్, పగిద్యాల టిడిపి మండల కన్వీనర్లు కాతా రమేష్ రెడ్డి, పలుచాని మహేశ్వర్ రెడ్డి, నందికొట్కూరు మాజీ ఎంపీపీ వీరం ప్రసాద్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మాంద్ర సురేంద్ర నాథ్ రెడ్డి, గుండం సర్వోత్తమ్ రెడ్డి, వంగాల శివరామిరెడ్డి, రోళ్ళపాడు మాజీ సర్పంచ్ నాగ స్వామి రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం .ప్రభాకర్, కళాశాల సిబ్బంది సీతారామరాజు, ఎల్లన్న ,రామచంద్ర ,కోటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను వణికిస్తోన్న చలి

## సంగారెడ్డి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు

హైదరాబాద్ జనవరి 4 తెలంగాణను చలి వణికిస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎముకలు కొరికే చలి ఉండడంతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. ఇంటి నుంచి కాలు తీసి బయట పెట్టాలంటేనే భయపడిపోతున్నారు. ఉదయం 10 గంటల వరకు చలి వీడడం లేదు. మంచు కూడా విపరీతంగా కురుస్తుండటంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ఇక సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సిర్పూర్ యూ(ఆసిఫాబాద్)లో 6.1, అర్లి(టి)(ఆదిలాబాద్)లో 6.2, గిన్నెదరి(ఆసిఫాబాద్)లో 6.2, న్యాల్‌కల్(సంగారెడ్డి)లో 6.3, రెడ్డిపల్లి(రంగారెడ్డి)లో 6.8, డోంగ్లీ(కామారెడ్డి)లో 6.8, చందనపల్లి(రంగారెడ్డి)లో 6.9, బేల(ఆదిలాబాద్)లో 6.9, తిర్యాని(ఆసిఫాబాద్)లో 7.1, అల్మాయిపేట(సంగారెడ్డి)లో 7.3, ఎలిమినేడు(రంగారెడ్డి)లో 7.4, రాంనగర్(ఆదిలాబాద్)లో 7.5, మల్‌చెల్మ(సంగారెడ్డి)లో 7.5, మేనూరు(కామారెడ్డి)లో 8.2, బోడాగల్(మెదక్)లో 8.4, రాజాపూర్(మహబూబ్‌నగర్)లో 8.4, కోట్‌పల్లి(వికారాబాద్)లో 8.5, నిర్మల్ జిల్లా కుబీర్‌లో 8.8, పెంబీలో 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఇక హైదరాబాద్‌లో అతి తక్కువగా బీహెచ్ఈఎల్‌లో 8.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో 9.1, మౌలాలిలో 9.5, శివరాంపల్లిలో 11.2, కుత్బుల్లాపూర్‌లో 11.8, వెస్ట్‌మారేడ్‌పల్లిలో 11.8, గచ్చిబౌలిలో 12, గోల్కొండలో 12.4, పటాన్‌చెరులో 13.1, హయత్‌నగర్‌లో 13.3, లింగంపల్లిలో 13.7, జీడిమెట్లలో 14.8, చాంద్రాయణగుట్టలో 14.1, అంబర్‌పేటలో 14.7, కూకట్‌పల్లిలో 15.1, కంటోన్మెంట్‌లో 15.2, ముషీరాబాద్‌లో 15.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# వడ్డేమాన్, దామగట్ల లో ఈసీసీఈ డే కార్యక్రమం

## దామగట్లలో హాజరైన సిడిపిఓ కోటేశ్వరి

నందికొట్కూర్ ప్రతినెలా 5వ తేదీన అంగన్వాడీ కేంద్రాలలో బాల్య సంరక్షణ మరియు విద్య( ఈసీసీఈ) దినోత్సవాన్ని జరుపుకుంటారని నందికొట్కూర్ సిడీపీఓ కోటేశ్వరి తెలిపారు. శనివారం మండల పరిధిలోని వడ్డేమాన్ మరియు దామగట్ల గ్రామాల్లో ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటేశ్వరమ్మ మరియు గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లల సమగ్ర అభివృద్ధి గురించి తెలుసుకోవడానికి ప్రతి నెల 5వ తేదీన ఒక అవకాశం ఉంటుందన్నారు. ఈసీసీఈ అనేది బాల్య విద్య మరియు అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను హైలెట్ చేసే గ్లోబల్ ఈవెంట్ అని రక్షిత వాతావరణం లో పిల్లలు ప్రతి స్పందించే సంరక్షణ మరియు ముందస్తు అభ్యాసాన్ని పొందేలా చూడడం దీని లక్ష్యం అన్నారు. చిన్నపిల్లల్లో మూడు సంవత్సరాల లోపు పిల్లలకు మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని మరియు శారీరక అభివృద్ధి, మానసిక అభివృద్ధి, బాగోద్వేగా అభివృద్ధి ఇవన్నీ బాగా స్కిల్ డెవలప్మెంట్ అంగన్వాడీ సెంటర్లలో అందించడం ద్వారా బాగా డెవలప్మెంట్ ఉంటుందని తల్లులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వడ్డేమాన్ అంగన్వాడీ కార్యకర్తలు శెట్టి లలితమ్మ, గాదె వెంకట రవణమ్మ, ఇందిరమ్మ , దామగట్ల అంగన్వాడీ కార్యకర్తలు ప్రభావతి ,సుజాత ,రత్నకుమారి గోకారమ్మ, అంగన్వాడీ ఆయాలు శ్రీలక్ష్మి, మమత ,సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు

# పాత్రోచిత మాటల మాంత్రికుడు

తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంత సులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలామంది రచయితలకు ఎక్కువమంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాల చందర్ తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండతెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్యతరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు. గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్బై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు. బాలచందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలకపాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్‌పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్‌పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభిం చింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రో కు గుర్తింపు తెచ్చాయి. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరిగ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుం జయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమకూర్చారు.125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. "హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం"... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం. ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి.సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (2013) (సంభాషణలు, శ్రీకాంత్ అడ్డాలతో కలిసి), 9 నెలలు (2001), నిర్ణయం (1991) (సంభాషణలు, పాటలు), సీతా రామయ్య గారి మనవరాలు (1991), రుద్రవీణ (1988), గౌతమి (1987), తలంబ్రాలు (1986), ప్రేమించు పెళ్ళాడు (1985), మయూరి (1984), మనిషికో చరిత్ర (1984), గుప్పెడు మనసు (1979) (సంభాషణలు), ఇది కథ కాదు (1979), మరో చరిత్ర (1978), అత్తవారిల్లు (1976) తదితర చిత్రాలకు పనిచేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొంది, గణేష్ 69 ఏళ్ళ వయసులో 2015, జనవరి 5న తెలుగు సినిమా పుస్తకంలో చెరగని సంతకం చేసి కన్నుమూశారు.

## వైవిధ్యాన్ని కోరుకునే దర్శకుడు

తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంతసులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం.

కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలా మంది రచయితలకు ఎక్కువమంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాలచందర్‌తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండతెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్యతరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు. గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్బై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు.బాలచందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలకపాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్‌పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్‌పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు.

మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు.

పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభిం చింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రో కు గుర్తింపు తెచ్చాయి. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు.

రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరిగ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో.

సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుం జయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమకూర్చారు.125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. "హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం"... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం. ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (2013) (సంభాషణలు, శ్రీకాంత్ అడ్డాలతో కలిసి), 9 నెలలు (2001), నిర్ణయం (1991) (సంభాషణలు, పాటలు), సీతారామయ్య గారి మనవరాలు (1991), రుద్రవీణ (1988), గౌతమి (1987), తలంబ్రాలు (1986), ప్రేమించు పెళ్ళాడు (1985), మయూరి (1984), మనిషికో చరిత్ర (1984), గుప్పెడు మనసు (1979) (సంభాషణలు), ఇది కథ కాదు (1979), మరో చరిత్ర (1978), అత్తవారిల్లు (1976) తదితర చిత్రాలకు పనిచేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొంది, గణేష్ 69 ఏళ్ళ వయసులో 2015, జనవరి 5న తెలుగు సినిమా పుస్తకంలో చెరగని సంతకం చేసి కన్నుమూశారు.

# వెన్నెముకకు గాయం పక్షవాతానికి దారి తీస్తుందా?

వెన్నెముక పూర్తిగా తెగిపోయినా, పక్షవాతానికి గురైనా తిరిగి నడవగలిగేలా చేసే అత్యంత ఆధునిక వైద్య చికిత్సలు కూడా ఉన్నాయి. 1997 ప్రాంతంలో మోటార్ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇటలీ యువకుడు మైఖేల్ రొక్కాటి తన వెన్నుపూస పూర్తిగా దెబ్బతినడంతో పక్షవాతానికి గురయ్యాడు. కాళ్లలో స్పర్శ కోల్పోయాడు. స్విట్జర్లాండ్‌లో దీనికి శస్త్రచికిత్స చేసిన డాక్టర్లు ఆయన వెన్నుముకలో ఎలక్ట్రికల్ ఇంప్లాంట్ అమర్చడంతో మెదడు నుంచి ఆగిపోయిన సంకేతాలు తిరిగి పని చేయడం ప్రారంభించాయి. కాళ్ల వరకు సంకేతాలు అందగలిగాయి. దీంతో తిరిగి కోలుకుని నడవగలిగాడు. మైఖేల్ ఇంతవేగంగా కోలుకోవడాన్ని చూసి ఆయనకు శస్త్రచికిత్స చేసిన డాక్టర్లే ఆశ్చర్యపోయారు.వెన్నుపాము అనేది నాడీ వ్యవస్థలోని నరాలు, కీళ్లు, కండరాలు, స్నాయువు, అస్థిపంజరాలతో కూడిన కేంద్ర నాడీ మండలానికి చెందిన సంక్లిష్టమైన అనుసంధాన వ్యవస్థ. సన్నగా, పొడవుగా, గొట్టం మాదిరిగా ఉండి మెదడు నుంచి సందేశాలను శరీరమంతటికీ పంపిస్తుంది. అలాగే బాహ్యశరీరం నుంచి సందేశాలను మెదడుకు పంపుతుంది. సాధారణంగా మనకు వెన్నునొప్పి వస్తుంటుంది. వెన్నుపాము నుంచి ఉద్భవించిన నరాలు కాళ్లలోకి, మోచేతుల్లోకి ప్రయాణించి శరీరంలోని వివిధ విభాగాలకు నొప్పిని వ్యాపింప చేస్తుంటాయి. జీవితంలో ప్రతి పది మందిలో తొమ్మిది మంది పెద్దవాళ్లకి, అలాగే ప్రతి పది మంది శ్రామికుల్లో ఐదు మంది, ప్రతి సంవత్సరమూ వెన్నునొప్పితో బాధపడుతుంటారని కొన్ని నివేదికలు చెబుతున్నాయి. ఈ నొప్పి తీవ్రమైనప్పుడు వైద్యులను సంప్రదించవలసి ఉంటుంది.అలాగే వెన్నుకు గాయమైనా శరీర వ్యవస్థకు, మెదడుకు ఇబ్బంది కలుగుతుంది. వెన్నుముక గాయం ఒక్కోసారి పక్షవాతానికి దారి తీస్తుంది. కాళ్లూ చేతులు పక్షవాతానికి గురైతే మనిషిలో చలనం క్షీణిస్తుంది. మల, మూత్ర విసర్జనలపై నియంత్రణ కోల్పోవడం జరుగుతుంది. లైంగిక చర్యలో మార్పు వస్తుంది. వెన్నుముక గాయమైన వారిలో మానసిక, ఉద్రేక, సామాజిక రుగ్మతలు కూడా వస్తుంటాయి. బ్రిటన్‌లో దాదాపు 50,000 మంది వెన్నుముక గాయంతో బాధపడుతున్నారు. ఏటా మరో 2500 మంది ఈ జాబితాలో చేరుతున్నారు. వెన్నుముక గాయాలు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు, హింసాత్మక దాడులు, క్రీడలు, ఒక ఎత్తైన ప్రదేశం నుంచి జారిపడడం తదితర సంఘటనల వల్ల సంభవిస్తుంటాయి. నేషనల్ హెల్త్ సర్వీసెస్ మార్గదర్శకాల ప్రకారం ఈ రోగులకు తరచుగా మానసిక ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి. ఈ రోగులను గుర్తించిన తరువాత రెండేళ్ల వరకు ప్రతి ఆరుమాసాలకు మానసిక ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచిస్తున్నారు.

కానీ అలా జరగడం లేదని వైద్యనిపుణులు చెబుతున్నారు. శారీరక ఆరోగ్యం గురించే ఈ పరీక్షలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ రెండేళ్ల కాలం వీరికి ఏమాత్రం సరిపోదని, జీవితాంతం పరీక్షలు చేయించాలని సీనియర్ వైద్యులు సూచిస్తున్నారు. వీల్ ఛైర్లకే పరిమితమైన ఈ రోగుల్లో చాలా మందికి మానసిక ఆరోగ్యాన్ని పరీక్షించడానికి స్పెషలిస్టు సైకోథెరపిస్టు అవసరమని వైద్య నిపుణులు కొత్త మార్గదర్శకాల్లో వివరిస్తున్నారు. వెన్నుముక గాయానికి గురైన వారిలో పక్షవాతం రెండు రకాలుగా ఉంటుంది. టెట్రాప్లెజియా, పారాప్లెజియా అనే రెండు విధాలైన పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి. టెట్రాప్లెజియా అంటే క్వాడ్రిప్లెజియా అని కూడా వ్యవహరిస్తుంటారు. ఇందులో భుజాలు, చేతులు, కడుపు, కాళ్లు, కటి అవయవాలు పక్షవాతానికి గురవుతుంటాయి. పారాప్లెజియాలో కడుపులోని అన్ని అవయవాలు, కాళ్లు, కటి అవయవాలు పక్షవాతానికి గురవుతుంటాయి.అయితే చేతులు మాత్రం పక్షవాతానికి గురికావు. శరీరంలో నరాల స్థాయిని, గాయం పూర్తిగా మానడాన్ని వైద్యులు తరచుగా పరీక్షిస్తుంటారు. వెన్నుముక గాయం వల్ల చలనం కోల్పోతుంటారు. స్పర్శ జ్ఞానంలో మార్పు లేదా కోల్పోవడం జరుగుతుంది. వేడి, చల్లదనం, స్పర్శ కోల్పోవచ్చు. మల, మూత్ర విసర్జన నియంత్రణ కోల్పోవచ్చు. అసంకల్పిత చర్యలు, సంకోచాలు పెరుగుతాయి. వెన్నుపాములోని నరాల పోగులు దెబ్బతినడం వల్ల బాధ, ఏదో కుట్టుతున్నట్టు అనిపిస్తుంటుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటాయి. దగ్గు లేదా ఊపిరితిత్తుల్లో కఫం చేరినట్టు అవుతుంది. సాధారణంగా వెన్నుముకకు మామూలు గాయం అయితే ఒకంతట తెలియదు. తీవ్రస్థాయిలో ఉంటేనే తెలుస్తుంది. వెన్నుముక గాయపడడానికి, వైద్య చికిత్స అందించడానికి మధ్య ఉన్న సమయం చాలా కీలకమైనది. గాయాల స్థాయిని తెలుసుకుంటే సాధ్యమైనంతవరకు కోలుకునే పరిస్థితిని గుర్తించవచ్చు. గాయపడిన వ్యక్తిని కదిలించరాదు.దానివల్ల శాశ్వత పక్షవాతం, ఇతర తీవ్ర పరిణామాలు సంభవించవచ్చు. మెడకు రెండు వైపులా భారీ టవల్స్ ఉంచాలి. అత్యవసర వైద్యం అందేవరకు తల, మెడ, కదపకుండా ఉంచాలి. వెన్ను నొప్పితో పాటు మూడు రకాల క్యాన్సర్ల ఇతర లక్షణాలు కనిపించవచ్చు. వెన్నుముక క్యాన్సర్ సంకేతాలలో తిమ్మిరి, బలహీనత, చేతులు, కాళ్లలోసమన్వయ లోపం, పక్షవాతం కూడా ఉంటాయి. మూత్రాశయ క్యాన్సర్ ఉంటే మూత్ర విసర్జన సమయంలో రక్తం, నొప్పి, ఎక్కువగా ఉంటాయి. వెన్నుపాము రుగ్మతలు, క్షీణత నిర్ధారించడానికి వైద్య పరీక్షలున్నాయి. వెన్నుముక పగుళ్లు, కణుతులు తనిఖీ చేయడానికి ఎక్స్ రే, ఎంఆర్ఐ, సిటిస్కాన్ పరీక్షల్లో వెన్నుముకపై ఉన్న ఒత్తిడి తెలుస్తుంది. మైలోగ్రఫీ వల్ల వెన్నుముక స్థానం, అసాధారణతల ఉనికిని గుర్తించవచ్చు. కచ్చితమైన నరాల మూలాన్ని గుర్తించడానికి ఎలక్ట్రోమియోగ్రామ్ పరీక్షలున్నాయి. వెన్నునొప్పి తీవ్రతను బట్టి నివారించే స్పైరల్ ఫ్యూజన్, ఫోరమినోటమీ, డిస్సెక్టమీ, డిస్క్ మార్పిడి, ఇంటర్ లామినార్ ఇంప్లాంట్, వంటి అనేక రకాల సర్జరీలు అమలులో ఉన్నాయి.

వెన్నెముక పూర్తిగా తెగిపోయినా, పక్షవాతానికి గురైనా తిరిగి నడవగలిగేలా చేసే అత్యంత ఆధునిక వైద్య చికిత్సలు కూడా ఉన్నాయి. 1997 ప్రాంతంలో మోటార్ బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇటలీ యువకుడు మైఖేల్ రొక్కాటి తన వెన్నుపూస పూర్తిగా దెబ్బతినడంతో పక్షవాతానికి గురయ్యాడు. కాళ్లలో స్పర్శ కోల్పోయాడు. స్విట్జర్లాండ్‌లో దీనికి శస్త్రచికిత్స చేసిన డాక్టర్లు ఆయన వెన్నుముకలో ఎలక్ట్రికల్ ఇంప్లాంట్ అమర్చడంతో మెదడు నుంచి ఆగిపోయిన సంకేతాలు తిరిగి పని చేయడం ప్రారంభించాయి. కాళ్ల వరకు సంకేతాలు అందగలిగాయి. దీంతో తిరిగి కోలుకుని నడవగలిగాడు. మైఖేల్ ఇంతవేగంగా కోలుకోవడాన్ని చూసి ఆయనకు శస్త్రచికిత్స చేసిన డాక్టర్లే ఆశ్చర్యపోయారు. ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మందికి ఎలక్ట్రికల్ ఇంప్లాంట్‌ను డాక్టర్లు అమర్చగలిగారు. ప్రస్తుతం ఈ ఎలక్ట్రికల్ ఇంప్లాంట్ ద్వారా నడవగలిగే వరకు పురోగతి కనిపిస్తోంది. కానీ వెన్నెముకని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడానికి కావలసిన వైద్యం ఇంకా అభివృద్ధి చెందవలసి ఉంది. అందుకు స్టెమ్‌సెల్ థెరపీ (మూలకణాలతో చికిత్స) పద్ధతులు సాయపడవచ్చు. కానీ ఇంకా అవి పరిశోధనా క్రమంలోనే ఉన్నాయి. జీవితాన్ని మెరుగుపర్చడానికి ఇదొక సానుకూల ముందడుగే అయినప్పటికీ, ఈ టెక్నాలజీని రోజువారీ జీవితంలో ఉపయోగించడం తేలికైన విషయం కాదని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


## శంషాబాద్ విమానాశ్రయంలో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

రంగారెడ్డి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్ అయింది. ముంబాయి నుండి విశాఖపట్నం వెళుతున్న ఇండిగో విమానంలో సాంకేతిక లోపాన్ని పైలట్ గుర్తించారు. వెంటనే ల్యాండింగ్ కు హైదరాబాద్ ఏటీసీ నుండి అనుమతి తీసుకున్నాడు. శంషాబాద్ విమానాశ్రయం లో సేఫ్ గా విమానాన్ని ల్యాండ్ చేసాడు. ఘటన జరిగిన సమయంలో విమానం లో 144 మంది ప్రయాణీకులు వున్నారు.

## అయ్యప్ప పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్ శబరిమల యాత్ర, అయ్యప్ప స్వామి దివ్య దర్శనం జన్మజన్మల పుణ్యఫలం అని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఆదర్శ నగర్ లోని ఎమ్మెల్ఏ క్వార్టర్స్ లో తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో ని అయ్యప్పస్వాముల ఇరుముడి పూజ లో తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. పూజల అనంతరం అయ్యప్ప స్వాముల శబరిమల యాత్ర ను ఆయన ప్రారంభించారు.

# ఎర్త్...ఎవరికి... బెర్త్... ఎవరికి



విజయవాడ, జనవరి 4, రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలల పాలనను పూర్తి చేసుకుంది. ఇంకా ఏడాది కూడా కాలేదు. అయితే అప్పుడే రాష్ట్రంలోని మంత్రులను మార్చుతారా? కొంతమందికి ఉద్వాసనం పలికి, కొత్తవారికి అవకాశం ఇస్తారని చర్చ రాష్ట్రంలో ఊపందుకుంది.ఇదే విషయంపై ఇటు కూటమి పార్టీల్లోనూ, అటు ప్రజల్లోనూ విస్తృత చర్చ జరుగుతోంది. దీంతో కూటమి ప్రభుత్వంలోని ప్రధానంగా టీడీపీ మంత్రుల్లో కొంతమందికి గుండెల్లో భయం మొదలైంది. తమ పోస్టు ఉంటుందో, ఊడుతోందని అభద్రతా భావంలో ఉన్నారు. అయితే రాష్ట్రంలో మంత్రులను మార్చుతారనే చర్చ మంత్రి పదువుల ఆశావహులకు మాత్రం సంతోషాన్ని కలిగిస్తోంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి పట్టుమని పది నెలలు కాకుండానే ఈ చర్చ తెరపైకి వచ్చింది. అయితే దీనికి కొన్ని కారణాలు లేకపోలేదు. రాష్ట్రంలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు పనితీరు బాగానే ఉన్నప్పటికీ? కొంత మంది మంత్రులు పనితీరు సరిగ్గా లేదని చర్చ జరుగుతోంది.కొంత మంది మంత్రులను వివాదాలు కూడా వెంటాడుతున్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన గజపతినగరం ఎమ్మెల్యే, పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కోనసీమ జిల్లాకు చెందిన రామచంద్రాపురం ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కృష్ణా జిల్లాకు చెందిన నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వంటి వారిని ఇటీవలే వివాదాల చుట్టుముట్టాయి. అన్నమయ్య జిల్లాకు చెందిన రాయచోటి ఎమ్మెల్యే, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వంటి వారు కూడా గతంలో వివాదాలకు కేంద్రం అయ్యారు. దీంతో రాష్ట్రంలో మంత్రుల మార్పు జరుగుతోందని చర్చ జరుగుతోంది.రాష్ట్ర మంత్రివర్గం 26 మందితో ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా 25 మందితో మంత్రి వర్గం ఉంది. ఒక స్థానం ఖాళీగా ఉంది. అది జనసేన స్థానం. దాన్ని జనసేన నేత నాగబాబుతో భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరుగుతోందని చర్చ జరుగుతోంది.ఈ మంత్రి వర్గ విస్తరణలోనే కొంత మందికి మంత్రి పదవి ఉద్వాసన పలికే అవకాశముందని?. కొత్త వారికి మంత్రివర్గంలో చోటు కల్పించనున్నట్లు తెలుస్తోంది. ఏ సామాజిక వర్గం నుంచి మంత్రిని తొలగిస్తే, ఆ సామాజిక వర్గం నుంచే మరొకరికి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ మంత్రులను మార్చాల్సి వస్తే ఇప్పుడున్నవారిని తొలగించి? టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మాజీ మంత్రులు కళా వెంకట్రావు, పితాని సత్యనారాయణ వచ్చే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో కొంతమంది మంత్రుల పని తీరుపై అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఇటు కార్యకర్తలు, అటు ప్రజలు మంత్రుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల పనితీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునే సందర్భంలో కొంత మంది మంత్రుల పనితీరు ఆశించినంతగా లేదని స్పష్టం అయింది. అందువల్లనే పట్టుమని పది నెలలు కూడా గడవక ముందే కొంత మంది మంత్రుల పట్ల వ్యతిరేకత మొదలైంది. ఇది ప్రభుత్వానికి, టీడీపీ పార్టీకి నష్టంగా ఉండొచ్చని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వాటిని సరిచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతనిశ్చయంతో ఉన్నారు.ఇప్పటికే మంత్రుల పనితీరుపై కూడా ఆయన దృష్టి పెట్టినట్లు సమాచారం. ఎందుకంటే మంత్రి సుభాష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు క్లాస్ పీకినట్లు ఆడియో రికార్డు సోషల్ మీడియాలో కూడా కొద్దిరోజుల కిందట వైరల్ అయింది. ఇలా మంత్రివర్గ సమావేశాల్లోనూ, ఇతర సమయాల్లో పనితీరు బాగోలేని మంత్రులకు, వివాదాలకు కేంద్ర బిందువు అయిన మంత్రులకు క్లాస్ తీసుకుంటున్నారని తెలుస్తోంది.మంత్రితీరు పని ఎలా ఉంది? పని చేయని మంత్రులెవరని సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు రిపోర్టు తెప్పించుకున్నట్లు సమాచారం. ఆ నివేదిక ఆధారంగానే ఇద్దరు మంత్రులను తొలగించే అవకాశం ఉందని టీడీపీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

# సంక్రాంతికి వస్తున్నారా...రావట్లేదా

విజయవాడ, జనవరి 4,కాలర్ ఎగరేసుకుంటూ తిరిగే కొడాలి నాని ఇప్పుడు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు దూరంగా వెళ్లారు. ఎంతగా అంటే ఆయన కనిపించి కొన్ని నెలలు అవుతుంది. ఓటమి పాలయిన తర్వాత కొత్తలో కనిపించి కొంత హడావిడి చేసినట్లు కనిపించినా తర్వాత మాత్రం ఆయన మళ్లీ గాయబ్ అయ్యారు. ఆయన హైదరాబాద్ కే పరిమితమయ్యారంటున్నారు. ఆయన సన్నిహితులు, అనుచరులు ఎవరైనా కలవాలని భావించినా హైదరాబాద్ కు రావాలని సూచిస్తున్నారట.ఆయన గుడివాడకు వచ్చికూడా చాలా రోజులయింది. ఇక సంక్రాంతి పండగకు కొడాలి నాని వస్తారా? రారా? అన్న చర్చ కూడా గుడివాడ ప్రాంతంలో జోరుగా సాగుతుంది. ఇక తాజాగా కొడాలి నాని ప్రధాన అనుచరుడు కాళిని పోలీసులు అరెస్ట్ చేయడంతో ఆయనను కూడా అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరుగుతుంది. గుడివాడలో గెలుపునకు తనకు తిరుగులేదనుకున్న కొడాలి నానికి మొన్నటి ఎన్నికల్లో తొలిసారి ఓటమి ఎదురయింది. పార్టీలు మారినా గుడివాడ ప్రజలు కొడాలి నానిని అదరించారు. కానీ మొన్నటి ఎన్నికల్లో మాత్రం ఆయనకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నిజానికి ఆ ఓటమిని తాను కూడా ఊహించలేదు. గుడివాడ ప్రజలు తనను వదులుకోరని కొడాలని నాని పూర్తి విశ్వాసంతో ఉన్నారు. కానీ ప్రజలు మార్పు కోరుకుంటే ఎలాంటి ఫలితాలు వస్తాయో మొన్నటి ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీనికి ప్రధాన కారణం అభివృద్ధి పనులను పక్కన పెడితే ఆయన వాడిన భాష రాష్ట్ర స్థాయిలో జనంలో పెద్ద చర్చగా మారింది. రచ్చగా మారి అది ఓటర్లపై ప్రభావం చూపిందంటున్నారు.2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. అయితే ఆయన చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబ సభ్యులపై చేసిన విమర్శలతో జనంలోకి చొచ్చుకుని మరింతగా వెళ్లవచ్చునని అనుకన్నారు కానీ అది రివర్స్ అయింది. ఆయన మాటలు, బూతులు విన్న వారంతా ఆయనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అందుకే కౌంటింగ్ జరుగుతున్నసమయంలోనే కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇక అప్పటి నుంచి కొడాలి నాని పెద్దగా యాక్టివ్ గా లేరు. ఎందుకంటే ఆయనకు కేసుల భయం పట్టుకుంది. తనను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేస్తారని తెలుసు. ఇప్పటికే కొడాలి నాని అనుచరులు అనేక కేసుల్లో అరెస్ట్ అయ్యారు. ఇదేజిల్లాలో మరో మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబంపై కూడా కేసులు నమోదు అయ్యాయి. దీంతో కొడాలినాని కూడా కొంత కేసుల భయం పట్టుకుందని చెబుతున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి కొడాలి నాని విషయంలో వెనక్కు వెళ్లవద్దంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వత్తిడులు కూడా ఎక్కువయ్యాయంటున్నారు. అదే సమయంలో నారా లోకేష్ రెడ్ బుక్ లోనూ కొడాలి నాని పేరు మొదటి పేజీలో ఉందన్న కామెంట్స్ ఆయనకు నిద్రలేకుండా చేస్తున్నాయి.

## రైల్వే జోన్ డీపీఆర్ పై రాని క్లారిటీ...

విశాఖపట్టణం, జనవరి 4,ఉత్తరాంధ్రలోని విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రావడం లేదు. ప్రతిసారి రైల్వే జోన్ అంటూ ఏదో ఒక అప్‌డేట్ వస్తుంది, కానీ కనీసం శంకుస్థాపన కూడా జరగలేదు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక గతంలోనే సిద్ధం చేసినా ఇంకా ఆమోదం రాకపోవడం హాట్ టాపిక్ అవుతోంది. అసలే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటన ఫిక్స్ అని, ఆయన రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారన్న ప్రచారం స్థానికంగా ఊపందుకుంది. తీరా చూస్తే డీపీఆర్‌కు ఆమోదం రాకుండా, శంకుస్థాపన జరుగుతుందా.. ఇంతకీ ప్రధాని మోదీ వస్తారా లేదా కొత్త టెన్షన్ మొదలైంది. 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనరకు రానున్నారని, విశాఖ రైల్వే జోన్ పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రచారం జరుగుతోంది. కానీ రియాలిటీకి వస్తే ముందు డీపీఆర్‌పై ఎటూ తేలలేదు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రం ఫిబ్రవరి 2019లోనే ప్రకటింటించి. అదే ఏడాది డీపీఆర్ ను కూడా రూపొందించారు. రైల్వే జోన్ స్వరూపాన్ని చూపించే డీపీఆర్ మాత్రం ఇంకా ఆమోదం పొందలేదు. గతంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కేంద్రం సిద్ధంగా ఉందని, అప్పటి వైసీపీ ప్రభుత్వం భూములు కేటాయించి ఇవ్వలేదని పేర్కొనడం రాజకీయంగా సంచలనం రేపింది. గతంలో ఆరిలోవ ప్రాంతంలో రైల్వే శాఖకు చెందిన 53 ఎకరాల్లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ భవనానికి ప్రతిపాదనలు పంపినా కేంద్రం అందుకు ఆమోదించలేదన్న వాదన ఉంది. విశాఖ జోన్ లో వాల్తేరు డివిజన్ ఉంటుందా, లేదా అని క్లారిటీ రావాల్సి ఉంది.2022లో జోన్ ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణానికి డీఆర్ఎం ఆఫీస్ ఎదురుగా ఉన్న వైర్ లెస్ కాలనీ ఎంపికైంది. మొత్తం 13 ఎకరాల్లో 8 ఎకరాలలో హెడ్ క్వార్టర్స్ డిజైన్లను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదించారు. అంతా ఓకే అనుకునే లోపు 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్ గా శంకుస్థాపన చేయాల్సి ఉండగా.. చివరి నిమిషంలో ఆగిపోయింది.దక్షిణ కోస్తా రైల్వే జోన్ తో పాటు వాల్తేరు డివిజన్ లో కొంత భాగం, ఈస్ట్ కోస్ట్ లోని కొంత భాగంతో కొత్తగా రాయగడ డివిజన్ ను ప్రకటించారు. రైల్వే జోన్ కోసం రూ.106కోట్లు ప్రకటించగా.. రాయగడకు మాత్రం రూ.70కోట్లు మంజూరైంది. వాల్తేరు రైల్వే డివిజన్ ను విజయవాడ డివిజన్ లో కలిపి మొత్తం రూట్లు, లైన్లు ఖరారు చేశారు. రాయగడ డివిజన్ లైన్లు ఇప్పటికే ఖరారైనట్టు సమాచారం. జనవరి 6న ప్రధాని మోదీ వర్చువల్‌గా రాయగడ డివిజన్ కు శంకుస్థాపన చేయనున్నారని వినిపిస్తోంది.జనవరి 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు రానున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే అధికారులను ఆదేశించారు. విశాఖ రైల్వే జోన్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు.

# బీజేపీ వర్సెస్ టీడీపీ

అనంతపురం, జనవరి 4, జేసీ ప్రభాకర్ రెడ్డి వర్సెస్ నటి మాధవీలత మధ్య మాటల యుద్ధం సాగుతున్న విషయం తెల్సిందే. ఆ యుద్ధం మాధవీలతపై కేసు నమోదు వరకు దారితీసింది. ఈ విషయం ఇప్పుడు ఏపీ పాలిటిక్స్ లో హాట్ టాపిక్ గా మారింది. తాజాగా ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడ స్పందించారు. మాధవీలతకు మద్దతు పలికిన మంత్రి సత్యకుమార్, జేసీకి ఒకదశలో వార్నింగ్ ఇచ్చారు. అయితే ఉదయం నుండి జేసీ వర్సెస్ మాధవీలత గురించి మీడియా, సోషల్ మీడియాలో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో అయితే అదిగో అరెస్ట్, ఇదిగో అరెస్ట్ అంటూ వదంతులు వ్యాపిస్తున్నాయి. ఇలా ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది.ఇంత జరుగుతుంటే మాధవీలత మాత్రం బాగా నిద్రపోయారట. అదికూడ నిద్ర లేచి చూసేసరికి ఫోన్ నిండా మిస్డ్ కాల్స్ ఉన్నాయట. తన ఫేస్ బుక్ అకౌంట్ ద్వార మాధవీలత స్పందిస్తూ.. తనకు బాగా మైగ్రేన్ తలనొప్పి ఉందని, అందుకు బాగా నిద్రపోయానని ప్రకటించారు. అలాగే తన ఫోన్ కు ఎందరో మీడియా ప్రతినిధులు ఫోన్లు చేశారని, నిద్ర లేచి ఫోన్ చూసి ఖంగుతిన్నట్లు తెలిపారు. వాట్సప్ ఓపెన్ చేసినా కూడ, తన న్యూస్ లే తనకు కనిపిస్తున్నాయని ఇదెక్కడి రాద్ధాంతమంటూ ఆమె తన అభిప్రాయం వ్యక్తం చేశారు.తాడిపత్రిలో దివాకర్ ట్రావెల్స్ కుచెందిన బస్సులు తగలబడటం వెనుక బీజేపీ నేతలున్నారని జేసీప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. డిసెంబర్ 31వ తేదీన మహిళలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తే బీజేపీ నేతలు విమర్శలు చేశారని.. అయినా తాను నిర్వహించానని అందుకే బస్సులు తగులబెట్టారన్నారు. ఈ క్రమంలో ఆయన బూతులు అందుకోవడంతో బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రిలోని పెన్నా నది ఒడ్డున జేసీ పార్కులో డిసెంబర్ 31న వేడుకలు నిర్వహించారు. ఈ పార్కులో నిర్వహించే వేడుకలకు వెళ్లవద్దని మాధవీలత ఓ వీడియో రిలీజ్ చేశారు. అక్కడ మహిళలకు భద్రత లేదని .. జేసీ పార్కు వద్ద గంజాయి, డ్రగ్స్ బ్యాచ్‌లు ఉంటాయని ఆరోపించారు. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పూర్తి చేసుకుని వెళ్లే సమయంలో మత్తులో వాళ్లు ఏమైనా చేయవచ్చని అన్నారు. మాధవీలత వ్యాఖ్యలపై జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. పట్టణ మహిళలకు అవమానం జరిగేలా మాట్లాడారని అన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మాధవీలతపై తాడిపత్రిలో పోలీసు స్టేషన్‌లో రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కుంకరి కమలమ్మతో పాటు టీడీపీ మహిళా కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని కోరారు. జనవరి 2వ తేదీన తెల్లవారిజామున జేసీ బస్సులు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తేల్చారు. కానీ ఇది బీజేపీ నాయకుల పనే అని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. జగనే నయం అని.. జగన్ కేవలం తన బస్సులను సీజ్ చేయించారని.. కానీ మీరు మాత్రం బస్సులు తగలబెడుతున్నారంటూ బీజేపీ నాయకులపై ఆరోపణలు చేశారు. ఈ ఘటనపై తాను ఫిర్యాదు చేయనని.. పోలీసులే సుమోటోగా కేసు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కూటమిలో ఉంటూ ఇలా మాట్లాడటం తగదని బీజేపీ నేతలు జేసీ ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ బీజేపీపై జేసీ ప్రబాకర్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏం మాట్లాడతారో ఆయనకే తెలీదని విమర్శించారు. జేసీ వ్యాపారాలపై గతంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయన్నారు. కూటమిలో ఉన్న బీజేపీపై జేసీ ప్రభాకర్‌రెడ్డి అర్థంలేని వ్యాఖ్యలు చేయడం సరికాదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. జేసీ ఆయన వయసుకు తగిన విధంగా నడుచుకోవాలని మంత్రి సత్యకుమార్ హితవు పలికారు.

# ఒకరికి ఒకరు.... కొనసాగుతున్న స్నేహబంధం



కాకినాడ, జనవరి 4, ఆంధ్రప్రదేశ్ లో శాసనసభ ఎన్నికలకు ముందు అనేక ఊహాగానాలు వినిపించాయి. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలవబోరని దాదాపు చాలా మంది అంచనా వేశారు.

బీజేపీ ఏదో ఒకటి చేసి కూటమి ఏర్పాటు కాకుండా చూసుకుంటుందన్నభరోసాలో దిలాసాగా వైసీపీ నేతలు కూడా ఉన్నారు.చివరకు పట్టుబట్టి సాధించి మరీ కూటమిని ఏర్పాటు చేశారు. అయితే కూటమి ఏర్పాటు తర్వాత కూడా దీనిపై అనేక రకాలుగా ప్రచారం సాగింది. అభ్యర్థుల ఎంపికలోనూ, సీట్ల కేటాయింపుల్లోనూ విభేదాలు తలెత్తుతాయని భావించారు.కానీ ఎన్నికలకు చాలా కంఫర్ట్ గా మూడు పార్టీలు కలిసి వెళ్లడంతో ఆశలు పెట్టుకున్నవాళ్లంతా అవాక్కయ్యారు. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈరకమైన ప్రచారం ఆగలేదు. మంత్రి వర్గం ఏర్పాటు దగ్గర నుంచి మొదలయిన ఈ ప్రచారం ఇంకా సాగుతూనే ఉంది. అసంతృప్తులు బయలుదేరుతాయని ఎవరికి వారు ప్రత్యర్థులు అంచనా వేసుకున్నారు. కానీ అంతా సాదాసాదీగా, సాఫీగా జరిగిపోయింది. ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీ సమయంలోనూ అనేక వదంతులు షికార్లు చేశాయి. నామినేటెడ్ పోస్టుల కోసం ఇటు జనసేన, అటు బీజేపీ పట్టుబడుతుందన్న ఊహాగానాలు చెలరేగగా అవి ఊహలకే పవన్, చంద్రబాబులు పరిమితం చేశారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసినప్పటికీ ఎలాంటి అసంతృప్తులు రాలేదు. ఒకవేళ పార్టీ నేతల్లో ఉన్న ఇంకా అనేక పదవులు వచ్చేవి ఉండటంతో మౌనంగా ఉన్నారన్నా అనుకోవాలి. కానీ ఇక్కడ ఒక విషయం మాత్రం గుర్తుంచుకోవాలి... అగ్రనేతలు అందరూ కలసి కట్టుగానే ఈ ఏడు నెలల నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. ఎక్కడా కొద్దిగా కూడా పొరపొచ్చాలు రాలేదు. అనేక నిర్ణయాలు తీసుకున్నా ఇటు పవన్ కల్యాణ్ నుంచి కూడా పెద్దగా వ్యతిరేక వ్యాఖ్యలు వెలువడలేదు. ఒకహోంశాఖపైనే ఆయన నేరుగా కామెంట్ చేయడం కొంత కలకలం రేపింది. ఎందుకంటే హోంశాఖను నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షిస్తుండటంతో తేడా కొట్టిందన్న కామెంట్స్ వినపడ్డాయి.

కానీ చంద్రబాబు వెంటనే ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టి తామిద్దరమూ ఒక్కటేనన్న సంకేతాలను ఇటు పార్టీ నేతలకు, అటు ప్రత్యర్థులకు బలంగా పంపగలిగారు. ఇద్దరూ ఇప్పటి వరకూ ఏ అంశంపైనా విభేదించుకున్న దాఖలాలు లేవు. ఇకముందు కూడా ఉండవన్న ధీమా ఆ పార్టీల క్యాడర్ లో కనపడుతుంది. ఎందుకంటే పవన్ అడిగింది చంద్రబాబు కాదనడం లేదు.. అలాగే చంద్రబాబు చెప్పినదానికి పవన్ కల్యాణ్ ఓకే అని చెబుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. పట్టు విడుపులతో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. రాజకీయంగా జగన్ ను ఎదుర్కొనాలంటే కలసి ప్రయాణంచేయడం ఒక్కటేనన్న అభిప్రాయానికి ఇద్దరు నేతలు వచ్చారు. అందుకే ఎవరేమి అన్నా, ఏ విషయంలోనైనా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైగా పవన్ కల్యాణ్ ఏకంగా పదేళ్లు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండాలని ఆకాంక్షించారంటే ఆయన ఏ రేంజ్ లో చంద్రబాబు అంటే గౌరవమో చెప్పకనే తెలుస్తోంది. సో.. ఇద్దరూ విడిపోతారన్న ఆశలు ఎవరు పెట్టుకున్నా అవి అడియాసలు కాక తప్పవు బ్రదరూ.

## కోటి మంది కార్యకర్తలకు ఇన్సూరెన్స్

గుంటూరు, జనవరి 4, తెలుగుదేశం పార్టీకి కోటి మంది కార్యకర్తలు ఉన్నారు. సభ్యత్వ నమోదులో ఆ పార్టీ చరిత్ర సృష్టించింది. దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశానికి ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టాక వారికి విద్య, ఉద్యోగ, వైద్య సహాయం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని టీడీపీ తెలిపింది. 2024 ఏడాది అక్టోబర్ 26న ప్రారంభమైన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం డిసెంబర్ 31తో ముగియాల్సి ఉన్నప్పటికీ ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనతో మరో 15 రోజులు పొడిగించినట్లుగా టీడీపీ ప్రకటించారు. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో దాదాపు కోటి మంది వరకు సభ్యత్వం తీసుకున్నారు. కార్యకర్తలు ఏదైనా ప్రమాదంలో మరణించినప్పుడు ఆదుకోవడానికి సభ్యత్వ నమోదు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ మేరకు కోటి మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ప్రమాద బీమా కల్పించేందుకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పటికే యునైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్, ప్రాగ్మ్యాటిక్ ఇన్స్యూరెన్స్ బ్రోకింగ్ ప్రతినిధులతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. టీడీపీ కార్యకర్తలు ఎవరైనా ప్రమాదాల్లో చనిపోతే పార్టీ ఆఫీసును సంప్రదించడం లేట్ కావడంతో పాటు పలు పత్రాలను సేకరించడంలో ఇబ్బంది పడుతూంటారు. అందుకే అవగాహన కోసం ముందుగానే టీడీపీ కీలక విషయాలను వెల్లడించారు. కార్యకర్తలు ప్రమాద బీమా పొందేందుకు అవసరమైన పత్రాలు, మార్గదర్శకాలను వెల్లడించింది. ప్రమాద బీమా పొందేందుకు బాధిత కుటుంబం ఎఫ్ఐఆర్ కాపీతో పాటు ఎస్.ఐ సంతకం, స్టాంప్ తో కూడిన ఫిర్యాదు లేఖ, శవ పంచనామా, పోస్ట్ మార్టమ్ నివేదిక, మండల రెవెన్యు అధికారి జారీ చేసిన అసలు మరణ ధృవీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రం(ఫ్యామిలీ సర్టిఫికెట్) సమర్పించాల్సి ఉంటుంది. వీటితో పాటు ఆధార్ కార్డ్, ఓటర్ కార్డ్, రేషన్ కార్డ్, 4 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు అందించాల్సి ఉంటుంది. ప్రమాద వార్తను కవర్ చేసిన న్యూస్ పేపర్ కటింగ్ లు, ప్రమాదం జరిగినప్పుడు తీసిన 2 ఫోటోలను జత చేయాలి. వీటితో పాటు నామినీ ఆధార్, ఓటర్ కార్డ్, 4 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, పాన్ కార్డు అందించాలి. ఆయా పత్రాలన్నీ ఒక సెట్ ఒరిజినల్, 2 సెట్లు జిరాక్స్ కాపీలు జతపరచాలి. ఏదైనా ప్రమాదంలో వ్యక్తి మరణించినప్పుడు 15 రోజుల్లో తెలియపరచాలని, ప్రమాదం జరిగిన 30 రోజుల్లోగా నామినీ స్వయంగా డాక్యుమెంట్లు తీసుకుని గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలని వెల్లడించింది. ఏదైనా సమాచారం కోసం 7306299999 నెంబర్ కు ఫోన్ చేయాలని తెలిపింది.

# దేవుడిచ్చిన 11...

కడప, జనవరి 4, మాజీ సీఎం జగన్ కు 11 సెగ మాత్రం ఇప్పుడిప్పుడే వదిలేలా లేదు. ఏపీలో ఎన్నికలు ముగిసి 7 నెలలు కావస్తున్నా, 11 నెంబర్ మాత్రం వైసీపీని వదలట్లేదు. సోషల్ మీడియాలో 11 నెంబర్ కు ఒక క్రేజ్ తెచ్చేలా మీమ్స్ కూడ వైరల్ గా మారాయి. ఆ మీమ్స్ ఓ రేంజ్ లో ఉండడంతో వైసీపీకి పెద్ద తలనొప్పులు తెస్తున్నాయని చెప్పవచ్చు. ఇటీవల ఓ కారుకు గల నెంబర్ తో ట్రోలర్స్ విపరీతంగా ట్రోలింగ్ చేస్తుండడం విశేషం.ఏపీలో ఎన్నికల ఫలితాలు కూటమి, వైసీపీ పార్టీలకు పెద్ద షాక్ ఇచ్చాయి. కూటమికి ఊహించని రీతిలో 164 సీట్లు రాగా, వైసీపీకి 11 సీట్లు దక్కాయి. ఫలితాలు విడుదలైన సమయం కాస్త ట్రోలింగ్ అంతగా లేదని చెప్పవచ్చు. రాను రాను 11 నెంబర్ పై మాత్రం పరోక్షంగా ట్రోలర్స్ తమ సత్తా చాటుతూ, సోషల్ మీడియాను ఒక ఊపు ఊపేస్తున్నారు. కూటమికి వచ్చిన 164 నెంబర్ ని కూడితే 11 వస్తుంది. అదే వైసీపీకి దక్కిందని కొందరు విపరీతంగా సోషల్ మీడియా వేదికగా ప్రచారం సాగించారు.అంతేకాదు జబర్దస్ట్ లాంటి కామెడీ షోలలో కూడ హైపర్ ఆది వంటి కమెడియన్స్ తమ స్కిట్ లలో 11 గురించి ప్రస్తావించి నవ్వులు పూయించారు. ఇలా ఏపీలో 11 నెంబర్ అంటేనే వైసీపీ గుర్తొచ్చేలా సోషల్ మీడియా పరోక్షంగా కోడై కూస్తోంది. ఇది ఇలా ఉంటే తాజాగా ఉండి ఎమ్మెల్యే త్రిబుల్ ఆర్ ( రఘురామ కృష్ణంరాజు ) వాహనం నెంబర్ ను ఉద్దేశించి, 11 నెంబర్ మరోమారు తెరపైకి వచ్చింది. సోషల్ మీడియాలో ఈ కారు నెంబర్ ఇప్పుడు ట్రెండింగ్ లో ఉంది. అందుకు ప్రధాన కారణం ఆ కారు నెంబర్ ఏపీ 11 ఏపీ 1111 కావడమే.ఏపీ డిప్యూటీ స్పీకర్ హోదాలో గల ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుకు చెందిన కారుగా ఇది ప్రచారం సాగుతోంది. కాగా పదేళ్ల క్రితం త్రిబుల్ ఆర్ ఈ కారు నెంబర్ ను పొందినట్లు సమాచారం. యాదృచ్ఛికంగా ఆ కారు నెంబర్ లో అన్నీ 11 లు ఉండడంతో, రాజు గారూ.. మీరు సూపర్ టీడీపీ కార్యకర్తలు కామెంట్స్ చేస్తున్నారు. వైసీపీకి కేవలం 11 సీట్లు దక్కినా, రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదని, ఇలా ట్రోలింగ్ చేయడం కూడ సబబు కాదని పలువురి అభిప్రాయం. ఏదిఏమైనా వైసీపీకి 11 నెంబర్ సెగ మాత్రం ఇప్పుడిప్పుడే వదిలేలా లేదని చెప్పవచ్చు.

# ఎమ్మెల్యేలకు సర్వే టెన్షన్

నెల్లూరు, జనవరి 4, చంద్రబాబు.. సీఎం మాత్రమే కాదు.. ఓ సీఈఓ అని చాలా మంది చెబుతూ ఉంటారు. ఆయన ఎప్పుడు అధికారంలో ఉన్నా అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అందరి పనితీరుపై ఆరా తీస్తూనే ఉంటారు. వారి పనిలో ప్రోగ్రెస్ గురించి నిత్యం తెలుసుకుంటూనే ఉంటారు. ప్రజెంట్ ఆయన టీడీపీ ఎమ్మెల్యేల ఆరు నెలల పని తీరు ఎలా ఉందో తెలుసుకోవడంపై ఫోకస్ చేశారు. ప్రజలకు ఎంఖీూ కాల్స్ చేసి ఎమ్మెల్యేలు ఎంత వరకు అందుబాటులో ఉంటున్నారో తెలుసుకుంటున్నారు. పనితీరు బాగుంటే ఒకటి .. పర్వాలేదు అనిపిస్తే రెండు .. బాగోకపోతే మూడు ప్రెస్ చెయ్యాలని కోరుతూ ప్రజలకు కాల్స్ వెళ్తున్నాయి.పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం నుంచి ఈ సర్వే మొదలైంది. గత ప్రభుత్వం లాగా ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే ఊరుకునేది లేదని చంద్రబాబు వార్నింగ్ ఇస్తున్నారు. నాయకులు నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాబులో ఉండాల్సిందేనని అన్నారు. గతంలో టికెట్ ఇచ్చే సమయంలోనే చంద్రబాబు ఈ కాల్స్ ద్వారానే అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇప్పుడు ప్రజల నుంచి, కార్యకర్తల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. దీంతో సర్వేల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయో అని ఎమ్మెల్యేల్లో టెన్షన్ నెలకొంది.6 నెలల్లో మీ శాఖల పురోగతిపై మీరు రిపోర్టు ఇస్తారా? మీ రిపోర్టులు నన్నే ఇవ్వమంటారా? ఇప్పటికే చాలా సార్లు అడిగా.. అయినా మార్పు రాలేదు.. పని తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు.. ఇవి నిన్న కేబినెట్ మీటింగ్‌లో మంత్రులపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు.మంత్రుల పనితీరు సరిగా లేదని సీఎం ప్రధాన ఆరోపణ. పనిలో వేగం పెంచాలని.. లేదంటే జరగబోయే పరిణామాలకు తనను బాధ్యుడిని చేయొద్దని చెప్పేశారు సీఎం. పనితీరు సరిగా లేదన్నది ఒక కారణమైతే.. ఆరునెలల పనితీరుపై నివేదికలు ఇవ్వకపోవడం చంద్రబాబు కోపానికి మరో కారణం.పలుసార్లు నివేదికలు కోరినా.. రామానాయుడు, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ శ్రీనివాస్ తప్పా మరెవ్వరూ ఇవ్వలేదు. దీంతో ఇలాంటి నిర్లక్ష్య ధోరణి సహించేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరి పని తీరును తాను గమనిస్తున్నానని ఆయన అన్నారు. ఎవరు ఎన్ని గంటలు పని చేస్తున్నారు? ఎంత వరకు సమీక్షలు నిర్వహిస్తున్నారు? సంబంధిత శాఖల్లో ఫైల్స్ ఎంత త్వరగా మూవ్ అవుతున్నాయో తన దగ్గర లెక్కలు ఉన్నాయని చెప్పారు సీఎం.సంబంధిత శాఖల్లో అధికారులు పనితీరు కూడా మంత్రుల బాధ్యతేనని సీఎం స్పష్టం చేశారు. ఎవరి పని తీరుపై వాళ్లు నివేదికలు ఇవ్వకపోతే.. తానే అందరి రిపోర్టులు బయట పెడతానని ఆయన చెప్పారు. అయితే.. మిగిలిన వారి సంగతి పక్కన పెడితే.. ఆరు నెలల నివేదికలను మంత్రి నారాలోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఇవ్వకపోవడం ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది.

# కమలానికి సేనాని ఎవరు...

ఒంగోలు, జనవరి 4, బీజేపీలో దేశవ్యాప్తంగా సంస్థాగత ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. జనవరి మొదటి వారానికి ఈ అంకం ముగియనుంది. సెకండ్ వీక్‌లో కొత్త అధ్యక్షుడ్ని ఎంపిక చేయాలని భావిస్తోంది. సంక్రాంతి తర్వాత రాష్ట్ర పార్టీ అధ్యక్షుడ్ని ప్రకటించాలనే ఆలోచన చేస్తోంది హైకమాండ్. అధ్యక్ష పీఠం కోసం నలుగురు నేతలు పోటీపడుతున్నారుదక్షిణాదిలో తన ఉనికి మరింత పెంచుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ హైకమాండ్. పార్టీలో బలమైన ట్రాక్ రికార్డు ఉన్న నాయకుడి కోసం వెతుకుతోంది. ఆ తరహా నాయకుల కోసం సెర్చింగ్ చేస్తోంది.

ఈ క్రమంలో నలుగురు పేర్లు బయటకు వచ్చాయి. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సీనియర్ నేత రఘురామ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.పార్టీ అధ్యక్షుడిగా పార్థసారథి లేదా సుజనా చౌదరిలో ఎవరినైనా ఎంపిక చేయవచ్చు. కానీ, బీజేపీ ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్)తో సంబంధాలున్న వ్యక్తులకు ప్రాధాన్యతనిస్తే బాగుంటుందని ఆలోచన చేస్తోంది. వారంతా పార్టీకి అనుకూలంగా పని చేస్తారని ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, రఘురామ్ పేర్లు వచ్చాయి.పార్టీ హైకమాండ్‌తోపాటు ఆర్ఎస్ఎస్‌తో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి మాంచి సన్నిహిత సంబంధాలున్నాయి.

రాష్ట్ర అధ్యక్ష పదవికి బలమైన పోటీదారుగా కనిపిస్తున్నారాయన. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం నుంచి వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి. ఈ ప్రాంతం నుంచి పార్టీ నాయకత్వం వహించడానికి ఇప్పటివరకు నేతలు లేరు.

ఆయనైతే బాగుంటుందన్నది పార్టీ వర్గాల ఆలోచన.విభజన తర్వాత బీజేపీలో చేరారు మాజీ కేంద్ర మంత్రి పురందేశ్వరి. రెండేళ్ల కిందట ఆమె ఏపీ పార్టీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు బీజేపీ తరపున జాతీయ స్థాయిలో పార్టీ పదవులు నిర్వహించారు కూడా.ముఖ్యంగా మొన్నటి ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వెనుక ఆమె కీలక రోల్ పోషించారు ఆమె. ఈ క్రమంలో ఆమెను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకోవచ్చనే వార్తలు లేకపోలేదు. మొత్తానికి రెండు వారాల్లో ఏపీ కొత్త చీఫ్ ఎవరనేది తేలనుంది.

# 46 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన భారత్ బౌలర్

ముంబై, జనవరి 4, (న్యూస్ పల్స్) టీమిండియా స్టార్ పేసర జస్ప్రీత్ బుమ్రా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియా గడ్డపై ఐదు టెస్టుల సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ రికార్డు నెలకొల్పాడు. 46 సంవత్సరాల రికార్డును బుమ్రా తన ఖాతాలో వేసుకున్నాడు. 1997-78లో ఆసీస్ గడ్డపై స్పిన్ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ ఐదు టెస్టుల సిరీస్‌లో 31 వికెట్లు తీశాడు. ఐదో టెస్టులో బుమ్రా రెండు వికెట్లు తీయడంతో 32 వికెట్లకు చేరుకున్నాడు. దీంతో బిషన్ సింగ్ రికార్డును బద్దలు కొట్టాడు. 2024 వ సంవత్సరంలో 13 టెస్టుల్లో 71 వికెట్లు తీసి నంబర్ వన్ బౌలర్‌గా బుమ్రా ఉన్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న ఐదో టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ రెండో రోజు ఆసీస్ జట్టు 42 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 151 పరుగులతో ఆటను కొనసాగిస్తోంది.

# భూవివాదంలో విషప్రయోగం

సిద్దిపేట జిల్లాలో దారుణం జరిగింది. భూ వివాదంలో ప్రత్యర్థి అడ్డు తొలగించుకోవాలని మద్యంలో విషం కలిపి హత్యాయత్నం చేసారు. జగదేవ్ పూర్ (మం) తిమ్మాపూర్ లో ఘటన జరిగింది. గ్రామానికి చెందిన నర్సింహులు, గోపి మధ్య పొలం బాట విషయంలో గత కొన్నాళ్లుగా గొడవనడుస్తోంది. నర్సింహులుని చంపేస్తే సమస్య ఉండదని భావించి నర్సింహులు వీక్ నెస్ పై గోపి కన్నేసాడు. పొలం వద్ద నర్సింహులు గుడిసెలో మద్యం బాటిల్లో గడ్డిమందు కలిపి పెట్టి వెళ్లిపోయాడు. బాటిల్లో మద్యం చూసి తన మామ, బంధువుకి ఫోన్ చేసి పిలిచి నర్సింహులు మద్యం తాగాడు. మద్యం తాగిన కాసేపటికే తీవ్రమైన వాంతులతో ముగ్గురు ఆసుపత్ఇరలో చేరారు. మద్యంలో విషప్రయోగం జరిగినట్టు డాక్టర్లు వెల్లడించారు. గోపీపై అనుమానంతో బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. యాదగిరిగుట్టలో తలదాచుకున్న గోపీని అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుఉ నేరం ఒప్పుకున్నాడు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు.

### కోరుట్ల, మెట్పల్లిలలో దొంగల హల్ చల్

జగిత్యాల జిల్లా కోరుట్ల,మెట్ పల్లి పట్టణాలలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న పలు దుకాణాలలో షట్టర్లు పైకి లేపి దొంగలు నగదును ఎత్తుకెళ్లారు.పట్టణంలోని ప్రధాన చౌరస్తా అయిన పాత బస్టాండ్ వద్ద రెండు షాపులలో దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. దుకాణంలో ఉన్న చిల్లర నగదును దొంగలు ఎత్తుకెళ్లారు.అలాగే కోరుట్ల పట్టణంలో మూడు దుకాణాలలో చోరీకి పాల్పడి 10 వేల నగదు అపహరించుకుపోయారు.గత రెండు మూడు నెలలలో రెండు మూడుసార్లు దొంగతనాలు జరగడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీస్తున్నారు.పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారి కానుకొని దొంగతనాలు జరుగుతుండడంతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.పోలీసుల పెట్రోలింగ్ పెంచి,దొంగతనాలు జరగకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు. దుకాణాల్లో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాల ఫుటేజ్ లను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ఏపీలో ఎస్సీ లెక్కల మిస్సింగ్...

విజయవాడ, జనవరి 4,ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కసరత్తు గందరగోళంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో వాలంటీర్లు నిర్వహించన కులగణన ఆధారంగా కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కసరత్తు చేయడం ఈ గందరగోళానికి కారణమైంది.2024 జనవరి మరియు ఫిబ్రవరి నెలలలో రాష్ట్రంలోని అన్ని కులాల సామాజిక ఆర్థిక పరిస్థితులు తెలుసుకోడానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లతో సర్వే చేయించింది. ఈ సర్వేను వాలంటీర్లు డోర్ టు డోర్ తిరిగి చేయలేదని, వాళ్ళ పరిధిలో నివసించే వారి కుటుంబ వివరాలను వారికి తెలిసినంత వరకూ రాసుకున్నారని? ఒక మాదిరి చిన్న పట్టణాల నుండి పెద్ద పట్టణాల వరకూ అసలు ఎన్యూమరేషన్ చేయలేదని పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. అయితే ఎన్నికలు సమీపించడంతో వైసీపీ ప్రభుత్వం ఈ సర్వే వివరాలను పబ్లిష్ చేయలేదు.ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ సర్వే లోని ఎస్సీ కులాల డేటాను తీసుకుని ఫిజికల్ కాపీలను ఆయా గ్రామ వార్డు సచివాలయాల వారీగా నోటీస్ బోర్డు లో డిసెంబర్ 26, 2024 న ప్రకటించి అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 31, 2024 లోపు తెలియచేయాలని అంటే 5 రోజుల సమయం ఇచ్చారు. దీనిపై ప్రచారం మాత్రం చేయలేదు. ఈ జాబితాలు ఎందుకు ప్రకటిస్తున్నారనే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించలేదు.వైసీపీ హయంలో వాలంటీర్లు నిర్వహించిన సర్వే తప్పుల తడకగా ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా దళితుల్ని పెద్ద సంఖ్యలో క్రైస్తవులుగా నమోదు చేశారని, కుటుంబాల వారీగా కులాల నమోదు చేయడంలో ఉద్దేశపూర్వకంగా తప్పు ఎంట్రీ చేశారని, ఒక కులానికి బదులు ఇంకొక కులం రాశారని అసలు చాలా చోట్ల ఎన్యూమరేషన్ చేయలేదని గ్రామ వార్డు స్థాయిల నుండి ఫిర్యాదులు అందుతున్నాయి.మరోవైపు గత ఏడాది జనవరిలో నిర్వహించిన సర్వే నివేదికలను ఆయా గ్రామ వార్డు సచివాలయాల నోటీస్ బోర్డుల్లో ఉంచారనే సంగతి 90 శాతం మందికి తెలియదు. తమ వివరాలను తనిఖీ చేసుకున్న వారిలో కూడా అత్యధికంగా తప్పుగా నమోదు చేశారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి.తమ కులం, మతం వివరాలు తప్పుగా నమోదు అయ్యాయని ఆయా గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందిని అడుగుతుంటే వాటిని సరిచేయడానికి డాక్యుమెంట్స్ కావాలని, రుజువులు సమర్పించాలని సతాయిస్తున్నారని జనం వాపోతున్నారు.అసలు డోర్ టు డోర్ సర్వే తాము చేయలేదని తమకు తెలిసిన వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేసినట్టు వాలంటీర్లు చెబుతున్నారు. కులాల వారీగా సర్వే చేయించిన అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ సర్వేను పబ్లిష్ చేసే సాహసం కూడా చేయలేదు. అదే సర్వేఆధారంగా ఎస్సీ కులాల జనాభాను నిర్ధారణకు రావడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.2015 వ సంవత్సరంలో ఇదే ఎన్డీఏ ప్రభుత్వం జీఓ నెంబర్ 25 ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాల ఎస్సీ జనాభా లెక్కలను జిల్లాల వారీగా ప్రకటించి, ప్రభుత్వం అందిస్తున్నసంక్షేమ పథకాలను ఆయా ఎస్సీ ఉపకులాల జనాభా ప్రకారం అందించాలని నిర్ణయించింది. 2011 జనాభా లెక్కలను దీనికి ప్రాతిపదికగా తీసుకున్నారు.కుల గణన, అందులోనూ ఎస్సీల కుల గణన క్యాస్ట్ సర్టిఫికెట్స్ ఆధారంగా చట్ట ప్రకారం సూచించబడిన అధీకృత సంస్థతో, నిర్దేశించిన విధివిధానాలతో, మల్టీ లెవెల్ క్రాస్ వెరిఫికేషన్ చేసి అభ్యంతరాలను స్వీకరించి, వైడ్ పబ్లిసిటీ ద్వారా అందరిలో అవగాహన కల్పించి చేయాల్సిన ప్రక్రియను చట్టబద్ధత లేని వాలంటీర్లతో నిర్వహించడం, ఎస్సీల జనాభా సంఖ్యను నిర్దేశించడానికి వాడటంపై అభ్యతంరాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ సర్వే గణంకాలపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నారనే సమాచారం కూడా ప్రజలకు లేకపోవడాన్ని అయా వర్గాల ప్రజలు తప్పు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనాభా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం, ప్రతి ఇంటిలో జనాభా వివరాలు మ్యాపింగ్‌లో నమోదై ఉండటంతో ప్రతి ఒక్కరికి ఆన్‌లైన్‌లో వాటిని స్వయంగా తనిఖీ చేసుకునే సదుపాయం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# డాలర్ డ్రీమ్స్ కు కష్టాలు...

అమెరికాలో 1958లో కేవలం 12,000 మంది మాత్రమే ప్రవాస భారతీయులు ఉండేవారు. రానురాను వారి ప్రాముఖ్యత పెరిగి ఇప్పుడు అమెరికా మొత్తం జనాభాలో 1.5% వరకు ప్రవాస భారతీయులు ఉనికిని పొందడం విశేషం.

సిఇఒలుగా, సైంటిస్టులుగా, ఆస్ట్రోనాట్లుగా, విధానపర నిర్ణేతలుగా, చట్టసభ సభ్యులుగా ఇలా అనేక రంగాల్లో ప్రవాస భారతీయులు విస్తరిస్తుండటంతో అమెరికాలో పుట్టి పెరిగిన అసలైన అమెరికన్లకు దక్కవలసిన ఉద్యోగాలు, పదవులు ప్రవాసీయులకే దక్కుతున్నాయన్న అపోహలు మొదలవుతున్నాయి. ఇది చివరకు హెచ్1బి వీసాలపై ప్రభావం చూపిస్తోంది. మేక్ ఎగైన్ గ్రేట్ అమెరికా 'మాగా' నినాదంతో రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు హెచ్1బి వీసాల వివాదం అగ్నిపరీక్షగా మారింది.ప్రవాసీయుడైన ఎలాన్ మస్క్‌కు పెద్ద పీట వేయడం వివాదాస్పదమవుతోంది.

ఇది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) అన్న ట్రంప్ ప్రధాన నినాదానికి తూట్లు పొడుస్తోంది. న్యూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీసియెన్సీ(డిఒజిఇ) అధినేతగా ఎలాన్‌మస్క్, ఎఫ్‌బిఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్, పౌరహక్కుల సహాయ అటార్నీ జనరల్‌గా హర్మీత్ కె ధిల్లాన్, జాతీయ ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా డాక్టర్ జయభట్టాచార్య, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సీనియర్ పాలసీ అడ్వైజర్ శ్రీరామ్ క్రిష్ణన్‌తో పాటు వివేక్ రామస్వామి వంటి భారతీయ మూలాలున్న ఆరుగురిని ట్రంప్ తన యంత్రాంగంలో కీలక స్థానాల్లో నియమించారు. ఇది 'మాగా' నినాదానికి విరుద్ధమని వలసవాద, ఇస్లామిక్ వ్యతిరేక ఉద్యమ నేత లారా లూమెర్ ధ్వజమెత్తుతున్నారు.ట్రంప్ నియమించిన వారిలో శ్రీరామ్ క్రిష్ణన్ చెన్నైకు చెందినవారు. ఇండియా ఫస్ట్ అన్న నినాదానికి ఆయన కట్టుబడి ఉన్నారని, ఇది 'అమెరికా ఫస్ట్ అన్న లక్ష్యానికి వ్యతిరేకమని లారా లూమెర్ ఆగ్రహిస్తున్నారు. అయితే హెచ్1బి వీసాల్లో 70% భారతీయు లే పొందుతున్నారని, వీరంతా భారత్ నుంచి వచ్చే మూడో ప్రపంచ ఆక్రమణదారులని లూమెర్ ఆరోపిస్తున్నారు. హెచ్1బి వీసాదారుల్ని కాంట్రాక్టుగా తీసుకోవడంలో ఎలాంటి ప్రత్యేక నైపుణ్య ప్రమాణాలు కనిపించడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

పైగా ఏటా వారికి 80 వేల డాలర్ల నుంచి 1,20,000 డాలర్ల వరకు చెల్లించుకోవలసి వస్తోందని నిలదీస్తున్నారు. ఈ వాదాన్ని వివేక్ రామస్వామి, ఎలాన్ మస్క్ తదితరులు తిప్పికొడుతున్నారు.వాస్తవానికి ఎలాన్ మస్క్ దక్షిణాఫ్రికా నుంచి అమెరికాకు హెచ్1బి వీసా పైనే వచ్చారు.విదేశీ ప్రతిభతో అమెరికా ప్రయోజనం పొందుతుంది తప్ప అమెరికా వాసుల ప్రయోజనాలకు, హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదని మస్క్, రామస్వామి తమ వాదన వినిపిస్తున్నారు.

చేతిలోపైసా లేకుండా అమెరికాకు వలస వచ్చిన గొప్ప ఇంజినీర్ నికోలా టెస్లా స్ఫూర్తితోనే తన కారుకు టెస్లా అని పేరు పెట్టినట్టు మస్క్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికాలో విద్యుత్ విప్లవానికి నికోలా టెస్లా మూలకారకుడని మస్క్ ఉదహరించారు. అమెరికాకు సమర్థత కలిగిన ప్రజలు కావాలని తానెల్లప్పుడూ భావిస్తానని, తెలివైనవారు మన దేశానికి రావాలని, ఇదివరకెన్నడూ లేని స్థాయిలో అమెరికాలో ఉద్యోగాలు రాబోతున్నాయని కొత్త సంవత్సరం సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడడం ఈ సందర్భంగా గమనించాల్సిన విషయం. అమెరికా తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్‌లను తయారు చేస్తున్నందున ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే నైపుణ్యం గల వారిని దేశంలోకి అనుమతించడానికి హెచ్1బి వీసా ఉపయోగపడుతుందని మస్క్, వివేక్ రామస్వామి కూడా పేర్కొంటున్నారు.ప్రపంచ దేశాల్లో అమెరికా ఎప్పటికీ మొదటి స్థానంలో ఉండాలంటే ఈ ప్రోగ్రాంకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రత్యేక నిపుణులైన విదేశీయులను మరింత తేలికగా నియమించుకోడానికి అమెరికా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ బైడెన్ కార్యవర్గం నిబంధనల్లో మార్పులు చేసింది. ట్రంప్ మొదటిసారి పాలనలో వీసాలపై ఉన్న అభిప్రాయాలకు ఇప్పటి వైఖరికి తేడా కనిపిస్తోంది.

2017లో బై అమెరికన్, హైర్ అమెరికన్ అన్న సిద్ధాంతానికి వత్తాసు పలికారు. ఫలితంగా 2015 నుంచి హెచ్1బి వీసాల మంజూరు మందగించింది. 2020లో అమెరికాలోని సంస్థలు విదేశాల నుంచి ఉద్యోగులు, కార్మికులను తెచ్చుకునే విధానానికి ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిలకడ లేని విధానాలతో మాగా (మేక్ అమెరికా (గ్రేట్ ఎగైన్) మద్దతుదారులు హెచ్1బి వీసా అసలు ప్రయోజనాలను తప్పుగా అర్థం చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.ఈ సమస్యను ట్రంప్ ఈసారి ఎలా పరిష్కరిస్తారో చూడాలి. హెచ్1బి వీసాలపై ఆంక్షలు ఎక్కువ చేస్తే అమెరికా కంపెనీలు విదేశాల్లో అనుబంధ సంస్థలను ఏర్పాటు చేయవలసి వస్తుంది. ప్రత్యామ్నాయంగా చైనా, కెనడా వంటి దేశాల వైపు మొగ్గు చూపే పరిస్థితి ఏర్పడుతుందని మరో అధ్యయనం వెల్లడించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ పాలనా యంత్రాంగంలో 'మాగా' గ్రూపు ఆలోచనలను మార్చడానికి భారత ప్రభుత్వం గట్టిగానే పని చేయవలసి వస్తుంది. భారత్‌కు ఆదాయం తెచ్చిపెట్టే దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. గత ఏడాది 120 బిలియన్ డాలర్ల వరకు భారత్‌కు అమెరికా నుంచి ఆదాయం సమకూరింది. ఈ ఆదాయ స్రవంతిని భారత్ దొరకబుచ్చుకోగలగాలి. అలాగే అమెరికాను ఆకర్షించడానికి సాంకేతిక నైపుణ్యంలో టాప్‌లో భారతీయులు ఉన్నప్పుడే ఎలాంటి చిక్కులు వీసాల్లో ఎదురుకావు.

## ఖైరతాబాద్ జోన్ లో పలు శంకుస్థాపనలు చేసిన మేయర్

హైదరాబాద్ ఖైరతాబాద్ జోన్ లో 345 కోట్ల రూపాయల విలువైన పలు పనులకు జీహెచ్ఎంపసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శనివారం శంకుస్థాపన చేసారు. సి సి రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి,సుందరీకరణ, ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులకు మేయర్ శ్రీకారం చుట్టారు. బంజారా హిల్స్ రోడ్డు నెంబర్ 10 లో 2 కోట్ల 88 లక్షల వ్యయం తో చేపట్టే 2 సి సి రోడ్ల పనులకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సెంట్రల్ జోన్ కమిషనర్ అను రాగ్ జయంతి, డి సి ప్రశాంతి , కార్పొరేటర్ మన్నె కవిత తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ అరెస్ట్ తప్పదా...



హైదరాబాద్,**ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 4, ఫార్ములా ఈ రేస్ కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రమేయం ఉన్న వారి దర్యాప్తు ఒక్కొక్కటిగా జరగనుంది. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ బీఎల్ఎన్ రెడ్డి త్వరలోనే ఈడీ ముందు హాజరు కాబోతున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఈడీ ముందు హాజరు అయ్యారు. అలాగే ఈ నెల 7న ఈడీ అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించనున్నారు. ఈ విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. పెమా చట్టాన్ని ఉల్లంఘించి హెచ్ఎండీఏ నిధులను విదేశీ కంపెనీకి బదిలీ చేసినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఈ కేసులో ఆయన తాత్కాలిక బెయిల్ కోసం ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.అలాగే ఫార్ములా-ఇ రేస్ వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు ముగించింది. తీర్పు వెలువడే వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయకూడదని ఆదేశిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ క్రమంలో కేటీఆర్ కు ఏసీబీ నోటీసు జారీ చేసింది. ఈ నెల 6న విచారణకు హాజరు కావాలని నోటీసులలో పేర్కొన్నారు. కేటీఆర్ తో పాటు, ఈ కేసులో అధికారులకు కూడా నోటీసులు జారీ చేసింది. అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా నోటీసులు జారీ చేసింది. 7న విచారణకు హాజరు కావాలని వారిని ఆదేశించారు. ఈ కేసులో ఏసీబీ నమోదు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఫార్ములా ఇప్పటికే రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే.మరోవైపు ఇదే కేసులో ఈడీ ఈ నెల 7న విచారణకు హాజరు కావాలని కేటీఆర్ కు సమన్లను పంపింది. దీంతో ఈ నెల 6న ఏసీబీ విచారణకు హాజరు కానున్న కేటీఆర్..ఆ తర్వాత రోజే ఈడీ విచారణకు హాజరు కావాల్సి ఉంది. దీంతో కేటీఆర్ ఏసీబీ, ఈడీ విచారణలకు హాజరవుతారా లేక కోర్టును ఆశ్రయిస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఈ కేసులో ఏసీబీ సేకరించిన ఆధారాలను తీసుకుని ఈడీ విచారణ జరపాల్సి ఉంది. దీంతో ఏసీబీ విచారణ తర్వాత అవే ఆధారాలతో ఈడీ కేటీఆర్ ను ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. విచారణలో వాస్తవాలు వెల్లడి అయితే కేటీఆర్ ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని కొందరు విశ్లేషిస్తున్నారు.అసలు కేటీఆర్ అరెస్ట్ గత కొంత కాలంగా తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ కేసులో ఆయనపై అనేక ఆరోపణలు నమోదుకాగా, గవర్నర్ నుంచి విచారణకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో కేసు మరింత వేడెక్కింది. కేసీఆర్ ఈ వ్యవహారంపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయకపోయినా పార్టీలోని నేతలు మాత్రం ఈ పరిస్థితి ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ అరెస్ట్ జరిగితే పార్టీకి ఎదురయ్యే ప్రతికూల పరిస్థితులను నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణలపై బీఆర్ఎస్ హైకమాండ్ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కేటీఆర్ స్థానాన్ని దక్కించుకునే అవకాశం ఎవరికుంటుంది అన్న ప్రశ్న పార్టీ వర్గాల్లో విస్తృతంగా వినిపిస్తుంది. కవిత రీఎంట్రీ పై పార్టీలోనూ, రాష్ట్ర రాజకీయవర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. న్యాయపరమైన చిక్కుల మధ్య కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొనే అవకాశం ఉంది. ఇదే టైంలో పార్టీలో కవిత పాత్ర కీలకంగా మారే ఛాన్స్ ఉంది. కవిత రీఎంట్రీ పార్టీ బలోపేతంతో పాటు పునర్నిర్మాణ ప్రయత్నాలకు తోడ్పాటుగా ఉంటుందని కొందరు విశ్లేషిస్తున్నారు. హరీశ్ రావు కూడా అసెంబ్లీలో ప్రభుత్వం చేస్తున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కేటీఆర్‌కు ఎదురవుతున్న పరిస్థితులు బీఆర్ఎస్ పార్టీకి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకోబోయే నిర్ణయాలు పార్టీ భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేయనున్నాయి. ఈ సంక్షోభాన్ని గులాబీ పార్టీ ఎలా ఎదుర్కుంటుందో చూడాలి. ఎంతటి వారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందేనని.. గవర్నర్ పర్మీషన్ ఇవ్వగానే కేటీఆర్ మీద చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. నేడు ఏసీబీ నోటీసులు ఇచ్చి విచారణకు కేటీఆర్ రావాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు కనుక కేటీఆర్ ను అరెస్ట్ చేస్తే రేవంత్ రెడ్డి అనుకున్నది నిజం చేసినట్లే అవుతుందని కొందరు అంటున్నారు. కేటీఆర్ గనుక అరెస్ట్ అయితే దూకుడుగా ప్రభుత్వాన్ని ఎదిరిస్తున్న బీఆర్ఎస్ పార్టీకి గట్టి దెబ్బ తగిలినట్లే. రేవంత్ కు దాదాపు ఎదురుండదనే చెప్పుకోవాలి.

# చైనా నుంచి మరో వైరస్

బీజింగ్, జనవరి 4 కొవిడ్-19 (కరోనా) ఎంత పెద్ద విపత్తు తెచ్చిందో ప్రపంచం మరచిపోలేదు. 2019లో చైనా కేంద్రంగా ప్రారంభమైన కరోనా వ్యాప్తి, తీవ్రతను పెంచుకుంటూ పోయింది. ఎంతలా అంటే ప్రపంచంలోని మారుమూల, ఎడారి, సముద్రం ఇలా తేడా లేకుండా అంతటికీ వ్యాపించుకుంట వెళ్లింది. ఇది అంటు వ్యాధి, గాలి ద్వారా వ్యాపించే వ్యాధి కావడంతో లాక్ డౌన్ తప్పలేదు. దీంతో ప్రపంచం ఆర్థికంగా కూడా తీవ్రంగా నష్టపోయింది. అలాంటి మరో లాక్ డౌన్ ఇప్పుడు రాబోతోందా? అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. చైనా కేంద్రంగా మరో వైరస్ విజృంభిస్తోంది. ఇది కూడా శ్వాసకోస వ్యాధులు తెచ్చిపెడుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ వైరస్ పేరు హ్యూమన్ మెటాప్‌న్యూమోవైరస్ (హెచ్ఎంపివి) శ్వాసకోశ వైరస్ అనేక ఆసియా దేశాలను పీడిస్తున్న ప్రాంతంలోని ఇతర ప్రాంతాల్లో వ్యాప్తి చెందడం గురించి ఆందోళన చెందుతున్నారు. చైనా ఆరోగ్య అధికారులు చెప్తున్న దాని ప్రకారం.. 'దేశంలోని ఉత్తర ప్రాంతాల్లో ఈ వైరస్ విస్తరిస్తోంది. వ్యాధి నియంత్రణ, నివారణ కోసం చైనీస్ సెంటర్ ఉత్తర చైనా వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అన్ని వయసుల వారికి సోకే హెచ్ఎంపివి, పిల్లలలో సర్వసాధారణం, ఇది మరింత ప్రజారోగ్య సమస్యలను పెంచుతుంది. సోషల్ మీడియా నివేదికలు క్లిష్ట పరిస్థితిని వివరించినప్పటికీ, చైనా అధికారులు లేదంటే ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ దశలో అత్యవసర పరిస్థితిని ప్రకటించలేదు.20 ఏళ్ల క్రితం కనుగొనబడిన ఈ వైరస్‌కు ఇంకా వ్యాక్సిన్ కనిపెట్టలేదు. ముఖ్యంగా వైరస్ దాదాపు రెండు దశాబ్దాలుగా తెలిసినప్పటికీ హెచ్ఎంపివికి ఎటువంటి వ్యాక్సిన్ కనిపెట్టలేదు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని, ప్రజారోగ్య మార్గదర్శకాలను పాటించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చేతులు కడుక్కోవడం, మాస్కులు ధరించడం, వ్యక్తిగత దూరం పాటించడం చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

చైనాలో ఈ ఫ్లూ వ్యాప్తిని ఆసియా అంతటా ఆరోగ్య నిపుణులు నిశితంగా గమనిస్తున్నారు. చైనా ఈ వైరస్ వ్యాప్తి నివారణకు కఠినమైన చర్యలను అమలు చేస్తుంది. హాంకాంగ్‌లో తక్కువ కేసులు నమోదయ్యాయి.జపాన్ ఆరోగ్య అధికారులు ఈ సమస్యపై వేగంగా స్పందించారు. జపాన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ ప్రకారం.. దేశ వ్యాప్తంగా 5 వేల ఆసుపత్రులు, క్లినిక్‌లలో డిసెంబర్ 15 వరకు వారంలో 94,259 ఫ్లూ రోగులు చికిత్స కోసం చేరారు. ప్రస్తుత సీజన్‌లో జపాన్‌లో కేసుల సంఖ్య 718,000కి చేరుకుంది.చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (చైనా అఆఅ) ప్రకారం.. న్యుమోవిరిడే, మెటాప్‌న్యూమో వైరస్ జాతికి చెందిన హ్యూమన్ మెటాప్ న్యూమోవైరస్ (హెచ్ఎంపివి), ఒక ఎన్వలప్డ్ సింగిల్ స్ట్రాండెడ్ నెగటివ్-సెన్స్ ఖీఔం వైరస్. 2001లో తెలియని వ్యాధికారక కారకాల వల్ల శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు ఉన్న పిల్లల నాసోఫారింజియల్ ఆస్పిరేట్ శాంపిల్స్‌లో డచ్ వారు దీన్ని మొదటిసారిగా గుర్తించారు. సెరోలాజికల్ అధ్యయనాల ప్రకారం ఇది 60 సంవత్సరాలు ఉనికిలో ఉందని తేలింది,

పిల్లలు, రోగనిరోధక శక్తి లేని జనాభా, వృద్ధులు ఈ వ్యాధికి గురవుతారు. హెచ్ఎంపివితరచుగా సాధారణ జలుబు లక్షణాలను కలిగిస్తుంది, దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాసలో గురక వంటివి లక్షణాలు. అయితే, కొన్నిసార్లు ఇది తీవ్రమైన సందర్భాల్లో బ్రోన్కైటిస్, న్యుమోనియాకు దారి తీస్తుంది.ఏవైనా వ్యాధులతో బాధపడే వారిలో హెచ్ఎంపివి సంక్రమణ మరణానికి దారితీయవచ్చు. 2021లో లాన్సెట్ గ్లోబల్ హెల్త్‌లో ప్రచురించిన కథనం నుంచి వచ్చిన డేటా ఆధారంగా, ఐదేళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లలలో తీవ్రమైన లోయర్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్-సంబంధిత మరణాలల్లో ఒక శాతం హెచ్ఎంపివికి కారణమని చెప్పవచ్చు. ప్రస్తుతం, హెచ్ఎంపివిని అరికట్టేందుకు ఎలాంటి మందులు గానీ, టీకాలు గానీ లేవు. ఇక చికిత్స అంటే లక్షణాలను తగ్గించడంపై దృష్టి సారిస్తుం

# నెంబర్ 2 పొంగులేటేనా...

ఖమ్మం,**ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 4, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో పొంగులేటి శ్రీనివాసులురెడ్డికి ఇస్తున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చినా ఆయన మిగిలిన నేతలను మించిపోయారు. . పొంగులేటి శ్రీనివాసులురెడ్డి తెలంగాణ కేబినెట్ లో కీలకమైన మంత్రిగా చెబుతారు. ఒకరకంగా చెప్పాలంటే మల్లు భట్టి విక్రమార్క తర్వాత పొంగులేటికే పార్టీ హైకమాండ్ కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానీ ప్రయారిటీ ఇస్తారంటారు. అందుకు అనేక కారణాలున్నాయంటున్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనరసింహ, శ్రీధర్ బాబు వంటి వారికంటే పొంగులేటి ఒక అడుగు ముందే ఉన్నారన్నది కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.పొంగులేటి శ్రీనివాసులురెడ్డి తొలుత వైసీపీలో ఉన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు అత్యంత సన్నిహితులు. ప్రముఖ పారిశ్రామికవేత్త. ఆర్థికంగానే కాదు సామాజికవర్గంగా కూడా బలమైన నేత. ఆయన 2014లో వైసీపీ నుంచి ఖమ్మం పార్లమెంటుకు పోటీ చేసి విజయం సాధించారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత ఆయన వైసీపీకి కొంత కాలం టీవైసీపీ అధ్యక్షుడిగా పనిచేసినా తర్వాత పార్టీకి రాజీనామా చేసి అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. అయితే బీఆర్ఎస్ పార్టీలో ఆయనకు అంత ప్రాధాన్యత లభించలేదు. అక్కడ పువ్వాడ అజయ్ కు ఇచ్చిన ప్రాధాన్యత బీఆర్ఎస్ హైకమాండ్ పొంగులేటికి ఇవ్వలేదు. 2019 ఎన్నికల్లోనూ ఆయనకు ఖమ్మం పార్లమెంటు టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో 2023 ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆయనతో పాటు మరో మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా చేరారు కేబినెట్ లో ప్రధానమైన శాఖను కూడా పొంగులేటి శ్రీనివాసులురెడ్డికి కేటాయించారు. రెవెన్యూ శాఖతో పాటు కీలకమైన సమాచారశాఖను కూడాపొంగులేటికి రేవంత్ రెడ్డి కట్టబెట్టారు. అంటే ఆయనపై ఎంత నమ్మకం ఉంచారో ఇలాగే అర్థం అవుతుంది. ఇక ముఖ్యమైన మంత్రి వర్గ ఉప సంఘాల్లో కూడా ఆయనను సభ్యుడిగా నియమించారు. ఏదైనా బహిరంగ సభ నిర్వహణ బాధ్యతను కూడా రేవంత్ రెడ్డి పొంగులేటికి అప్పగిస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు. అందుకు కారణాలు ఆర్థికంగా పార్టీకి ఖర్చు చేయడమే కాకుండా ప్రభుత్వ పరంగా కూడా పొంగులేటి ఎటువంటి నిబంధనలకు అతిక్రమించకుండా ఉంటారని కీలకమైన బాధ్యతలను ఆయనకు అప్పగించారంటున్నారు. అయితే ఇక్కడ మంత్రులలో తమకు దక్కని ప్రాధాన్యత పొంగులేటికి దక్కుతుండటంపై మిగిలిన మంత్రుల్లో ఒకింత అసహనం, అసంతృప్తి వ్యక్తమవుతున్నా బయటపడటం లేదు. ఐదేళ్ల పాటు పార్లమెంటు సభ్యుడిగా పనిచేయడంతో ఢిల్లీలో ఆయన లాబీయింగ్ చేయగలడన్న నమ్మకం రేవంత్ లో ఉందని చెబుతున్నారు. నిజానికి పొంగులేటి లేట్ గా జాయిన్ అయి... లేటెస్ట్ గా పాతుకు పోయాయంటున్నాయి పార్టీ వర్గాలు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నప్పటికీ తుమ్మల నాగేశ్వరరావుతో రేవంత్ రెడ్డికి తెలుగుదేశం పార్టీ నుంచి పరిచయాలున్నప్పటికీ పొంగులేటికే ఫస్ట్ ప్రయారిటీ అంటున్నారు. అందుకే కాంగ్రెస్ కింది స్థాయి నేతలు కూడా ఏదైనా పదవి కావాలనుకుంటే పొంగులేటి చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారట. ఇంకా ఒకటుంది. తెలంగాణ కాంగ్రెస్ లో పొంగులేటి నెంబరు 2గా చెలామణి అవుతున్నారన్న వారున్నా అందులో వాస్తవం లేదంటున్నారు మరికొందరు.

# 5 నెలల తర్వాత ఎట్టకేలకు దివి నుంచి దిగిన సునీతా విలియమ్స్



న్యూయార్క్, జనవరి 4, (న్యూస్ పల్స్) అంతరిక్షం అనేది రహస్యాలతో నిండిన మన విశ్వంలో ఒక భాగం. కొన్ని రహస్యాలను మానవులు ఛేదించారు. అయితే చాలా రహస్యాలు పజిల్‌లుగా మిగిలిపోయాయి. ఈ పజిల్స్ పరిష్కరించడానికి, శాస్త్రవేత్తలు నిరంతరం మానవులను అంతరిక్షంలోకి పంపుతున్నారు. సుమారు 5 నెలలుగా అంతరిక్షంలో చిక్కుకున్న వారిలో భారతీయ సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ కూడా ఒకరు. సునీతా విలియమ్స్‌ను తిరిగి తీసుకురావడానికి నాసా నిరంతరం ప్రయత్నాలు చేస్తోంది. ఫిబ్రవరి-మార్చి నాటికి వారు తిరిగి వచ్చే అవకాశం ఉంది. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చిన తర్వాత సునీతా విలియమ్స్, ఆమె భాగస్వామి బుచ్ విల్మోర్ శారీరకంగా ఫిట్‌గా తయారవుతారు.. కాకపోతే ఎన్ని రోజులు పడుతుందనేది మాత్రం పెద్ద ప్రశ్న. ఎందుకంటే అంతరిక్షం నుంచి తిరిగొచ్చే వ్యోమగాముల్లో శారీరకంగా, మానసికంగా అనేక మార్పులు సంభవిస్తాయి. నెలల తరబడి వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నారు.2022 సంవత్సరం ప్రారంభంలో ఫ్రాంటియర్ న్యూరల్ సర్క్యూట్‌లలో ఒక అధ్యయనం ప్రచురించబడింది. దీని టాపిక్ 'బ్రెయిన్స్ ఇన్ స్పేస్-ఎఫెక్ట్ ఆఫ్ స్పేస్ లైట్ ఆన్ హ్యూమన్ బ్రెయిన్'లో పేర్కొన్నారు. 6 నెలలకు పైగా అంతరిక్షంలో గడిపి తిరిగి వచ్చిన 12 మంది వ్యోమగాములపై ఈ అధ్యయనం జరిగింది. ఈ అధ్యయనంలో అంతరిక్షం నుంచి తిరిగొచ్చే వ్యోమగాముల మెదడుపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై పరిశోధనలు జరిగాయి. అంతరిక్షంలో రేడియేషన్‌ను నివారించడానికి, మెదడు భిన్నంగా పనిచేయడం ప్రారంభిస్తుందని పేర్కొంది. చాలా కాలం గడిపిన తర్వాత తిరిగి వచ్చే వ్యోమగాములు మాట్లాడటం, నడవడం, ప్రజలను కలవడంలో కూడా సమస్యలను ఎదుర్కొంటారని అధ్యయనంలో చెప్పబడింది. వారి కళ్లు కూడా బలహీనమవుతాయి. అంతరిక్ష యాత్ర నుండి తిరిగి వచ్చిన అమెరికన్ వ్యోమగామి డొనాల్డ్ పెటిట్, అతను తన కళ్లు మూసుకున్న వెంటనే దేవకన్యలు, గ్రహాంతరవాసులను చూస్తానని చెప్పాడు. చాలా మంది వ్యోమగాములు ఇలాంటి ఫిర్యాదులు చేశారు.వ్యోమగామి అంతరిక్షంలో ఉన్నప్పుడు, గురుత్వాకర్షణ అదృశ్యమవుతుంది, దీని కారణంగా శరీరం మొత్తం బరువు కూడా తగ్గిపోతున్న అనుభవాన్ని పొందుతారు. వారి మెదడు శరీరాన్ని నియంత్రించడానికి వివిధ మార్గాల్లో పనిచేస్తుంది. గురుత్వాకర్షణ శక్తికి దూరంగా ఉన్నప్పుడు మనిషి ఎముకల బరువు చాలా వేగంగా తగ్గుముఖం పడుతుందని అంతరిక్ష సంస్థ నాసా తెలిపింది. వ్యోమగాములు కూడా అంతరిక్ష రక్తహీనతకు గురవుతారు. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చిన 14 మంది వ్యోమగాముల శరీరంలోని 54 శాతం ఎర్ర రక్తకణాలు నాశనమయ్యాయని ఒక అధ్యయనంలో తేలింది.

# కన్ఫ్యూజన్ లో గులాబీ కేడర్

హైదరాబాద్, జనవరి 4, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారా? పార్టీ వ్యవహారాలను కేటీఆర్ లేదా కవితకు అప్పగించారా? పార్టీ కేడర్ ఎందుకు కన్ఫ్యూజన్‌లో పడింది? సీఎం రేసు కోసం కేటీఆర్-కవిత పోటీ పడుతున్నారా? ఇదే చర్చ పార్టీ నేతలతోపాటు కేడర్‌ను వెంటాడుతోంది.అధికారం పోయిన తర్వాత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది బీఆర్ఎస్. నేతల వలసలు కాసేపు పక్కన బెడితే.. వయోభారం కారణంగా మాజీ సీఎం కేసీఆర్ మునుపటి మాదిరి గా రాజకీయాల్లో యాక్టివ్ కాలేకపోతున్నారు.ఇక అసలు విషయానికొద్దాం..పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు, రెండు వారాల కిందట ఫ్యామిలీ సభ్యులతో కేసీఆర్ సమావేశమయ్యార. దీనికి కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు మరో ముగ్గురు కీలక నేతలు హజరయ్యారు. అనారోగ్యం, వయో భారం కారణంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలనే ఆలోచన బయటపెట్టారట. పార్టీకి కావాల్సిన సలహాలు మాత్రం ఇస్తానని, మీ ముగ్గురు పార్టీ వ్యవహారాలు చూసుకోవాలని చెప్పారట పెద్దాయన.ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా తాను కొద్దిరోజులు కంటిన్యూ అవుతానని అన్నారట. వీలు కుదిరినప్పుడు అసెంబ్లీకి వచ్చి వెళ్తానని, సమావేశాలు సైతం మీరే చూసుకోవాలని తెలిపారట. అయితే పార్టీలో ఎవరికి ఏయే పదవులు అన్నదానిపై నోరు ఎత్తలేదని తెలుస్తోంది.ఇటీవల మీడియాతో చిట్ చాట్ చేసిన కేటీఆర్, ప్రస్తుతం కేసీఆర్ రెస్టు తీసుకుంటున్నారని అన్నారు. అంతేకాదు పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతాయని చెప్పడం వెనుక ఉద్దేశం ఇదేనని అంటున్నారు. దీంతో అధ్యక్షుడు పోటీకి కేటీఆర్-కవిత మధ్య పోటీ నెలకొందని తెలుస్తోంది.కార్యకర్తలతో సమావేశం పెట్టినప్పుడల్లా హార్డ్ కోర్ అభిమానులు మాత్రం కేటీఆర్ సీఎం.. కవిత సీఎం స్లోగన్ చేయడం కూడా అధిపత్యం ఎవరి ఎత్తులు వారు వేస్తున్నట్లు చెబుతున్నారు పార్టీ నేతలు. జరుగుతున్న పరిణామా లను గమనించిన కారు పార్టీ కార్యకర్తలు కాసింత డైలామాలో పడిపోయారు. రేపోమాపో స్థానిక ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల ముందు ఈ తరహా కన్ఫ్యూజన్ కరెక్ట్ కాదనే వాదన బలంగా వినిపిస్తోంది. దీనివల్ల కేడర్ చెదిరిపోయే పరిస్థితి తలెత్తవచ్చని అంటున్నారు.పార్టీ వ్యవహారాలు కేటీఆర్-కవిత చుట్టూ తిరగడంతో హరీష్‌రావు మద్దతుదారులు ఆసక్తి గమనిస్తున్నారు. పార్టీలో ఇంత జరుగుతున్నా, తమ అభిమాన నేత నోరు మెదప పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

# కమలంపై గులాబీ సాఫ్ట్ కార్నర్...

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 4,బీజేపీతో వైరం పెంచుకోవద్దని బీఆర్ఎస్ భావిస్తున్నదా? అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. అధికారంలో ఉన్నంతకాలం బీజేపీని తూర్పారబట్టిన గులాబీ పార్టీ అధినేత కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క స్థానం కూడా గెలవకపోవడంతో సైలెంట్ అయిపోయారు.ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితపై ఈడీ (ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్) కేసు నమోదు చేసినప్పుడు రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక ఆడపిల్లపై బీజేపీ కేసు పెట్టించింది, బెదిరింపులకు భయపడేది లేదు, చిల్లర రాజకీయాలతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు అంటూ కేసీఆర్, కేటీఆర్ అనేక సందర్భాల్లో వ్యాఖ్యానించారు. కవిత సైతం బీజేపీ మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ, అదే ఈడీ ఇప్పుడు కేటీఆర్‌పైన ఫార్ములా ఈ ? రేస్ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ (ఈసీఐఆర్) నమోదు చేసి విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసు జారీ చేస్తే ఒక్క మాట కూడా అనలేదు. ఇదే ఇప్పుడు గులాబీ లీడర్లలో చర్చకు దారితీసిందిఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని కేటీఆర్ తరచూ మీడియా సమావేశాల్లో, చిట్‌చాట్‌లలో విమర్శిస్తున్నారు. కానీ, ఈడీ కేసు పెట్టిన విషయంలో, నోటీస్ ఇచ్చిన అంశంలో మాత్రం బీజేపీని పల్లెత్తు మాట అనడం లేదు. కేటీఆర్ మాత్రమే కాకుండా హరీశ్ రావు, బీఆర్ఎస్ నేతలెవ్వరూ బీజేపీపై ఈ విషయంలో కామెంట్ చేయలేదు. భవిష్యత్తులో మరిన్ని ఈడీ కేసులు వస్తాయేమో, బీజేపీని ఇప్పుడు విమర్శిస్తే ఇబ్బందులుంటాయేమో అన్న భయంలో, ఆ పార్టీకి దగ్గర కావాలన్న ఉద్దేశంతో ఇప్పుడు విమర్శలు చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారేమో అని గుసగుసలు వినిపిస్తున్నాయి.జనగణనలో కులగణన చేయాలని బీజేపీని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కవిత ఒత్తిడి పెంచుతున్నా బీఆర్ఎస్ నేతలెవ్వరూ బీజేపీని కనీసంగా కూడా ప్రస్తావించడం లేదు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఈడీ తీరును తప్పుపట్టిన బీఆర్ఎస్, ఇప్పుడు ఫార్ములా ఈ ? రేస్ విషయంలో భిన్న వైఖరి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కేటీఆర్‌ను ఈడీ చర్యల నుంచి కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే బీజేపీకి ఆగ్రహం కలిగించకుండా ఆచితూచి వ్యవహరిస్తున్నదనే అభిప్రాయాలు గులాబీ లీడర్లలో నెలకొన్నాయి.ఒకే పార్టీలో ఈడీ పట్ల వేర్వేరు సందర్భాల్లో రెండు రకాల పరిణామాలు చోటుచేసుకోవడం పలువురిని ఆచలోనలో పడేసింది. ఎలాగైనా కేటీఆర్‌ను ఈడీ కేసు నుంచి సేవ్ చేసుకోడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నదనే మాటలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నుంచీ బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు, విలీనం చర్చలు జరుగుతూ ఉన్నాయని ఊహాగానాలు బలంగానే వినిపించాయి. సంధి దశలో బీజేపీపై ఎలాంటి కామెంట్లు చేసినా అది ఇబ్బందికి కారణమవుతుందేమోననే ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగానే ఫార్ములా ఈ ? రేస్ విషయంలో ఈడీని, బీజేపీని విమర్శించడం లేదనే మాటలు వినిపిస్తున్నాయి.

# ఇందిరమ్మఇళ్ల సర్వేకు టెక్నికల్ ఎఫెక్ట్...

**కరీంనగర్,ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 4, ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం, నిలువ నీడలేని నిరుపేదలకు స్వంత ఇంటి కలను నిజం చేస్తాం'... ఇది కాంగ్రెస్ ప్రభుత్వ హామీ. ఈ హామీని నిలబెట్టుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల ఎంపిక కోసం ముమ్మరంగా సర్వే చేపట్టింది. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా లబ్దిదారుల ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు.గ్రామీణ ప్రాంతాల్లో నెట్ వర్క్ ప్రాబ్లం ఉండగా పట్టణ ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న వారు అందుబాటులో లేకపోవడం అడ్రస్ సరిగా ఉండకపోవడంతో సర్వేకు ఆటంకంగా మారింది. డిసెంబర్ నెలాఖరులోగా సర్వే పూర్తి పూర్తిచేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకోగా సాంకేతిక సమస్యలతో జనవరి 3 వరకు 75% మాత్రమే సర్వే పూర్తయింది. గ్రామీణ ప్రాంతాల్లో కాస్త పర్వాలేదనుకున్నా పట్టణ ప్రాంతాల్లో మాత్రం 70 శాతం కూడా పూర్తి కాలేదు. లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సర్వే అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు.పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఉప్పట్ల లో నెట్ వర్క్ ప్రాబ్లాన్ని అధికమించేలా గ్రామ కార్యదర్శి హరికృష్ణ పొడవాటి కర్రకు సెల్ ఫోన్ కట్టి హాట్ స్పాట్ ఆన్ చేసి ట్యాబ్ కు కనెక్ట్ చేసుకుని యాప్ లో సర్వే డేటా పొందుపర్చి ఇప్పటి వరకు 90 శాతం సర్వే పూర్తి చేశారు. నెట్వర్క్ ప్రాబ్లం, సాంకేతిక సమస్యలతో రోజుకు 10 నుంచి 15 ఇళ్ల కంటే ఎక్కువ సర్వే చేయలేకపోతున్నామని పలు గ్రామల కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ళ కోసం ప్రభుత్వానికి ప్రజాపాలన కార్యక్రమంలో 8054554 దరఖాస్తులు రాగ, ఇప్పటివరకు 5990889 సర్వే నిర్వహించారు. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 94 శాతం సర్వే పూర్తయింది. జీహెచ్ఎంసీ పరిధిలో అతి తక్కువగా 16 శాతం దరఖాస్తులపైనే సర్వే జరిగింది. కరీంనగర్ నగరం పాలక సంస్థలో 56 శాతం సర్వే పూర్తయింది. హైదరాబాద్ మినహాయించి మిగతా 32 జిల్లాల్లో వారం పదిరోజుల్లో 100 శాతం సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి. సర్వేను వేగవంతం చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కరీంనగర్ జిల్లాలో 82 శాతం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 2,10,677 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు గ్రామాల్లో 88 శాతం, మున్సిపాలిటీలైన జమ్మికుంటలో 96.94 శాతం, హుజురాబాద్ లో 90.75 శాతం, చొప్పదండిలో 84.01 శాతం, కొత్తపల్లిలో 72.15 శాతం, కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో 56 శాతం సర్వే పూర్తయినట్లు కలెక్టర్ పమెలా సత్పతి ప్రకటించారు. త్వరగా పూర్తిచేసేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతున్నామని తెలిపారు.మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పొరపాట్లు జరగకుండా పక్కాగా వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. రోజు వారీగా పూర్తయిన సర్వే వివరాలను అందించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, పొరపాట్లకు తావులేకుండా దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ మొబైల్ యాప్ లో జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని సూచించారు.సంక్రాంతి తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్దిదారుల జాబితా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. అనంతరం గ్రామాల వారీగా లబ్దిదారుల ఎంపిక జాబితాలను జిల్లా కలెక్టర్లకు పంపిస్తారు. కలెక్టర్లు పరిశీలించాక ఇన్చార్జి మంత్రులకు పంపిస్తారు. ఇన్చార్జ్ మంత్రి ఆమోదం తెలిపితే లబ్ధిదారుల ఖాతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇచ్చే నగదును విడతల వారీగా జమచేస్తారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు.ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోకున్నా, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఇంటి యాజమాన్ల వివరాలను సైతం సర్వే యాప్ లో పొందుపర్చాలని క్షేత్రస్థాయి అధికారులను కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన పాతకాలం నాటి ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఎవరైనా వాటి స్థానంలో కొత్త ఇళ్లను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే? అలాంటి వారి వివరాలను కూడా పూర్తిస్థాయిలో సేకరించి సర్వే యాప్ లో పొందుపరుస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్న దృష్ట్యా, దరఖాస్తుదారుల వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటిస్తున్నామని తెలిపారు.

# చంపేస్తున్న చలి

హైదరాబాద్, జనవరి 4, తెలంగాణలో రోజురోజుకి చలి తీవ్రత విపరీతంగా పెరుగుతుందని వాతావరణశాఖ చెప్పింది. గతేడాది కంటే ఈసారి ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా పడిపోతున్నాయని అధికారులు ప్రకటించారు. ఇదిలా ఉంటే రెండు రోజుల నుంచి తెలంగాణలో ఉన్నట్లుండి చలి విపరీతంగా పెరుగుతుంది. రాబోయో రోజుల్లో దక్షిణాది జిల్లాల కంటే ఉత్తరాదిలో చలి తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారి ధర్మరాజు వివరించారు. తెలంగాణలో శీతాకాలం మొదలు సాధారణ స్థాయి కంటే చలి తీవ్రత చాలా ఎక్కువే ఉందని ఆయన వివరించారు. సాధారణ ఉష్ణోగ్రతలు చూసుకుంటే ఆదిలాబాద్లో 12.8 డిగ్రీల నుంచి 7.2 డిగ్రీల దిగువకు పడిపోయాయి. అలా అన్ని జిల్లాల్లో 2 నుంచి 4 డిగ్రీల వరకు నమోదు అవుతున్నట్లు చెప్పారు.రోజుల్లో తెలంగాణలోని ఉత్తరాది జిల్లాలైన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో చలి తీవ్రత భారీగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ మూడు జిల్లాలో ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. సంక్రాంతి సమయంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు. రాష్ట్రంలో ఈశాన్య గాలులు చురుకుగా వీస్తున్నాయని, దాని ప్రభావంతోనే గత రెండు రోజులుగా చలి తీవ్రత బాగా పెరిగినట్లు వాతావరణ శాఖ అధికారి చెప్పారు.ఈశాన్య గాలులతో పాటు రాష్ట్రంపై తూర్పు గాలుల ప్రభావం కూడా ఉందన్నారు. ఈ గాలుల కారణంగా ఉదయం వేళ దట్టమైన పొగ మంచు కురిసే అవకాశం బాగా ఉందని చెప్పారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రతో పాటు పొగ మంచు ఎక్కువగా కురవనున్నట్లు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హైదరాబాద్లో సాధారణం కంటే 2 డిగ్రీలు తక్కువ నమోదు అవుతున్నాయి. రానున్న మూడు రోజులు కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుందన్నారు.రాష్ట్రంలో చలి తీవ్రత పెరిగిపోయింది. సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోయాయి. అత్యంత కనిష్ఠంగా కుమురంభీం జిల్లా సిర్పూర్, గిన్నెదారిలో 6.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 7.7, కుమురంభీం జిల్లా తిర్యాణీలో 7.9, ఆల్గోల్‌లో 7.6 డిగ్రీలు,వికారాబాద్ జిల్లా మోరీన్‌పేటలో 7.3 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 6.9 ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.ఆదిలాబాద్ జిల్లా బేలలో 7.1 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా ఆర్లీలో 7.2, , ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక హైదరాబాద్‌లో అత్యంత కనిష్ఠంగా హెచ్సీయూ, బీహెచ్ఐఎల్ 8.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా రాజేంద్రనగర్‌లో 9.4, మౌలాలీలో 9.6, శివరామ్‌పల్లిలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

# మంజాపై ఉక్కుపాదం

**వరంగల్ప్రజాబలం ప్రతినిధి: జనవరి 4,** నిషేధిత మాంజా దారం విక్రయిస్తున్న వ్యాపారులపై వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు కొరడా ఝుళిపించారు. చైనా మాంజాను విక్రయిస్తుండటం వల్ల పక్షులకే కాకుండా మనుషులకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా నిబంధనలకు విరుద్ధంగా మాంజా అమ్ముతున్న వ్యాపారులపై పోలీసులు నిఘా పెట్టారు.వరంగల్ సెంట్రల్ జోన్ కాజీపేట పీఎస్ పరిధిలో శుక్రవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కాజీపేట విష్ణుపురి కాలనీలో గాలి పటాలు, చైనా మాంజా బిజినెస్ చేస్తున్న శనిగరపు అరవింద్, ఎండీ ఇస్సాక్, మంద శ్రీనాథ్, ఎండీ సాల్మన్ అనే నలుగురు వ్యాపారులను అరెస్ట్ చేశారు. వారి నుంచి మొత్తంగా రూ.2.30 లక్షల విలువైన 115 బండిళ్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న మాంజా దారం బండిళ్లను కాజీపేట పోలీసులకు అప్పగించారు.సంక్రాంతి పండుగ సమయంలో సరదాగా ఎగురవేసే గాలి పటాలు.. జనాల ప్రాణాలు తీస్తున్నాయి. సాధారణ దారాలకు బదులు మార్కెట్‌లో చైనా మాంజా లభిస్తుండటంతో చాలామంది దానినే ఉపయోగిస్తున్నారు. నైలాన్, సింథటిక్ దారానికి ప్లాస్టిక్ పొడి పూసి మాంజాను తయారు చేస్తున్నారు. గాలి పటాలను ఎగురవేసే సమయంలో ఇతరుల పతంగుల దారాలను తెంపడం ఈ మాంజా దారంతో ఈజీ అవుతుంది. దీంతో చాలామంది ఈ చైనా మాంజానే వినియోగించేందుకు ఇష్టపడుతున్నారు.కానీ దాని వల్ల జరుగుతున్న ప్రమాదాల గురించి మాత్రం ఆలోచించడం లేదు. పతంగి తెగిన తరువాత గాలిలో వేలాడుతున్న మాంజా రోడ్లపై వెళ్లే ప్రజలకు చుట్టుకుని గాయాల పాలవుతున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. దీంతో మాంజా అమ్మకాన్ని రాష్ట్రంలో నిషేధించారు. దిగుమతి చాలా వరకు ఆగిపోగా.. మాంజాకు ఉన్న డిమాండ్‌తో కొంతమంది ఇక్కడే తయారు చేస్తున్నారు. ఫలితంగా మార్కెట్‌లో మాంజా అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.మాంజా దారంతో పక్షులతో పాటు ప్రజలకు ప్రమాదాలు జరుగుతున్నాయి. పతంగుల పండుగ స్టార్ట్ కాకముందే రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన వివిధ ఘటనలు మాంజా ఎంత డేంజర్ అనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కొద్దిరోజుల కిందట జనగామ జిల్లాకు చెందిన పదేళ్ల బాలుడు వీక్షిత్.. తల్లిదండ్రులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా గొంతు భాగంలో మాంజా తగిలి తీవ్ర గాయమైంది. ఆయన హాస్పిటల్‌లో చికిత్స పొంది ప్రాణాలు దక్కించుకున్నాడు.ఆ తరువాత బచ్చన్నపేటకు చెందిన సనత్‌కుమార్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి బండిపై వెళ్తుండగా.. మాంజా తగిలి సనత్ కుమార్ గొంతుకు తీవ్ర గాయమైంది. బైక్ అదుపు తప్పి కింద పడటంతో మిగతా ఇద్దరు స్నేహితులు గాయపడ్డారు. జనగామ పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో కూడా ఇటీవల మాంజా తగిలి నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.

గాయపడిన వారిలో పదేళ్ల బాలుడు కూడా ఉన్నాడు.రెండు రోజుల కిందట చంద్రుగొండ మండలం గుర్రాయిగూడెం గ్రామానికి చెందిన ఏరువ కృష్ణారావు.. తన ద్విచక్ర వాహనంపై కొత్తగూడెం వైపు వెళ్తున్నారు. మాంజా గొంతుకు చుట్టుకుని వాయునాళం 75 శాతం వరకు తెలిగిపోయింది. మరో చేతితో మాంజా దారాన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా ఆ చేతి వేళ్లకు కూడా గాయాలై తీవ్ర రక్త స్రావమైంది.

రెండు రోజుల కిందట షాద్‌నగర్‌కు చెందిన రంగనాథ్, తన భార్యతో కలిసి ముచ్చింతల్ వైపు నుంచి వస్తున్నారు. మాంజా కారణంగా రంగనాథ్ గొంతు కొంతమేర కోసుకుపోయింది.

దాన్ని తొలగించే క్రమంలో రంగనాథ్ భార్య చేతులకు కూడా గాయాలు అయ్యాయి.రంగారెడ్డి జిల్లాలో గురువారం బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలకు మాంజా దారం చుట్టు కోవడంతో.. వాళ్లిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఇలా మాంజాతో తరచూ ప్రమాదాలు జరుగుతుండగా.. దానిని అరికట్టే విషయంలో అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఆరాం ఘర్ బ్రిడ్జి ప్రారంభానికి ముహూర్తం

**రాజేంద్రనగర్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ జనవరి 4,హైదరాబాద్‌లోని ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభ తేదీ వాయిదా పడింది. దీంతో ట్రాఫిక్ కష్టాల నుంచి ఉపశమనం పొందేందుకు హైదరాబాద్ వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభమైతే.. ఆరాంఘర్– బహదూర్‌పురా మధ్య ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించారు.ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. ఎందుకంటే ఇది ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను తగ్గిస్తుందని అంటున్నారు. ఫ్లైఓవర్ ప్రారంభం అయితే.. కొన్ని సంవత్సరాలుగా ఉన్న గుంతల రోడ్డు నుండి ఉపశమనం లభిస్తుందని చెబుతున్నారు. మొదట డిసెంబర్ 3, 2024న ప్రారంభించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అయితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీన్ని ప్రారంభించాలని అనుకున్న తర్వాత.. వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు అనేది ఇంకా ప్రకటించలేదు.ఈ ఫ్లైఓవర్ 4.04 కిలోమీటర్లు ఉంది. ఇది హైదరాబాద్‌లోని రెండో పొడవైన ఫ్లైఓవర్‌గా నిలిచింది. ఆరు లేన్లలో దీన్ని నిర్మించారు. రెండు వైపులా రాకపోకలు సాగించవచ్చు. ఆరాంఘర్ ఫ్లైఓవర్ ప్రారంభించిన తర్వాత.. హైదరాబాద్‌లోని అనేక కీలక ప్రాంతాలలో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. ముఖ్యంగా ఆరాంఘర్, శాస్త్రిపురం, కాలాపత్తర్, దారుల్ ఉలూమ్, శివ్రాంపల్లి, హసన్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు తగ్గనున్నాయి.ఈ ఫ్లైఓవర్ నిర్మాణం నగర అభివృద్ధికి ఒక నిదర్శనం అని అధికారులు చెబుతున్నారు. ఇది నగరాన్ని ఆధునికంగా మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఈ ఫ్లైఓవర్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారి అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ)లో భాగంగా నిర్మించారు

# ఇద్దరు మంత్రులకు పదవీ గండం

హైదరాబాద్, జనవరి 4 తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయింది. ఏడాది పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం రేవంత్.. నిఘావర్గాలు, సునీల్ కనుగోలు టీమ్‌తో కలిసి సర్వే తెప్పించుకున్నారని తెలుస్తోంది. అయితే ఈ సర్వేలో సంచలన విషయాలు బయటకు వచ్చాయి. రేవంత్ కేబినేట్ లోని ఇద్దరు మంత్రులపై జనాలు తీవ్ర అసంతృప్తిలోఉన్నారని రిపోర్టులో వెల్లడైనట్లుగా తెలుస్తోంది. అయితే వారిని సీఎం స్వయంగా పిలిచి మాట్లాడుతారా లేకా కేబినేట్ నుంచి తొలిగిస్తారా అన్నది ఇప్పుడు మరింత హాట్ టాపిక్ గా మారింది. అంతేకాకుండా 20 మంది ఎమ్మెల్యేల పనితీరు బాలేదని రిపోర్టులో వెల్లడైనట్లుగా పోలిటికల్ సర్కిల్ లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇందులో కొత్తగా శాసనసభకు ఎన్నికైన ఎమ్మెల్యేలపైనే ఎక్కువగా ప్రజా వ్యతిరేకత ఉన్నట్లుగా సర్వేలో వెల్లడైందట. ఈ సర్వేలను త్వరలో ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్‌లో సీఎం రేవంత్ పంపించనున్నారట. దీంతో సర్వే నివేదికల్లో ఏముందన్న టెన్షన్ ఎమ్మెల్యేల్లో నెలకొంది. సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఇటీవల సీఎం ఇంటికి వెళ్లిన కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రేవంత్ క్లాస్ తీసుకున్నారు. కొత్తగా ఎన్నికైన కొంతమంది ఎమ్మెల్యేలు అత్యుత్సాహం చూపిస్తున్నారని, అతి చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వర్గ విభేదాలు పక్కన పెట్టాలని.. కార్యకర్తలకు సమయం ఇవ్వాలంటూ సూచించారు సీఎం. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలందరి రిపోర్టులు తన దగ్గర ఉన్నాయని.. నేను మారాను మీరు కూడా మారండి అంటూ సీఎం వారికి చెప్పారు. ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం వారికి సూచించారు. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు వెళదామని పార్టీ నేతలతో సీఎం చెప్పుకొచ్చారు. ఇదిలాఉండగా.. సీఎం రేవంత్ బృందం జనవరి 21 నుంచి 23వ తేదీ వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించనున్నారు. దావోస్‌లో 20 నుంచి 24వ తేదీ వరకు అంటే ఐదు రోజుల పాటు 'ప్రపంచ ఆర్థిక వేదిక' వార్షిక సదస్సు జరగనుంది. ఈ సదస్సులో తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ బృందం ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

**హైదరాబాద్ లో బుర్జ్ ఖలీఫా తరహా టవర్**

దుబాయ్ నగరంలో ప్రముఖ ఐకానిక్ సింబల్‌గా ఉన్న బుర్జ్ ఖలీఫా టవర్ లాంటిదాన్ని హైదరాబాద్ శివారులో ఉనికిలోకి రానున్న ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)లోనూ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈనెల 13 నుంచి 24 వరకు ఆస్ట్రేలియా, సింగపూర్, దావోస్‌లలో పర్యటించనున్న ముఖ్యమంత్రి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ బృందం దీనికి సంబంధించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌ను పారిశ్రామికవేత్తలకు ప్రదర్శించి నిర్మాణం కోసం ముందుకు రావాల్సిందిగా కోరే అవకాశమున్నది.గతేడాది దావోస్ పర్యటన సందర్భంగా ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ కాన్సెప్ట్‌ను అక్కడి ఇన్వెస్టర్లకు పరిచయం చేశారు. దీనికి కొనసాగింపుగా నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక డిజైన్, ప్లానింగ్ గురించి ఈసారి పర్యటన సందర్భంగా వివరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సచివాలయ వర్గాల సమాచారం. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ఉన్నందున ఫోర్త్ సిటీకి అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధుల రాకపోకలకు వీలుగా ఉంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీనికి తోడు ప్లాన్డ్ సిటీగా తీర్చిదిద్దాలని భావిస్తున్నందున ఇండస్ట్రియల్, ఫార్మా, కమర్షియల్, టూరిజం క్లస్టర్లను ఫోర్త్ సిటీలో నెలకొల్పాలని ఆలోచిస్తున్నది. వేలాది ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం కానున్నది.ఫోర్త్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం 'ఫ్యూచర్ ఆఫ్ తెలంగాణ'గా భావిస్తున్నది. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలుగా ఉండగా ఫ్యూచర్ సిటీ ఫోర్త్ సిటీగా అవతరించనున్నది. ఫోర్త్ సిటీకి సింబాలిక్‌గా బుర్జ్ ఖలీఫా టవర్ లాంటిదాన్ని ఈ సిటీ మధ్యలో నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నది. 300 అడుగుల వెడల్పయిన రహదారులు, వాటికి అనుసంధానించేలా రేడియల్ రోడ్లపై ఇప్పటికే రహదారుల మంత్రిత్వశాఖ స్పష్టమైన అవగాహనతో ఉన్నది.

# సినిమా




## డబుల్ బొనాంజా పట్టేసిన అంజలి



కొన్నిసార్లు సినిమాల పరంగా జరిగే సంఘటనలు యాదృచ్ఛికమే అయినా విచిత్రంగా అనిపిస్తాయి. అలాంటిదే ఇది కూడా. జనవరి 10 విడుదల కాబోతున్న గేమ్ ఛేంజర్ లో అప్పన్న ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ లో ఆయన భార్యగా అంజలి నటించిన సంగతి తెలిసిందే. ట్రైలర్ లో చూపించిన కట్స్ ప్రకారం రామ్ చరణ్ తల్లిగా కూడా సెకండాఫ్ లో కనిపించబోతోంది. పెర్ఫార్మన్స్ కి చాలా స్కోప్ ఉన్నట్టు, క్లైమాక్స్ కు ముందు తన నటన అద్భుతమనిపించేలా ఉంటుందని దర్శకుడు శంకర్ కితాబు ఇవ్వడం చూశాం. హీరోయిన్ గా స్టార్ల సరసన ఆఫర్లు తగ్గిపోయిన టైంలో అంజలికిది మాములు ఛాన్స్ కాదు. ఇక్కడ దాకా చెప్పిన దాంట్లో కన్నా అసలు విశేషం వేరే ఉంది. అంజలి ఎప్పుడో 2012లో నటించిన మదగజరాజ జనవరి 12 రిలీజవుతోంది. ఇందులో విశాల్ హీరో. పదమూడు సంవత్సరాల క్రితం కాబట్టి అందులో అంజలి గ్లామర్ టచ్ ఉన్న హీరోయిన్ గా నటించింది. తనతో పాటు వరలక్ష్మి శరత్ కుమార్ ఉంది. ఇంత లేట్ అయినా సరే పొంగల్ బరిలో దిగటంతో ఒక్కసారిగా ఫ్యాన్స్, కోలీవుడ్ వర్గాలు ఆశ్చర్యపోయాయి. ఎప్పటికి రాదనుకున్న చిత్రం హఠాత్తుగా రిలీజ్ డేట్ ఇవ్వడంతో సోషల్ మీడియాలో ట్రెండ్ కు దారి తీసింది. ఇందులో విశాల్ స్వయంగా పాడిన పాట ఉండటం గమనార్హం. ఒకపక్క మెచ్యూర్డ్ గా ఒక సినిమా, ఇంకోవైపు ఆడిపాడే మసాలా మూవీ ఇలా క్లాష్ కావడం అంజలికే జరిగింది. మదగజరాజ తెలుగులో వచ్చేది అనుమానంగానే ఉంది. తమిళంలో మాత్రం గేమ్ ఛేంజర్ తో పాటు మరో ఏడెనిమిది సినిమాలతో తలపడనుంది. గత ఏడాది గీతాంజలి మళ్ళీ వచ్చిందితో హిట్టు కొట్టాలని చూసిన అంజలికి ఆశ నెరవేరలేదు. ఒకవేళ గేమ్ ఛేంజర్ సక్సెస్ అయితే మాత్రం మరో బ్రేక్ దొరుకుతుంది. ఆ మధ్య గ్యాంగ్స్ అఫ్ గోదావరిలో కొంచెం బోల్డ్ క్యారెక్టర్ చేసిన ఆశించిన ఫలితం దక్కలేదు. మరి సంక్రాంతికి దక్కుతున్న డబుల్ బొనాంజాతో ఏమైనా జాక్ పాట్ కొడుతుందేమో చూడాలి.

## రాజమౌళి సంస్కారం



ఇప్పుడు ఇండియన్ సినిమాలో తెలుగు చిత్రాలదే హవా. మొత్తంగా సక్సెస్ రేట్ గొప్పగా లేకపోయినా.. మన దగ్గర్నుంచి వస్తున్న కొన్ని సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో భారీ వసూళ్లు సాధిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఒరవడికి శ్రీకారం చుట్టిన దర్శకుడు రాజమౌళి. 'బాహుబలి'తో ఆయన మొత్తం కథను మార్చేశారు. ఆ సినిమాతో ఇండియాలోనే బిగ్గెస్ట్ డైరెక్టర్‌గా అవతరించారు. ఆయన తర్వాతి చిత్రం 'ఆర్ఆర్ఆర్' హాలీవుడ్ లెజెండరీ ఫిలిం మేకర్లు కూడా నోరెళ్లబెట్టేలా చేసింది. అంతర్జాతీయ స్థాయిలో ఆ సినిమా ఊహించని స్పందన తెచ్చుకుంది. ఈ చిత్రానికి రెండు ఆస్కార్ అవార్డులు కూడా రావడం తెలిసిందే. దీంతో రాజమౌళిని, తెలుగు సినిమాను చూసి ఇతరులు అసూయ చెందే పరిస్థితి వచ్చింది. ఆ అసూయతోనే రాజమౌళి మీద తమిళ జనాలు విద్వేషాన్ని వెళ్లగక్కుతుంటారు సోషల్ మీడియాలో. అదే సమయంలో రాజమౌళి ఎదుగుదలను చూపించి మన వాళ్లు అతి చేయడమూ కనిపిస్తుంటుంది. ఇప్పుడు సరైన ఫాంలో లేని లెజెండరీ డైరెక్టర్ శంకర్‌ను తక్కువ చేసే మాట్లాడ్డం ఇందులో భాగమే. 'ఇండియన్-2' రిలీజ్ టైంలో శంకర్‌ను విపరీతంగా ట్రోల్ చేశారు. ఐతే ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం.. మూలాలను, గతాన్ని మరిచిపోకపోవడమే ఒక వ్యక్తి గొప్పదనాన్ని చాటుతుందని రాజమౌళి రుజువు చేశాడు. ఇప్పుడు తాను ఇండియన్ సినిమాను రూల్ చేస్తున్నానని ఆయనేమీ పొంగిపోవడం లేదు. ఒకప్పుడు శంకర్ ఎంత గొప్ప సినిమాలు తీశాడో ఆయన మరిచిపోలేదు. శంకర్ తన లాంటి వర్ధమాన దర్శకులకు ఎంత స్ఫూర్తినిచ్చాడో గుర్తు చేసుకుని తన సంస్కారాన్ని చాటాడు. 'గేమ్ చేంజర్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో శంకర్ గురించి రాజమౌళి అన్న మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. తమిళులు ఈ వీడియోను బాగా వైరల్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజమౌళి గొప్పదనాన్ని వాళ్లు గుర్తిస్తున్నారు. అలాగే శంకర్‌ను తక్కువ చేసి మాట్లాడేవాళ్లు కూడా ఈ వీడియో చూడాల్సిందే. గత పదేళ్లుగా భారీ చిత్రాలు తీస్తున్న తమలాంటి దర్శకులను చూసి ఈ తరం దర్శకులు గర్వ పడుతున్నారని.. కానీ తాము అసిస్టెంట్ డైరెక్టర్లుగా ఉన్నపుడు భారీ సినిమాలు తీసి తమకు స్ఫూర్తినిచ్చింది శంకరే అని రాజమౌళి వ్యాఖ్యానించాడు. ఆయనే అసలైన ఓజీ అంటూ రాజమౌళి కొనియాడారు.

## అనిల్ రావిపూడి చూపించే చిరంజీవి!




టాలీవుడ్ లో అసలు అపజయమే ఎరుగని దర్శకుల్లో రాజమౌళి తర్వాత చెప్పుకోవాల్సిన పేరు అనిల్ రావిపూడి. కళ్యాణ్ రామ్ పటాస్ తో మొదలుపెట్టి బాలకృష్ణ భగవంత్ కేసరి దాకా ట్రాక్ రికార్డుని ఒకేలా మైంటైన్ చేయడం ఆయనకే చెల్లింది. ఈ పండక్కు సంక్రాంతికి వస్తున్నాం టైటిల్ తో మూడోసారి వెంకటేష్ తో జట్టుకట్టిన ఈ ఎంటర్ టైనింగ్ డైరెక్టర్ మరోసారి ఎఫ్2, ఎఫ్3 మించిన ఫన్ ఇస్తానని గ్యారెంటీగా చెబుతున్నాడు. దానికి తగ్గట్టే పోటీ సినిమాల కన్నా వేగంగా తన సినిమా పాటలు ఛార్ట్ బస్టర్స్ అయిపోయి 90 మిలియన్ల వ్యూస్ దాటేసి వంద మైలురాయి వైపు పరుగులు పెడుతున్నాయి. ఇదిలా ఉండగా రావిపూడి తర్వాత సినిమా సాహు గారపాటి నిర్మాణంలో మెగాస్టార్ చిరంజీవితో చేయబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే స్టోరీ లైన్ ఓకే కాగా స్క్రిప్ట్ కు సంబంధించిన డెవలప్మెంట్ల గురించి తాజాగా చిరు ఇంట్లోనే చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో చిరుని ఎలా చూపిస్తాడనే దాని మీద ఫ్యాన్స్ ఊహాగానాలు రకరకాలుగా ఉన్నాయి. సంక్రాంతికి వస్తున్నాం ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అనిల్ కొంత క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. వింటేజ్ చిరంజీవిని చూపించడం కాదు కానీ ఆయనను తాను ఎలా చూడాలని కోరుకుంటున్నానో అలాగే ప్రెజెంట్ చేస్తానని వివరణ ఇచ్చారు. శ్రీకాంత్ ఓదెల ఒకలా చూపిస్తే నేను చిరంజీవిని ఇంకోలా చూపిస్తానని, ఫైనల్ గా ప్రేక్షకులను మెప్పించడమే లక్ష్యంగా కథలు రాసుకుంటానని తేల్చి చెప్పాడు. మహేష్ బాబు, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి సీనియర్ స్టార్లతో పని చేసిన రావిపూడి ఇప్పుడీ మెగా ఆఫర్ ని ప్రమోషన్ గా భావిస్తున్నాడు. కాకపోతే స్క్రిప్ట్ లాకయ్యాక చిరు క్యారెక్టరైజేషన్ గురించి చెబుతానంటున్నారు కాబట్టి ఇంకొన్ని వారాలు వేచి చూడక తప్పదు. విశ్వంభర చివరి దశలో ఉండటంతో బాలన్స్ పూర్తి చేయడంలో మెగాస్టార్ బిజీగా ఉన్నారు. కొత్త రిలీజ్ డేట్ ఇంకా ఫిక్స్ చేయలేదు కానీ వేసవిలో థియేటర్లకు తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ప్రేక్షకులు బాగా ఆనందిస్తారు



'ఇప్పటివరకూ నేను సీరియస్ రోల్స్‌తోపాటుగా గ్లామర్ పాత్రలు మాత్రమే చేశా. కానీ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో మొదటిసారి కామెడీ స్పేస్‌లో కాప్ రోల్ ప్లే చేయడం చాలా ఎక్సయిటింగ్‌గా ఉంది. నన్ను కాప్ రోల్‌లో చూడటం ఆడియెన్స్‌కి ఓ కొత్త ఎక్స్‌పీరియన్స్. ఫస్ట్‌టైం ఇందులో యాక్షన్ సీక్వెన్స్‌లు చేశా. ప్రేక్షకులు బాగా ఆనందిస్తారు.' అని నటి మీనాక్షి చౌదరి అన్నారు. వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచార కార్యక్రమంలో భాగంగా మీనాక్షి మీడియాతో మాట్లాడారు.

## 'రైజ్ ఆఫ్ ది డ్రాగన్'..



ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'లవ్ టుడే'. ఈ చిత్రంలో హీరోగా నటిస్తూనే ప్రదీప్ రంగనాథన్ సినిమాను డైరెక్ట్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఈ హిట్ కాంబి నేషన్ చేతులు కలిపి రూపొందిస్తున్న చిత్రమే 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. ఈ చిత్రానికి కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్. గణేష్, కల్పాతి ఎస్.సురేష్ నిర్మాతలు. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తోన్న ఈ మూవీని 'ఓరి దేవుడా' ఫేమ్ అశ్వత్ మారిముత్తు డైరెక్ట్ చేస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో రూపొందుతోన్న 26వ సినిమా ఇది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్‌కు సంబంధించిన వీడియోకు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి 'రైజ్ ఆఫ్ డ్రాగన్' అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేయటం అభిమానుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ మూవీలోని పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, లియోన్ జేమ్స్, నదీషా థామస్ పాడారు. దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ తొలిసారి ఈ పాటలో డాన్స్ చేయటం విశేషం. హీరో ప్రదీప్ రంగనాథన్‌తో కలిసి ఆయన చేసిన డాన్స్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తోంది. ఈ ఎమోషనల్ మూవీకి అర్చనా కల్పాతి క్రియేట్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తుంటే, ఐశ్వర్యా కల్పాతి అసోసియేట్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు.

## క్యారెక్టర్ ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్. శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ నిర్మాణ సంస్థ ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. శుక్రవారం ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్ జరిగింది. కో ప్రొడ్యూసర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ, 'లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అల్లు అర్జున్‌కు 'ఆర్య' మూవీలా కిరణ్ అబ్బవరంకు 'దిల్ రూబా' అవుతుంది' అని అన్నారు. 'టీజర్‌లో మీరు చూసింది కొంతే. నెక్స్ట్ ట్రైలర్ వస్తుంది' అని ప్రొడ్యూసర్ రవి చెప్పారు. డైరెక్టర్ విశ్వకరుణ్ మాట్లాడుతూ, మనందరి జీవితాల్లోని ప్రేమను స్ఫూర్తిగా తీసుకుని ఈ మూవీ చేశా. మీరంతా ఈ లవ్ స్టోరీని థియేటర్స్‌లో ఎంజాయ్ చేస్తారు' అని తెలిపారు. 'ఈ సినిమాలో నేను చేసిన సిద్ధు, సిద్ధార్థ్ క్యారెక్టర్ చాలా స్పెషల్‌గా హార్డ్ హిట్టింగ్‌గా ఉంటుంది. తను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రేమతో సహా ఏ విషయంలోనైనా వెనక అడుగు వేయడు. క్యారెక్టర్‌ను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ మా సినిమా నచ్చుతుంది' అని హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు.

## వీరి తీరు మారదా..?



గత దశాబ్ద కాలంలో తెలుగు సినిమాలో వేగంగా ఎదిగిన కొరియోగ్రాఫర్లలో శేఖర్ మాస్టర్ ఒకడు. దివంగత రాకేష్ మాస్టర్ దగ్గర శిష్యరికం చేసి.. ఆ తర్వాత సొంతంగా అవకాశాలు అందుకుని ఎంతో కష్టపడి స్టార్ కొరియోగ్రాఫర్‌గా ఎదిగాడు శేఖర్. మెగాస్టార్ చిరంజీవిని అమితంగా అభిమానించే శేఖర్.. ఆయన రీఎంట్రీ మూవీ 'ఖైదీ నంబర్ 150'లో తన ఆరాధ్య నటుడితో అదిరిపోయే స్టెప్పులు వేయించి తన కలను నెరవేర్చుకున్నాడు. గత కొన్నేళ్లలో శేఖర్ నుంచి ఎన్నో అదిరిపోయే పాటలు వచ్చాయి. ప్రస్తుతం తెలుగులో అతనే నంబర్ వన్ కొరియోగ్రాఫర్ అని చెప్పాలి. ఐతే ఎప్పటికప్పుడు వైవిధ్యం చూపించడానికి ప్రయత్నించే శేఖర్.. ఈ మధ్య ఒక రకమైన మూసలోకి వెళ్లిపోతున్నాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాస్ స్టెప్స్ పేరుతో తన స్టెప్పుల్లో వల్గారిటీ ఎక్కువ అయిపోతోందనే చర్చ నడుస్తోంది. గత ఏడాది రవితేజ సినిమా 'మిస్టర్ బచ్చన్'లోని సితార్ పాటలో శేఖర వేయించిన స్టెప్పులు వివాదాస్పదం అయ్యాయి. ముఖ్యంగా హీరోయిన్ బ్యాక్ మీద తబలాలా వాయించడం.. అలాగే బొడ్డు కింద చేయిపెట్టి డ్రెస్ లాగడం లాంటి స్టెప్స్ మీద తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అంత అందమైన పాటలో ఇలాంటి స్టెప్స్ ఏంటి అనే చర్చ జరిగింది. డ్యాన్స్ మూవ్స్ రొమాంటిగ్గా ఉండేలా తీర్చిదిద్దడం ఓకే కానీ, ఇలా శ్రుతి మించకూడదని.. ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా కొంచెం దృష్టిలో ఉంచుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ శేఖర్ మళ్లీ మళ్లీ అలాంటి స్టెప్పే డిజైన్ చేస్తున్నాడు. 'పుష్ప-2'లో పీలింగ్స్ సాంగ్‌లోనూ కొన్ని స్టెప్స్ టూమచ్ అనిపించాయి. స్టెప్స్ రొమాంటిగ్గా ఉండడం వేరు.. వల్గర్ ఫీలింగ్ కలిగించడం వేరు 'పుష్ప-2' స్టెప్స్ రెండో కోవకే చెందుతాయనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు 'డాకు మహారాజ్' నుంచి రిలీజైన 'దబిడి దిబిడి' పాటలో స్టెప్స్ మీద మరింతగా విమర్శలు వస్తున్నాయి.



# క్రీడలు



## సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ ఊచకోత



ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున అభిషేక్ శర్మ ఆడనున్నాడు. ఫ్రాంచైజీ అతడిని రూ.14 కోట్లకు తన వద్దే ఉంచుకుంది. ఐపీఎల్ కి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఊచకోత కోశాడు. అభిషేక్ ప్రస్తుతం పంజాబ్ తరపున దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్‌కు ప్రాతినిధ్యం అభిషేక్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసం సృష్టించాడు. ఫోర్లు, సిక్సర్లతో హైదరాబాద్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. అయితే సెంచరీ దిశగా సాగుతున్న అతని ఇన్నింగ్స్ 93 పరుగుల వద్ద ముగిసింది. విజయ్ హజారే ట్రోఫీ లో అభిషేక్ శర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. తాజాగా హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ తుఫాను బ్యాటింగ్‌తో ముందుకు సాగాడు. మరో 7 పరుగుల దూరంలో అభిషేక్ శతకాన్ని చేజార్చుకున్నాడు. 72 బంతుల్లో 93 పరుగులు చేసి అభిషేక్ ఔటయ్యాడు. అభిషేక్ తన ఇన్నింగ్స్ లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. గత మ్యాచ్‌లో సెంచరీతో కదం తొక్కిన అభిషేక్ హైదరాబాద్ పై సెంచరీ చేస్తాడని అంతా భావించారు. కానీ తనయ్ వికెట్ పడగొట్టడంతో అది సాధ్యపడలేదు. అంతకుముందు సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో 170 పరుగులతో సెంచరీ ఇన్నింగ్స్ ఆడాడు. ముంబైపై కూడా 66 పరుగులు చేశాడు. కాగా అభిషేక్ విధ్వంసానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం సంబరపడిపోతుంది. తమ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ వచ్చే సీజన్లో అదే ఫామ్‌తో ఆడాలని కోరుకుంటుంది. ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున అభిషేక్ శర్మ ఆడనున్నాడు. ఫ్రాంచైజీ అతడిని రూ.14 కోట్లకు తన వద్దే ఉంచుకుంది. అతని గణాంకాలు చూస్తే.. అభిషేక్ శర్మ ఐపీఎల్ లో ఇప్పటివరకు 63 మ్యాచ్‌లు ఆడాడు, అందులో అతను 155.24 స్ట్రైక్ రేట్ మరియు 25.50 సగటుతో 1377 పరుగులు చేశాడు. ఈ సమయంలో 7 అర్ధసెంచరీలు నమోదు చేశాడు. ఐపీఎల్‌లో అభిషేక్ 128 ఫోర్లు, 73 సిక్సర్లు కొట్టాడు.

## కొంపముంచుతున్న అంపైర్ల తప్పుడు నిర్ణయాలు



జోయెల్ విల్సన్ తప్పుడు నిర్ణయంపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ మండిపడ్డారు. టీమిండియా మాజీ బ్యాట్స్‌మెన్ రాబిన్ ఉతప్ప కూడా ఈ నిర్ణయాన్ని విమర్శించారు. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో అంపైర్ల తప్పుడు నిర్ణయాలు కొంపముంచుతున్నాయి. ముఖ్యంగా టీమిండియా విషయంలో అంపైర్లు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. దీంతో గెలిచే మ్యాచ్ లు చేజారుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సిడ్నీ టెస్టులో కూడా బ్యాడ్ అంపైరింగ్ విధానం కనిపించింది. అంతకుముందు మ్యాచ్‌లో కూడా ఇదే బ్యాడ్ అంపైరింగ్ విధానం కనిపించింది. అంపైర్ తప్పుడు నిర్ణయాలతో మాజీ ఆటగాళ్లతో సహా క్రికెట్ విశ్లేషకులు మండిపడుతున్నారు. సిడ్నీ టెస్టులో విరాట్ కోహ్లీ తప్పుడు నిర్ణయంతో ఔట్ అయ్యాడు. అయితే కోహ్లి డీఆర్ఎస్ తీసుకోవడంతో విషయం తేటతెల్లమై నాటౌట్ అయ్యాడు. కోహ్లీ తర్వాత వాషింగ్టన్ సుందర్ విషయంలోనే ఇదే పద్ధతి రిపీట్ అయింది. వాషింగ్టన్ సుందర్ క్యాచ్ అవుట్ విషయంలో అంపైర్ తప్పుడు నిర్ణయంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాట్ కమిన్స్ బౌలింగ్‌లో వాషింగ్టన్ సుందర్ అవుట్ అయ్యాడు. కమిన్స్ వేసిన షార్ట్ పిచ్ డెలివరీని ఆడేందుకు వాషింగ్టన్ సుందర్ ప్రయత్నించాడు. అయితే బంతి కీపర్ చేతుల్లోకి వెళ్లింది. ఫీల్డ్ అంపైర్ సైకత్ నాటౌట్‌గా ప్రకటించాడు. దీని తర్వాత పాట్ కమిన్స్ డీఆర్ఎస్ తీసుకున్నాడు. థర్డ్ అంపైర్ విల్సన్ చాలా సేపు రీప్లేలు చూసాడు. బంతి గ్లౌజ్‌ల దగ్గర నుంచి వెళ్ళింది. కానీ స్నికోమీటర్‌లో స్పైక్ లేనప్పటికీ, బంతి సుందర్ గ్లవ్స్‌కు తగిలి కీపర్‌కి వెళ్లిందని నిర్ణయించుకున్నాడు. దీంతో సుందర్ ఔట్ గా ప్రకటించాడు. అంపైర్ తీసుకున్న ఈ నిర్ణయం చర్చకు దారితీసింది. జోయెల్ విల్సన్ తప్పుడు నిర్ణయంపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకేల్ వాన్ మండిపడ్డారు. టీమిండియా మాజీ బ్యాట్స్‌మెన్ రాబిన్ ఉతప్ప కూడా ఈ నిర్ణయాన్ని విమర్శించారు. నన్ను క్షమించండి మీది పనికిరాని నిర్ణయం అంటూ మండిపడ్డారు. వాషింగ్టన్ సుందర్ వికెట్ విషయంలో బుమ్రా కూడా అసహనం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అటు సోషల్ మీడియాలోనూ అంపైర్ల తప్పుడు నిర్ణయాలపై మండిపడుతున్నారు. ఈ సిరీస్ లో కేఎల్ రాహుల్, జైస్వాల్ విషయంలోనూ ఇదే తప్పిదం చోటు చేసుకుంది.

## చెలరేగిన నితీశ్..

## 181 పరుగులకే ఆస్ట్రేలియా ఆలౌట్



గతంలోకి వెటళితే.. ఈ మైదానంల సిడ్నీ వేదికగా జరుగుతున్న ఇండియా, ఆస్ట్రేలియా ఐదో టెస్ట్ మ్యాచ్ రసవత్తరంగా సాగుతోంది. టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో టీమిండియా 185 పరుగులు చేయగా.. ఆస్ట్రేలియా సైతం 181 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్‌కు 4 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. సిడ్నీ క్రికెట్ మైదానంలో ఆస్ట్రేలియాను 200 పరుగులలోపు ఆలౌట్ చేయడం అనేది గత 70 ఏళ్లలో ఇది రెండోసారి మాత్రమే. అంటే సిడ్నీ క్రికెట్ మైదానంలో ఆస్ట్రేలియా టీమ్‌కు ఎంత మంచి ట్రాక్ రికార్డు ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. గతంలోకి వెటళితే.. ఈ మైదానంలో ఇంగ్లండ్ టీమ్ 123 పరుగులకు ఆలౌట్ అయింది. ఆస్ట్రేలియా టీమ్ 145 పరుగులకు ఆలౌట్ అయింది. మరోవైపు మహ్మద్ సిరాజ్, నితీశ్ కుమార్ రెడ్డిలు భారత జట్టుకు ప్రధాన బలంగా మారారు. వారు అద్భుత ఆటతీరుతో టీమ్‌ను ముున్ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ టెస్టులో నితీశ్ రెడ్డికి తొలి వికెట్ దక్కింది. అతడు ప్యాట్ కమిన్స్‌ను ఔట్ చేశాడు. నితీశ్ వేసిన బాల్ ప్యాట్ కమిన్స్ బ్యాట్ అంచును తాకుతూ వెళ్లి విరాట్ కొహ్లీ చేతికి చిక్కింది. ఆ సమయానికి ఆస్ట్రేలియా స్కోర్ 162/7గా ఉంది. ఆ వెంటనే మిచెల్ స్టార్క్ కూడా నితీశ్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. నితీశ్ వేసిన బంతిని మిచెల్ ఆడబోగా.. అది సెకండ్ స్లిప్‌లో కేఎల్ రాహుల్ చేతిలోకి వెళ్లింది. సిరాజ్ బౌలింగ్‌లో స్కాట్ బోలాండ్ (9) బౌల్డ్ అయ్యాడు. ప్రసిధ్ మూడు వికెట్లు తీశాడు. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ బ్యాటింగ్‌ను మొదలుపెట్టింది. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ రంగంలోకి దిగారు. మొత్తం మీద ఈ టెస్టులో బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ అంశం భారత్‌ను ప్రధానంగా కలవరపరుస్తోంది. ఇవాళ మ్యాచ్ సందర్భంగా 31వ ఓవర్ తర్వాత వైద్య బృందంతో కలిసి బుమ్రా ఛేంజ్‌రూమ్ నుంచి బయటకు వెళ్లారు. అతడిని స్కాన్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో బుమ్రా స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా అభిమన్యు ఈశ్వరన్ వచ్చాడు.

## ప్రభ్ సిమ్రాన్ సింగ్ హ్యాట్రిక్ శతకాలు..



వచ్చే సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ ప్రభాసిమ్రాన్ సింగ్ ను 4 కోట్లకు అట్టిపెట్టుకుంది. అయితే ఫ్రాంచైజీ అతనిపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ వరుస సెంచరీలతో విధ్వంసం సృష్టిస్తున్నాడు. ఐపీఎల్ కి ముందు స్వదేశీ లీగ్ లలో ఆటగాళ్లు అదరగొడుతున్నారు. సెంచరీలతో పోటీ పడుతూ ఫ్రాంచైజీ ఓనర్లను ఆకర్షిస్తున్నారు. తాజాగా పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ భారీ సెంచరీతో తెగబడ్డాడు. ఈ సెంచరీతో ప్రభసిమ్రాన్ సింగ్ విజయ్ హజారే ట్రోఫీలో హ్యాట్రిక్ శతకాలు నమోదు చేశాడు. హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్ 105 బంతుల్లో 20 ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో 137 పరుగులు చేశాడు. ప్రభాసిమ్రన్ సెంచరీతో పాటు, కెప్టెన్ అభిషేక్ శర్మ (93), రమణదీప్ సింగ్ (80) అద్భుతమైన ఇన్నింగ్స్‌ల ఆధారంగా పంజాబ్ వరుసగా రెండో మ్యాచ్‌లో 400 పరుగులు చేసింది. హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసింది. విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ మూడు రోజుల క్రితం నెలకొల్పిన 424 పరుగుల రికార్డును మళ్ళీ పంజాబే బద్దలు కొట్టింది. దీంతో పంజాబ్ వరుసగా రెండో మ్యాచ్‌లో కూడా 400 పరుగుల మార్క్ ను అందుకుంది. వచ్చే సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ ప్రభాసిమ్రాన్ సింగ్ ను 4 కోట్లకు అట్టిపెట్టుకుంది. అయితే ఫ్రాంచైజీ అతనిపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడుతూ వరుస సెంచరీలతో విధ్వంసం సృష్టిస్తున్నాడు. హైదరాబాద్ పై 137, ముంబైపై 150, సౌరాష్ట్రపై 125 పరుగులతో వరుస సెంచరీలు బాదాడు. ఏదేమైనా ప్రభాసిమ్రాన్ సింగ్ ను నిలబెట్టుకున్నందుకు పంజాబ్ కింగ్స్ ఖచ్చితంగా గర్వపడుతుంది. మరోవైపు కర్ణాటకకు చెందిన మయాంక్ అగర్వాల్ కూడా వరుసగా మూడు సెంచరీలు సాధించాడు.

## లిస్ట్–ఎ క్రికెట్‌లో కరుణ్ ప్రపంచ రికార్డు



టీమిండియా బ్యాటర్, టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ కొట్టిన కరుణ్ నాయర్ లిస్ట్–ఎ క్రికెట్‌లో పరుగుల వరద పారిస్తూ.. ఓ ప్రపంచ రికార్డును బ్రేక్ చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో 33ఏళ్ల కరుణ్ నాయర్ విదర్భ కెప్టెన్‌గా ఉండి సెంచరీల మోత మోగిస్తున్నాడు. ఇప్పటికే వరుసగా రెండు శతకాలు బాదిన అతను.. ఉత్తర్‌ప్రదేశ్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లోనూ (112బీ 101 బంతుల్లో 11ఫోర్లు, 2సిక్స్‌లు) మూడంకెల స్కోరు సాధించి హ్యాట్రిక్ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలోనే ఓ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ ఇన్నింగ్స్‌తో కరుణ్ నాయర్ లిస్ట్–ఎ క్రికెట్‌లో నాటౌట్‌గా నిలుస్తూ అత్యధిక పరుగులు (542) చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు జేమ్స్ ఫ్రాంక్లిన్ (527) పరుగులు పేరిట ఉండేది. గత నాలుగు మ్యాచ్‌ల్లో కరుణ్ నాయర్ నాటౌట్‌గా నిలిచాడు. జమ్మూ కాశ్మీర్‌పై (112), ఛత్తీస్‌గడ్‌పై (44), చంఢగీడ్‌పై (163), తమిళనాడుపై (111) అజేయంగా నిలుస్తూ పరుగుల వరద పారించాడు. దీంతో విదర్భ ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. ఇక ఛత్తీస్‌గడ్ జట్టు జమ్ము–కాశ్మీర్‌పై 7వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జమ్ము జట్టు 47.3ఓవర్లలో 337పరుగులకు ఆలౌట్ కాగా. ఛత్తీస్‌గడ్ జట్టు 48.3ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 339పరుగులు చేసి గెలిచింది.

# మణికొండ కాదు మచ్చర్ కొండ




**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 4 జనవరి 2025** మణికొండ కౌన్సిల్ పరిధిలోని నెక్నంపూర్, పుప్పాలగూడ, మణికొండ ప్రాంతాలలోని దాదాపు అన్ని కాలనీల లోని ప్రజలు ఎదుర్కుంటున్న తీవ్ర సమస్యలలో ధోమల బెడదలతో పాటు ట్రాఫిక్ సమస్య మరియు ఎగుడు దిగుడు రహదారిలు కాగా ఈ విషయాలపై అధికారులకు పలుమార్లు పిర్యాదు చేయడం జరిగినదని ది సిటిజన్స్ కౌన్సిల్ ఉప కార్యదర్శి బొమ్మ ఉపేంద్రనాద్ రెడ్డి తెలియజేస్తూ మణికొండ ప్రాంతంలో పెరుగుతున్న ధోమల సమస్య, ముఖ్యంగా వాటి ప్రభావం వల్ల చిన్న పిల్లల ఆరోగ్యలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ప్రజలు ముక్త కంఠంతో వాపోతున్నారని, పిల్లలు పెద్దలు దోమల బెడద తీవ్రతతో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తది తర వ్యాధులు తీవ్రంగా ఎదుర్కుంటున్నారని, సమ సమాజాన్ని రక్షించడానికి తక్షణ చర్యలు తీసుకోవడం ఉత్తమంగా భావించి అశేష ప్రజల మద్దతుతో ది సిటిజన్స్ కౌన్సిల్ మణికొండ ఆద్వర్యంలో జనవరి 4 శనివారం రోజున నెక్నంపూర్ చింతచెట్టు సర్కిల్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ప్రాజాభి ప్రాయనికి మద్దతు తెలుపుతూ నిరసన కార్యక్రమం అనంతరం జనవాహినితొ కలసి దోమల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలనే పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ పాదయాత్రగా మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ ని కలసి ధోమలను నియంత్రించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లు పద్మారావు, నవీన్ కుమార్, ప్రసాద్, గణపతి రాజు, జాఫర్, విజయ భాస్కర్, సుజాత, స్వప్న, రాధిక, రూపా, అనితా, విజయలక్ష్మిల ఆద్వర్యంలో పలు కాలనీల కార్య వర్గ సభ్యులు, ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, కార్యదర్శి ఆరీఫ్ మొహమ్మద్, కార్యవర్గ సభ్యుడు బొడ్డు శ్రీధర్, స్థానిక నాయకులు ముత్తంగి లక్ష్మయ్య, గుట్టమీద నరేందర్, రాజేంద్ర ప్రసాద్, మాల్యాద్రి నాయుడు, బుద్దోల్ బాబు, కిరణ్, షేక్ ఆరిఫ్, విఠల్, భాను, రేఖ, మంజు తది తరులు పాల్గొన్నారు.

# అవోపా అధ్యక్షునిగా బొడ్డు శ్రీధర్



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 4 జనవరి 2025** తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య ఆఫీసర్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ ఆద్వర్యంలో జరిగిన కార్య వర్గ సమావేశంలో అవోపా ద్వారా జరుపుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ రంగారెడ్డి జిల్లా మణికొండ ప్రాంతానికి చెందిన ప్రజల బాగు కొరకు పరితపించే నిరాడంబరుడు బొడ్డు శ్రీధర్ ని పరిచయం చేస్తూ రంగారెడ్డి జిల్లా అర్బన్ 2 కు అధ్యక్షునిగా, గజ్జల స్రవంతినీ మహిళా విభాగపు అధ్యక్షురాలిగా మరియు కార్యవర్గ సభ్యులనూ ప్రకటించి ఇతోచితముగా సన్మానం చేయడం జరిగినది, తథ్ ప్రశ్చత్ బొడ్డు శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు మలిపెద్ది శంకర్ మరియు ఇతర పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా అవోపా అభివృద్ధికై, రంగారెడ్డి అర్బన్ 2 లో మెంబర్షిప్ పెంచి యూనిట్ లను పెంచడానికి అందరినీ కలుపుకొని సాయా శక్తుల తన వంతు ప్రయత్నం చేస్తానని తెలియ జేసినారు.



## సావిత్రి భాయ్ పూలె జయంతిని అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన .... ఎస్ సి/ ఎస్ టి ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెద్దాపురం దుర్గయ్య





**సంగారెడ్డి జనవరి 04 ప్రజ బలం ప్రతినిధి:**సావిత్రి భాయ్ పూలె జయంతిని అధికారికంగా నిర్వహించడనికి జి ఓ.9 రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం పట్ల ఎస్ సి /ఎస్ టి ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెద్దాపురం దుర్గయ్య హర్ష%శీ% వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలనుండి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర%శీ% మరియు జిల్లా కమిటీ అధ్యర్యంలో సావిత్రి భాయ్ పూలె జయంతిని నిర్వహించడం వలన ప్రభుత్వం జి ఓ ఇచ్చిందని అన్నారు. గత సంవత్సర%శీ% 7-1-2024 న హైదరాబాద్ లో సావిత్రి భాయ్ పూలె జయంతిని ఎస్ సి ఎస్ టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ నిర్వహించిన సందర్బంగా పంచాయతీ రాష్ట్ర శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిధిగా విచ్చేసి హామీ ఇచ్చిన ప్రకారం, ఈనాడు జి ఓ ఇచ్చి వచ్చిందన్నారు. జి ఓ రావడానికి విశేష కృషి చేసిన ఎస్ సి ఎస్ టి రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకట్ కు మరియు ప్రధాన కార్యదర్శి చవాన్ సుభాన్ సింగ్ మరియు రాష్ట్ర కమిటీ బాద్యులకు సంగారెడ్డి జిల్లా పక్షాన ధన్యవాదములు తెలియచేస్తున్నమని అన్నారు.

జిలాలోని పలు పాఠశాలలో సావిత్రి బాయి పులే జయంతి ని ఘనంగా నిర్వహించడం జరిగిందని అన్నారు.

అనంతరం పాఠశాల లోని మహిళా ఉపాధ్యాయ లను సన్మానించాడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చలి తీవ్రతకు వణుకుతోన్న ఉత్తర భారతం
## 40 విమానాలను రద్దు చేసిన అధికారులు

న్యూ ఢిల్లీ జనవరి 4 చలి తీవ్రతకు ఉత్తర భారతం వణుకుతోంది. ఢిల్లీ సహా హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, బీహార్ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. దీంతో దట్టమైన పొగ మంచు కమ్మేసింది పొగమంచు కారణంగా విమాన, రైలు సర్వీసులకు ఆటంకం ఏర్పడింది దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విజిబిలిజీ జీరోకు పడిపోయింది. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే దాదాపు 250 విమానాలు ఆలస్యమయ్యాయి. 40 విమానాలను అధికారులు రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి.

# జర్నలిస్టు బీంరావు గుండె పోటుతో హఠాన్మరణం

**-బౌతిక కాయానికి నివాళులర్పించిన జర్నలిస్టులు**

**మంచి జర్నలిస్టు మిత్రుడిని కోల్పోయాం**

**టీడబ్ల్యూజే ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య**



**ప్రజాబలం ప్రతినిధి 4 జనవరి 2025** సీనియర్ జర్నలిస్టు ఎన్ సీ బీంరావు యాదవ్(60) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. హైదరాబాద్ లోని ముషీరాబాద్ కేంద్రంగా ఆయన వివిధ పత్రికల్లో దాదాపు మూడు దశాబ్దాల పాటు విలేకరిగా పనిచేశారు. ప్రధానంగా ఆంధ్రజ్యోతి,ఈనాడు పత్రికల్లో చాలాకాలం పనిచేసిన బీంరావు స్థానిక ప్రజా సమస్యలపై వార్తలు,కథనాలు రాసి,సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. మంచి వ్యక్తిత్వం, పట్టుదల, అందరితో కలివిడిగా ఉండే బీంరావు హఠాన్మరణం దిగ్భ్రాంతిని కలిగించింది. శుక్రవారం సాయంత్రం వరకు చురుగ్గా ఉన్న బీంరావు శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో మౌలాలిలోని ఆయన ఇంట్లో హఠాత్తుగా గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. బీంరావు బౌతిక కాయానికి సాయంత్రం మౌలాలిలో అంత్యక్రియలు జరిగాయి.

బీంరావుకు పలువురు జర్నలిస్టుల సంతాపం

జర్నలిస్టు బీమ్ రావు మరణవార్త తెలియగానే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మౌలాలిలోని ఆయన ఇంటికి వెళ్లి బీంరావు బౌతిక కాయానికి పూలమాల వేసి శ్రద్దాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన బీంరావుతో తనకున్న సాన్నిత్యాన్ని గుర్తు చేశారు. ఆంధ్రజ్యోతిలో తనతో పాటు పని చేశాడని, తనకు మంచి మిత్రుడని మామిడి సోమయ్య తెలిపారు. బీంరావు హఠాన్మరణం చెందడం చాలా బాధాకరమని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని పేర్కొంటూ, బీంరావు మృతికి సంతాపం, అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీంరావు బౌతిక కాయానికి గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్,ముషీరాబాద్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నాయకులు సీహెచ్ వీరారెడ్డి, కనకరాజు,
సాగర్,రాంరెడ్డి, నాగరాజు, తెలంగాణ జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు నివాళు లర్పించారు.

### బీంరావు మృతికి దత్తాత్రేయ సంతాపం

సీనియర్ జర్నలిస్టు ఎన్ సి భీం రావు యాదవ్ మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర సంతాపాన్ని తెలియజేసారు. భీం రావు మరణ వార్త తనకు తీవ్ర దుఃఖాన్ని కలిగించిందని, గత మూడు దశాబ్దాలుగా ఆయన పాత్రికేయ రంగంలో విశేష సేవలందించారని, ముషీరాబాద్ నియోజకవర్గంలో అనేక సమస్యలు తన వార్తా కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషిచేశారని తెలిపారు.భీం రావు మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటు అని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.భీం రావు మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానని, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని, అలాగే ఈ కష్టకాలంలో బాధను తట్టుకోవడానికి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు దత్తాత్రేయ తెలియజేసారు.

# జెండా వెంకటాపూర్ సొసైటీ ద్వారా చెక్కు పంపిణీ
## పీఏసీ ఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 04 :** మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న పీఏసీఎస్. ఛైర్మన్ తిప్పని లింగయ్య.
లక్షెట్టిపేట మండలం లోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన బోడకుంటి మహేష్ ఇటీవల అనారోగ్యం తో మరణించారు.కాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జెండా వెంకటాపూర్ హెడ్ క్వార్టర్ లక్షెట్టిపేట లో మృతుడు పంట రుణం తీసుకోగా అతని పేరిట భీమా కంపెనీ కి సొసైటీ వారు ఇన్సూరెన్స్ కట్టడం తో 2 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ మంజూరు అయింది.దీంతో శనివారం పీఏసీఎస్.జెండా వెంకటాపూర్ సంఘం చేత పీఏసీఎస్.ఛైర్మన్ తిప్పని లింగయ్య,వైస్-ఛైర్మన్ కాసు సురేష్,డైరెక్టర్ కాంద్రపు సత్తయ్య, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ పంకజ్, సీఈవో విష్ణువర్ధన్ రావు చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులు బోడకుంటి రమేష్ కు రెండు లక్షల చెక్కును పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో పీఏసీఎస్.సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మానవ హక్కుల మండలి ఎన్జీఓ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా కాటిపల్లి రాజు



**కరీంనగర్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి జనవరి 4**జాతీయ మానవ హక్కుల మండలి ఎన్జీఓ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జమ్మికుంట పట్టణానికి చెందిన కాటిపల్లి రాజును నియమిస్తూ ఎన్ హెచ్ ఆర్ సి (ఎన్జీఓ) జాతీయ అధ్యక్షులు అయిలినేని శ్రీనివాసరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కాటిపల్లి రాజు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మానవహక్కుల మండలి ఎన్జీఓ జాతీయ అధ్యక్షులు అయిలినేని శ్రీనివాస్ రావు, రాష్ట్ర అధ్యక్షులు నక్క గంగారం, నార్త్ జోన్ అధ్యక్షులు కొరిపెల్లి ప్రశాంత్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో మానవ హక్కుల పట్ల చైతన్యం, హక్కుల రక్షణ, సమాచార హక్కు చట్టం సద్వినియోగం చేస్తామని, హక్కుల ఉద్యమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం అయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తానని రాజు పేర్కొన్నారు.

## కడియంపై మండిపడ్డ ఎమ్మెల్యే పల్లా

జనగామ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే పై కడియం శ్రీహరి బిఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. శనివారం నాడు జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అయనపంపిణీ చేసారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నాయకుల శ్రమ,పార్టీ జండాతో స్టేషన్ ఘనపూర్ లో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్ పార్టీలో చేరిండు. కడియం శ్రీహరి నీకు సిగ్గు,శరం ఉంటే మా పార్టీ బిక్షతో గెలిచిన నీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా. మా నాయకులు,ప్రజలు నీకు గోరి కడతారని అన్నారు. కడియం శ్రీహరి నీకు బిక్ష పెట్టిన కేసీఆర్ పై అవాక్కులు చవాక్కులు పేలుతున్నావు. ఖబాడ్ధార్ బిడ్డ స్టేషన్ ఘనపూర్ ప్రజలు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు నీకు బుద్ధి చెబుతారు. పొద్దు తిరుగుడు పువ్వు లాగా పార్టీలు మారే నువ్వు కెసిఆర్ ను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# అంధుల అక్షర ప్రధాత లూయిస్ బ్రెయిలి 216వ జన్మదిన వేడుకలు.

**దివ్యాంగుల ప్రజావాణి కి 14దరఖాస్తులు**

**ఈనెల 8న దివ్యాంగుల కొరకు ప్రత్యేక జాబ్ మేళా**

**.. ... జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**



**సంగారెడ్డి ,జనవరి 04 ప్రజ బలం ప్రతినిధి:** జిల్లా మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖఆధ్వర్యంలో అంధుల అక్షర ప్రదాత లూయిా బ్రెయిలీ 216 వ జన్మదిన వేడుకలు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు .

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు హాజరై కలెక్టరేట్లోని లూయిా బ్రెయిలీ విగ్రహానికి పూలలంకరణ గావించి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన చేసి జన్మదిన వేడుకలు ప్రారంభించారు .

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లూయి బ్రెయిలీ తనకు అంధత్వం వచ్చిందని బాధపడకుండా అంధులు చదువుకోడానికి వీలుగా ప్రత్యేక లిపిని కనుగొన్నారని అన్నారు. బ్రెయిలి లిపి ద్వారా అంధులు చదవగలగటం ప్రారంభించి, తమ జీవితాల్లో స్వావలంబన సాధించారు. బ్రెయిలి లిపి ఆధారంగా కంప్యూటర్లలో బ్రెయిలి స్క్రీన్ రీడర్లు, టచ్ స్క్రీన్ బ్రెయిలి పరికరాలు అభివృద్ధి చెందాయని తెలిపారు . బ్రెయిలి లిపి ఒక సింపుల్ కాన్సెప్ట్ అయినా, అంధుల చదవడం, వ్రాయడం, విద్యను స్వేచ్ఛతో పొందడంలో గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. ఈ లిపి 6 బిందువుల ఆధారంగా రూపొందించబడింది, ఇది అక్షరాలు, సంఖ్యలు, సంగీతం వంటి వివిధ అంశాలను సులభంగా ప్రదర్శించగలుగుతుంది. బ్రెయిలీ లిపి ఆధారంగా ఎంతోమంది అంధులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు . సివిల్ సర్వీసులల్లో ర్యాంకులు సాధించి కలెక్టర్లు అవుతున్నారని గుర్తు చేశారు . అంధులు సామాన్యులకు కూడా తీసిపోకుండా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అంధులు అందరూ తమ వైకల్యాన్ని మరచి, మనోధర్యంతో పట్టుదల వదలకుండా కృషిచేసి విజయం సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. జిల్లాలో అందులో కోసం ప్రత్యేకంగా సౌండ్ లైబ్రరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు .లూయిస్ బ్రెయిలి అందరికి మార్గదర్శనం, అంధుల పట్ల శ్రద్ధ, అభిరుచి ,సేవా భావంతో చేసిన పనులు మనందరికీ స్ఫూర్తి. ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికి తన లక్ష్యాన్ని చేరుకునే శక్తి నిచ్చింది. లూయిస్ బ్రెయిలి పేరు చరిత్రలో శాశ్వతంగా నిలిచి అంధుల హక్కుల కాంతి వంతమైన చిహ్నంగా నిలుస్తుందని , లూయి బ్రెయిలీ జన్మదిన వేడుకలు సందర్భముగా అంధులకు జ్ఞాపకం అందజేశారు. అనంతరం బ్లైండ్ స్టిక్స్ ను పంపిణీ చేశారు. బ్రెయిలీ లిపి క్యాలెండర్ ను ఆవిష్కరించారు.

జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కారానికి ప్రతి నెల మొదటి శనివారం ప్రత్యేక ప్రజావాణిని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా శనివారం నిర్వహించిన ప్రజావాణిలో 14 దరఖాస్తులు అందాయని తెలిపారు. అందులో పెన్షన్ల కొరకు, ఉపకరణముల కొరకు దరఖాస్తుల అందాయని తెలిపారు .

ఈ ప్రత్యేక ప్రజావాణి దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికై ఇక నుండి ప్రతి నెల మొదటి శనివారం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. దివ్యాంగుల కొరకు ప్రైవేట్ రంగంలో జాబులు కొరకు జిల్లా ఉపాధి అధికారి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం ఆడిటోరియంలో యందు ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా లోని నిరుద్యోలైన దివ్యాంగులు తగిన విద్యార్థులు గల ధృవపత్రాలతో హాజరై ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు . ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజారాణి, జడ్పి సీఈవో జానకి రెడ్డి , జిల్లా సంక్షేమ అధికాణి, శ్రీమతి కె లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ అనిల్ కుమార్, జిల్లా అంధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎస్. ప్రవీణ్ కుమార్ ,ఏ లక్ష్మణ్ , కే మహేష్ ,జ్ఞానేశ్వర్ , విట్టల్, జుబేదా, రాంశెట్టి , తదితరులు పాల్గొన్నారు

# మంచిర్యాల ను సర్వాంగసుందరంగా మారుస్తా

## ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జనవరి 04 :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంచిర్యాల ను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు భరోసా ఇచ్చారు.శనివారం గోదావరి రోడ్ లో నిర్మిస్తున్న మహాప్రస్థానం,రోడ్డు విస్తరణలో భాగంగా తొలగిస్తున్న కట్టడాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తానన్నారు. మూడేళ్ళ లోపు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని తెలిపారు. మహాప్రస్థానం పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని శివరాత్రి పండుగ లోపు పూర్తి చేస్తామని తెలిపారు. మాతా, శిశు ఆసుపత్రి నిర్మాణం పనులు వేగవంతం గా జరుగుతున్నాయని,సెల్లార్ తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈనెలాఖరులో రాళ్ళవాగు ఇరువైపులా కరకట్ట నిర్మాణం పనులు ఆరంభించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మెయిన్ రోడ్, కూరగాయల మార్కెట్, వాటర్ ట్యాన్క్ రోడ్, శ్రీనివాస్ టాకీస్ రోడ్ రహదారి విస్తరణ పనులు ఆరునెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వ్యాపారస్థులు ఇబ్బందులు పడకుండా పనులు జరిపితీరుతామని అన్నారు.అండర్ గ్రౌండ్ డ్రైన్ పనులు పైలట్ ప్రాజెక్టు కింద చేపడుతున్నామని తెలిపారు. ఆరు నెలల తర్వాత వ్యాపార కూడళ్ల రూపురేఖలు సుందరంగా మారుతాయని అన్నారు.మంచిర్యాల మున్సిపాలిటి కార్పొరేషన్ గా మారితే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో ప్రథమ స్థానంలో నిలుపుతానని చెప్పారు. సింగరేణి కార్మికులకు ఇండ్ల పట్టాల పంపిణీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. తన ఆరోగ్యంపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారంపై అసహనం వ్యక్తం చేశారు. కాలుకు చిన్న ఆపరేషన్ జరిగిందని కానీ ప్రత్యర్థులు చిలువలు పలువలుగా ప్రచారం చేశారని ఆరోపించారు. ప్రజల ఆశీస్సులు తో తాను సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు.

### డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవి

వినుకొండ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రభుత్వ చీఫ్ విప్, శాసనసభ్యులు జీవి ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవి ఆంజనేయులు మాట్లాడుతూ, గత టిడిపి ప్రభుత్వంలో ఇంటర్ విద్యార్థులకు ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని జగన్ వచ్చాక తొలగించి పేద విద్యార్థుల నోటికాడ కూడు తీశాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్ విద్యార్థుల ఆకలి తీర్చడానికే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ పథకం తిరిగి అమలు చేసిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్ జీవి భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్







**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 4:** రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ అన్నారు.

శనివారం రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ తో కలిసి రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణ పై జిల్లా కలెక్టర్లు, ఎస్పీ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని నేడు రొడ్డు భద్రతా మాసోత్సవం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి శాఖను భాగస్వామ్యం చేస్తూ వినూత్నంగా ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల పై వేడుకలను ప్రతి గ్రామంలో జరగాలని అన్నారు. పిల్లల్లో రొడ్డు భద్రతా ప్రమాణాల పై అవగాహన కల్పించేందుకు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులచే ప్రతి జిల్లా , మండల హెడ్ క్వార్టర్ లో భారీ ర్యాలీ చేపట్టాలని అన్నారు. ఆర్%ఉ% బీ, పంచాయతీ రాజ్ శాఖ తమ పరిధిలో రొడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాలు జరగాలని అన్నారు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ, రొడ్డు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు భద్రత కార్యక్రమాలు విజయవంతం చేయాలని అన్నారు. భారీ తుఫాన్లు, వరదలు, రోగాల వల్ల పోయే ప్రాణాల కంటే ప్రమాదంలో అధికంగా ప్రాణాలు కోల్పోతున్నామని, రొడ్డు ప్రమాదాల నియంత్రణకు మనమంతా కలిసి పని చేయాలని అన్నారు. రొడ్డు భద్రతా ప్రమాణాలను పిల్లల సిలబస్ లో కూడా పెట్టెలా చూస్తామని అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించని వారి లైసెన్స్ రద్దు చేసి భవిష్యత్తులో జారీ చేసేందుకు వీలు లేకుండా సాఫ్ట్వేర్ రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రతి ఒక్కరు నిబంధనలు పాటించాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలకు విస్తృత ప్రచారం ఉండాలని, స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహన కార్యక్రమాల్లో హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ వినియోగించేలా ప్రోత్సహిస్తూ కొంతమందికి హెల్మెట్ పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. మహిళల ప్రయాణికుల సంఖ్య పెరిగిన మార్గాలలో బస్సులు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రతా కార్యక్రమాలను ముందుండి నిర్వహించాలని, పాఠశాలలో రోడ్డు భద్రత ప్రమాణాలపై పోటీ పరీక్షలు నిర్వహించాలని అన్నారు.

రెసిడెన్షియల్ పాఠశాలలో పిల్లలకు మెస్ చార్జీలు పెంచామని, వారికి రుచికరమైన నాణ్యమైన ఆహారం అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పిల్లలకు అందించే ఆహర నాణ్యతను కలెక్టర్లు , ఉన్నతాధికారులు తనిఖీ చేయాలని, ఆహర సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు త్వరగా చెల్లిస్తున్నామని , నాణ్యత అంశంలో ఎక్కడ రాజీ ఉండవద్దని అన్నారు. రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లాడుతూ, జనవరి నెల మొత్తం రోడ్డు భద్రత ప్రమాణాల కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరిగే రొడ్డు ప్రమాదాలలో 75% డ్రైవర్ తప్పుల వల్ల జరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలు, పాటించాల్సిన నియమ నిబంధనల పై అవగాహన కల్పించాలని అన్నారు.రోడ్ల పై ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ ఏ ఆసుపత్రికి తీసుకుని రావాలి ఒక ప్రణాళిక ఉండాలని, దిని పై అవగాహన కల్పించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి జిల్లా స్థాయిలో ఉన్న రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం నిర్వహించి, ఆక్సిడెంట్ ప్రోన్ ఏరియా గుర్తించాలని, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.ప్రతి పాఠశాల పరిసరాలలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చిన్నతనం నుంచి ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన ఉండాలని అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై లోకల్ ఎఫ్.ఎం రేడియో, కేబుల్ చానల్స్ లో టెలికాస్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రోడ్లు, జాతీయ రహదారుల్లో అవసరమైన సైన్ బోర్డులు ఉండేలా జిల్లా రవాణా శాఖ అధికారి పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, రోడ్లు భవనాల శాఖ ఈఈ శ్రీనివాస్, రవాణా శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికలను గౌరవించాలంటూ పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ.

## విద్యార్థి దశ నుండే బాలికలను గౌరవించడం అలవర్చుకోవాలి తూప్రాన్ అసిస్టెంట్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి.



**తూప్రాన్, జనవరి,4. ప్రాజబలం ప్రతినిధి.** విద్యార్థులు పాఠశాల దశనుంచే బాలికలను గౌరవించడం నేర్చుకోవాలి అని తూప్రాన్ పోలీస్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మి అన్నారు. శనివారం తూప్రాన్ బస్టాండ్ వద్ద శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు నిర్వహించిన భారీ ర్యాలీ నీ ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికలపై మంచి సదభిప్రాయం కలిగి ఉండాలని, స్వంత చెల్లెలు అక్కలాగ భావించి సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ లక్ష్మి, పోలీస్ సిబ్బంది, డీన్ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కెసిఆర్ తో పాటు హరీష్ రావు కూడా జైలుకి వెళ్లాల్సిందేనని

జనగామ చిల్పూర్ మండలం మల్కాపూర్ లో గ్రామస్తులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అయన కల్వకుంట్ల కుటుంబం, మాజీ ఎమ్మెల్యే రాజయ్యలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. కల్వకుంట్ల కుటుంబం పది సంవత్సరాల పాలనలో... కొత్త రకమైన అవినీతికి తెరలేపింది. సాక్షాత్తు కేసీఆర్ బిడ్డ.. లిక్కర్ కుంభకోణంలో ఎన్ని రోజులు తీహార్ జైల్లో ఉందో అందరికీ తెలిసిందే. రేపో, మాపో ఫార్ములా ఇ రేసులో కేటీఆర్ జైలుకు పోవడం ఖాయమన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ పూర్తికాగానే... కెసిఆర్ తో పాటు హరీష్ రావు కూడా జైలుకి వెళ్లాల్సిందేనని జోస్యం చెప్పారు. కల్వకుంట్ల కుటుంబం వివిధ కేసుల్లో ఇరుక్కుని.. కొందరు జైలు ఊచలు లెక్కపెట్టి వస్తే. మరికొందరు జైలు ఊచలు లెక్క పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి 2014 కు ముందు ఉన్న ఆస్తులు... ఇప్పుడు ఉన్న ఆస్తులు ఎంతో ప్రకటించాలి. దళిత బందులో కమిషన్ తీసుకున్నవారు.. నీతులు మాట్లాడడం హాస్యాస్పదం. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు నీతులు మాట్లాడడం విడ్డూరం.

## జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో తూప్రాన్ విద్యార్థుల ఆవా అభినందించిన తూప్రాన్ మండల విద్యాధికారి పర్వతి సత్యనారాయణ.

### విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డీఈవో రాధా కృష్ణ.




**మెదక్, జనవరి, 4ప్రాజబలం ప్రతినిధి :-** మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్ట్ ను శనివారం ఉదయం నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్ కు సంబంధించిన ప్రశ్నపత్రాల సీల్డ్ కవర్ ను మండల విద్యాధికారి నీల కంఠం గారి చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. తెలుగుమీడియంలో ప్రథమ స్థానం టి.సంజన, నాగసన్ పల్లి, ద్వితీయ స్థానం డి.విశాల్ జడ్పీ హెచ్ ఎస్ వెంకటయపల్లి, తృతీయ స్థానం జి. సుజాత జడ్పీ హెచ్ ఎస్ (బాలురు) నర్సాపూర్, ఇంగ్లీష్ మీడియం లో ప్రథమ స్థానంలో జి.మానస కల్వకుంట, ద్వితీయ స్థానంలో కే.అక్షయ్ జడ్పీ హెచ్ ఎస్ (బాలురు) తుప్రాన్, తృతీయ స్థానంలో బి. కావేరి, జడ్పీ హెచ్ ఎస్ నస్కాల్, రెసిడెన్సియల్ విభాగం లో ప్రథమ స్థానం ఎన్.దశరథ్ రెసిడెన్షియల్ పాఠశాల తూప్రాన్, ద్వితీయ స్థానంలో కావేరి టీజి ఎంఎస్ శంకరంపేట్, తృతీయ స్థానంలో సంజయ్ రామస్వామి ఎం జె పి హవెలి ఘనపూర్, ప్రైవేట్ పాఠశాలల విభాగం నుండి ప్రథమ కే. సృజన గీత స్కూల్ చేగుంట, ద్వితీయ. సాయి కష్యప్ గీత స్కూల్ చేగుంట, తృతీయ మహాలక్ష్మి శ్రీ కృష్ణ వేణి స్కూల్ చేగుంట గెలుపొందిన విద్యార్థులకు డి ఈ ఓ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడానికి, పర్యావరణ పరిరక్షణకు, మంచి పౌరులకు తీర్చిదిద్దడానికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉపయోగపడే విధంగా బోధించాలని వారన్నారు. గెలుపొందిన విద్యార్థులను తూప్రాన్ మండల విద్యాశాఖ అధికారి పర్వతీ సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ మూర్తి ,టి పి టి ఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కొండల్ రెడ్డి,మెదక్ జిల్లా సోషల్ పోరం అధ్యక్షులు తిరున గిరి నర్సింలు ,ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేఖ,టి పి టి ఎఫ్ యుటిఎఫ్ అధ్యక్షులుయాదగిరి, పద్మారావు , తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, పిఆర్టియు జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ దేవయ్య, సోషల్ పోరం సభ్యులు రవిబాబు ,సిద్ధిరాములుశివరాజ్ ,కృపాకర్ రెడ్డి,సత్యనారాయణ,దేవి సింగ్,శ్రీనివాస్ ,ప్రసాద్ రెడ్డి,సంజీవ్ సాయిలు లింగం ఆంజనేయులు ,స్వరూప రాణి,పోచయ్య, వీరేశం, రఫీ,రాధా కృష్ణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి పంటకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 04 :** జిల్లాలోని గూడెం ఎత్తిపోతల పథకం క్రింద యాసంగి పంట చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్సాగర్రావు,మంచిర్యాల చీఫ్ ఇంజనీర్ బద్రినారాయణ, డి.ఈ. దశరథం లతో కలిసి రైతు సంఘాల ప్రతినిధులు, రైతులతో యాసంగి పంటకు సాగునీటి విడుదలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గూడెం ఎత్తిపోతల పథకం క్రింద యాసంగి పంట చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సాగునీటి విడుదలలో ఏమైనా సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, నీటి వృధాను నివారించేందుకు రైతులు తమ వంతు కృషి చేయాలని తెలిపారు.మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ యాసంగి పంటకు గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేసే సాగునీటిని రైతులు క్రమశిక్షణతో వినియోగించుకోవాలని,నీటి వృధా అరికట్టేందుకు అవసరమైన మెళకువలను సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకోవాలని తెలిపారు. రైతుల సౌకర్యార్థం సాగునీటిని విడుదల చేసేందుకు కార్యచరణ రూపొందించాలని, తదనుగుణంగా నీటిని విడుదల చేసే వివరాలను రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యచరణ ప్రకారం విడుదల చేసే నీటిని రైతులు సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు.యాసంగిలో గూడెం ఎత్తిపోతల పథకం క్రింద 69 వేల ఎకరాలు ఆయకట్టు సాగు అవుతుందని,దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల పరిధిలో రెండున్నర రోజులు,హాజీపూర్ మండల పరిధిలో 2 రోజుల పాటు సాగునీటిని విడుదల చేయడం జరుగుతుందని, ఈ నెల 5వ తేదీ నుండి ఏప్రిల్ 25వ తేదీ వరకు నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎ.ఈ.ఈ.లు జాకీర్, రాజేందర్, కీర్తి, సంబంధిత అధికారులు, రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి పట్టణంలో నీటి సమస్య తీర్చిన ర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి జిల్లా కేంద్రం 28వ వార్డు వెంగళరావు కాలనీ లో గత కొంతకాలంగా నీటి సమస్యతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది విషయాన్ని ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి తెలుపగా వారు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి నీటి సమస్యను తెలియజేయడం జరిగింది. వారు వెంటనే స్పందించి ఎమ్మెల్యే నిధులతో బోర్ వెల్ పంపించి బోర్ వేయించడం జరిగింది బోర్ లో సంపూర్ణంగా నీళ్లు రావడం జరిగింది వెంటనే స్పందించి నీటి కొరత తీర్చిన ఎమ్మెల్యే కి వెంగళరావు కాలనీవాసులు కోట్ల రవి సంతోషం వ్యక్తం చేస్తూ వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్ ,కౌన్సిలర్స్ నక్క రాములు వినోద్ గౌడ్ మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ దివాకర్ యాదవ్ పిట్టల శ్రీను జి సంగాకర హరి శంకర్ రమేష్ రిటైర్డ్ ఎంప్లాయిస్ మహిళలు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడాకారుడు రోహిత్ ను అభినందించిన డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్




**ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి జనవరి 4 (ప్రజాబలం)** కామేపల్లి మండలం పండి తాపురం గ్రామానికి చెందిన వంగివరపు రోహిత్ శర్మ గత సంవత్సరం డిసెంబర్ 27నుండి 30వ తారీకు వరకు జరిగిన ఉత్తరప్రదేశ్, మధుర లో టెన్నిస్ క్రికెట్ అండర్ 19, జాతీయ పోటీలలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచినందుకు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ప్రత్యేకంగా అభినందినించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ క్రీడల వలన మానసికోల్లాసము , ఆరోగ్యంతో పాటు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, ఈరోజులలో పోటీలో గెలవడం అంటే మాములు విషయం కాదని, క్రమశిక్షణ, ప్రతిభ ఉంటేనే తప్పసాధ్యపడదని, ఒక మామూలు సాధారణ పూజారి కుమారుడు ఆ స్థాయికి ఎదగటం చాలా గొప్ప విషయమని, ప్రతి విద్యార్థి స్ఫూర్తి గా తీసుకొని రాణించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బానోతు నరసింహ నాయక్, శీలం పుల్లయ్య, భూక్య నాగేంద్రబాబు, పాటిబండ్ల ప్రసాదు బద్దల శేఖర్ రబ్బానీ పాషా, అంబటిపూడి వెంకటయ్య, రాయల నాగ శంకర్, అంబడిపూడివెంకటేశ్వర్లు సీతారామాంజనేయ శర్మ మేకల లక్ష్మీనారాయణ మల్లికార్జున్ తిరపయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

## సెప్టిక్ ట్యాంక్‌లో జర్నలిస్టు మృతదేహం .. హైదరాబాద్‌లో కాంట్రాక్టర్ అరెస్టు

భోపాల్ జనవరి 4 జవనరి ఒకటో తేదీ నుంచి అదృశ్యమైన ఇండిపెండెంట్ జర్నలిస్టు ముకేశ్ చంద్రాకర్ మృతదేహాన్ని చత్తీస్‌ఘడ్‌లోని సెప్టిక్ ట్యాంక్‌లో గుర్తించారు. బీజాపూర్‌లోని చాతన్పారా బస్తీ లో ఆ జర్నలిస్టు బాడీని వెలికితీశారు. ముకేశ్ చంద్రాకర్.. ఎన్డీటీవీకి కాంట్రిబ్యూటింగ్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. కాంక్రీట్‌తో సీలింగ్ చేసిన సెప్టిక్ ట్యాంక్‌లో మృతదేహాన్ని గుర్తించినట్లు బీజాపూర్ పోలీసులు వెల్లడించారు. అతని శరీరం వాచిపోయింది. తల, వెన్నుకు పలు చోట్ల గాయాలు అయ్యాయి. దుస్తుల ద్వారా అతన్ని గుర్తించారు. ముకేశ్ మొబైల్ లొకేషన్ ఆధారంగా.. అతను చివరి సారి సురేశ్ చంద్రాకర్ కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్లు పసికట్టారు. సురేశ్‌ను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.ముకేశ్ రాసిన కథనాలకు అతని మరణం లింక్కైందా అన్న కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు. దోషుల్ని త్వరలో పట్టుకోనున్నట్లు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. బస్తర్ జంక్షన్ అన్న పేరుతో ముకేశ్ ఓ యూట్యూబ్ చానల్‌ను నడిపిస్తున్నాడు. దానికి 1.59 లక్షల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. బస్తర్ ప్రాంతంపై అతను పూర్తి ఫోకస్‌తో వీడియోలు చేసేవాడు. 2021లో మావోలు కిడ్నాప్ చేసిన సీఆర్పీఎఫ్ కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హాస్‌ను విడిపించడంలో ముకేశ్ కీలక పాత్ర పోషించాడు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులు హైదరాబాద్‌లో ఓ కాంట్రాక్టర్‌ను అరెస్టు చేశారు.

## జగన్ గాలిలో కాకుండా రోడ్లపైకి వచ్చి మేం చేసిన మంచిని చూడాలి నారా లోకేశ్



విజయవాడ, తమది ప్రజా ప్రభుత్వమని స్పష్టీకరణఇచ్చిన హామీలే కాకుండా హామీ ఇవ్వనివి కూడా అమలు చేస్తున్నామని వెల్లడి.ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎవరూ అడగకుండానే అమలు చేస్తున్నామని వివరణవిజయవాడ పాయకాపురం జూనియర్ కళాశాలలో ఇవాళ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించిన అనంతరం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను పద్ధతి ప్రకారం నెరవేరస్తున్నామని స్పష్టం చేశారు. హామీ ఇవ్వని పథకాలను కూడా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ఎవరూ అడగకుండానే ఇంటర్ విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గౌరవ పులివెందుల ఎమ్మెల్యే గారు గాలిలో కాకుండా రోడ్డుపైకి వచ్చి తాము చేస్తున్న మంచి పనులను చూడవచ్చని లోకేశ్ పేర్కొన్నారు. జగన్ ప్రజల్లోకి వచ్చి సమస్యలు తెలుసుకోవడంలో తప్పులేదు. ఇప్పుడు రోడ్లు కూడా మంచివి వేశాం, ఆయన నిర్భయంగా రోడ్లపైకి రావచ్చు. ఇంకా మేం చేయాల్సి చాలా ఉంది, అన్నీ చేస్తాం. జగన్ వచ్చి మేం అమలుచేస్తున్న మంచి కార్యక్రమాలు చూడాలని కోరుతున్నాం. రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తాం. గత ప్రభుత్వంలో మాదిరి మాది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం కాదు. ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రజాదర్బార్ ద్వారా సమస్యలు తెలుసుకుంటున్నాం. గత ప్రభుత్వ తప్పుల వల్ల రాష్ట్రం అప్పుల ఊబిలో చిక్కుకుంది. 4 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా 4 వేల పెన్షన్ అందజేస్తున్నాం. గత ప్రభుత్వం మూసివేసిన అన్నక్యాంటీన్లు తెరిచాం. ఉచిత గ్యాస్ పథకాన్ని ఇప్పటికే అమలు చేస్తున్నాం అని వివరించారు.

## షాద్ నగర్ నియోజకవర్గ పర్యటనపై మంత్రి సీతక్క సంతృప్తి



రంగారెడ్డి షాద్ నగర్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఫరూక్ నగర్ మండలం మధురాపురం, నందిగామ మండలం వీర్లపల్లి అప్ప రెడ్డి గూడా చేగురు గ్రామాల కు సంబంధించిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా రూ.35 కోట్ల 13 లక్షల రూపాయల నిధులతో బీటీ రోడ్డు సిసి రోడ్లు ఆయా ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టారు. కనివిని ఎరుగని రీతిలో మంత్రి సీతక్కకు వీర్లపల్లి శంకర్ అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ చరిష్మా కార్యకర్తల ఉత్సాహం నియోజకవర్గంలో అడుగడుగున మంత్రికి కనిపించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాగే నియోజకవర్గాన్ని కాపాడుకుంటూ భవిష్యత్తు తరాలకు కాంగ్రెస్ కంచుకోటగా నిలిచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమాలు అనంతరం మధ్యాహ్నం మంత్రి సీతక్కకు మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే శంకర్ స్వయంగా వడ్డించారు. ఎమ్మెల్యే శంకర్ తో పాటు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజి జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి మాజీ ఎంపీపీలు శివ శంకర్ గౌడ్, ప్రియాంక ఆయా మండలాల నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్యే శంకర్ స్వయంగా మంత్రికి భోజనాన్ని వడ్డించడం విశేషం.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com